

అత్యవసర పనులకు రూ.26.14 కోట్లు

- జలవనరులశాఖ అధికారుల ప్రతిపాదన
- నీటి సంఘాలకు అప్పగించే అవకాశం

ఒంగోలు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది సాగునీటి సరఫరాపై కూటమి ప్రభుత్వం ఇప్పటి నుంచే దృష్టి సారించింది. అధ్వానంగా ఉన్న కాలువలు, ఇతర వనరులకు అత్యంత అవసరంగా చేయాల్సిన పనులపై యంత్రాంగం నుంచి ప్రతిపాదనలు కోరింది. వైసీపీ పాలనలో సాగునీటి వనరుల నిర్వహణ దారుణంగా మారింది. కనీసం కాలువల్లో చిల్లచెట్ల తొలగింపు, పూడికతీత, అక్కడక్కడ దెబ్బతిన్న షట్టర్లు, డ్రాపుల మరమ్మతులు వంటి చిన్నచిన్న పనులకు కూడా నిధులు ఇవ్వలేదు. దాని వల్ల పొలాలకు నీరు చేరే క్రమంలో సగం వృథాగా పోయేది. జిల్లాలోని సాగర్ కాలువల్లో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపించింది.



దర్శి వద్ద దెబ్బతిన్న ఒంగోలు బ్రాంచి కాలువ లైనింగ్

ఈక్రమంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తక్షణం చేయాల్సిన పనులపై మూడు మాసాల క్రితమే దృష్టి సారించింది. ప్రస్తుత సీజన్‌లో నీటి సరఫరాకు ఉన్న ఆటంకాలను తొలగించింది. అలా ఉమ్మడి జిల్లాలో రూ.12 కోట్లతో పనులు చేశారు. జిల్లాలో అనేకచోట్ల మేజర్, మైనర్ కాలువలు అధ్వానంగా ఉన్నాయి. ఎన్ఎస్‌పీ పరిధిలోని ప్రధాన కాలువలతోపాటు మేజర్లు, మైనర్లు చిల్లచెట్లతో నిండిపోవడం, పూడిక పేరుకుపోయి

మిగతా 6వ పేజీలో



రామతీర్థం అవుట్‌ఫాల్ రెగ్యులేటరీ గేట్లనుంచి లీకవుతున్న నీరు (ఫైల్)



అయ్యో రామ

జిల్లాకు వరప్రదాయిని అయిన రామతీర్థం జలాశయం పరిస్థితి దారుణంగా తయారైంది. 72వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ.. ఒంగోలు, చీమకుర్తి, కనిగిరి, పామూరు, కందుకూరు పట్టణాలతోపాటు 45 గ్రామాలకు తాగునీరు అందించే బృహత్తరమైన రిజర్వాయర్‌ను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి ఉంది. అయితే అందుకు విరుద్ధమైన పరిస్థితులు నెలకొన్నాయి. దీని ఆలనాపాలనను గత వైసీపీ పాలకులు పూర్తిగా విస్మరించారు. జలాశయం వద్ద కనీసం విద్యుత్ సౌకర్యం కూడా లేకపోవడంతో అంధకారం నెలకొని ఉంది. ఔట్ ఫాల్ రెగ్యులేటర్ గేట్ల నుంచి యథేచ్ఛగా జలాలు లీకేజీ రూపంలో వృథాగా వెళ్తున్నాయి. అలా ఏళ్లతరబడి సాగుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు.

ప్రమాదంలో రామతీర్థం

- గేట్లకు లీకులు.. వృథాగా పోతున్న నీరు
- జలాశయం వద్ద కరెంట్ సౌకర్యం లేక అంధకారం
- చిల్లచెట్లతో నిండిపోయిన ప్రధాన కట్ట
- వెల్డింగ్ ఊడిపోయి వేలాడుతున్న గేటు
- నిర్వహణను గాలికొదిలేసిన గత పాలకులు
- కూటమి ప్రభుత్వమైనా పట్టించుకోవాలని రైతుల వినతి

చీమకుర్తి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రామతీర్థం జలాశయం సమస్యలమయంగా మారింది. ఏళ్లుగా నిర్వహణను పట్టించుకోకపోవడంతో అంతా అయోమయంగా తయారైంది. ఐదేళ్లుగా గత వైసీపీ ప్రభుత్వం రిజర్వాయర్‌కు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. దీంతో కనీస మరమ్మతులు కూడా కరువయ్యాయి. జలాశయాన్ని ప్రారంభించినప్పుడు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు నేడు అలంకారప్రాయంగా మారాయి. జలాశయానికి తూర్పు వైపునున్న ప్రధాన కట్ట మొత్తం చిల్లచెట్లతో నిండిపోయింది. దీంతో కట్ట ఉనికికే ప్రమాదం పొంచి ఉంది. కరెంట్ లేకపోవడంతో పవర్ గేట్లు సైతం పనిచేయక సిబ్బంది చేతితో తిప్పుతూ నీటిని విడుదల చేయాల్సి వస్తోంది. జలాశయం వద్ద కనీసం వాచ్‌మన్ కూడా లేకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. రిజర్వాయర్ పరిసరాల్లో సుందరీకరణ చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలనే ఆలోచనను గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చేశారు. కానీ ప్రస్తుతం అక్కడ పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ప్రాజెక్టు స్థితి ఇలా ఉంటే కొత్తగా జలజీవన్ మిషన్ కింద ప్రాజెక్టు పరిధిని మరింత విస్తృతపరచాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. రామతీర్థం వద్ద కొండపై నీటిశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటుచేసి ఎస్ఎన్‌పాడు, ఒంగోలు, దర్శి నియోజకవర్గాల్లోని దాదాపు 300కుపైగా గ్రామాలకు నూతనంగా రక్షిత జలాలను అందించాలని ఆలోచన చేస్తోంది.

నిర్వహణ బాధ్యత ఎవరిది?

రామతీర్థం జలాశయాన్ని 2009 ఫిబ్రవరి 25న అప్పటి సీఎం వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. నాటి నుంచి నిర్వహణ బాధ్యతలను ఎవరు చూడాలన్న విషయంపై స్పష్టత కరువైంది. జలాశయం దర్శి డివిజన్ పరిధిలో ఉండగా ఒంగోలు డివిజన్‌కు చెందిన ఏఈ ఒకరు, వర్క్ ఇన్‌స్పెక్టర్, లస్కర్ ఒక్కొక్కరు చొప్పున తాత్కాలిక ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం చీమకుర్తి డివిజన్‌కు చెందిన ఇరిగేషన్ శాఖ ఉద్యోగులు కేవలం జలాశయంలో ఉన్న నీరు విడుదల, నిలుపుదల పనులు మాత్రం చేస్తున్నారు. మిగతా విషయాలను పట్టించుకునే బాధ్యత

మిగతా 6వ పేజీలో

మొరాయించిన గేట్లు

సాగునీటి కోసం రైతుల ఇక్కట్లు

రామతీర్థం రిజర్వాయర్ ఔట్‌ఫాల్ రెగ్యులేటర్ వద్ద ఉన్న గేట్లు మొరాయించాయి. మొత్తం నాలుగు ఉండగా ఇప్పటికే మూడు పనిచేయడం లేదు. ఒకదాని నుంచి మాత్రమే జలాలను కిందికి వదులుతున్నారు. ఇప్పుడు ఈ ఒక్క గేటు కూడా వెల్డింగ్ ఊడిపోయి కిందకి, పైకి ఆపరేట్ చేయలేని స్థితిలో వేలాడుతోంది. దీంతో ఆ కొద్ది ఖాళీ నుంచి మాత్రమే దిగువకు నీరు సరఫరా అవుతున్నాయి. ప్రస్తుతం జలాశయం నిండుగా ఉంది. దీంతో నీటిని నిలుపుదల చేసే అవకాశం లేదు. సరఫరాను పెంచేందుకూ వీలు లేకుండా పోయింది. దీంతో దిగువనున్న కారుమంచి, త్రోవగుంట తదితర మేజర్ల కింద పంటలు సాగు చేసిన రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పొగాకు పంట వేసిన వారు సరిపడినన్ని జలాలు రాకపోతుండటంతో బుధవారం చీమకుర్తి-2 డీసీ అధ్యక్షుడు పాలడుగు వెంకటనారాయణ ఆధ్వర్యంలో నేరుగా జలాశయం వద్దకు వెళ్లారు. అక్కడి పరిస్థితిని చూసి అవాక్కయ్యారు. జలాశయం వద్ద బాగోగులు చూసేవారే కరువవడం, కనీసం కరెంట్ కూడా లేకపోవడాన్ని గమనించి ఇరిగేషన్ అధికారుల దృష్టికి ఇక్కడి దుస్థితిని తీసుకువెళ్లారు. ఈఈ రామకృష్ణతో డీసీ అధ్యక్షుడు మాట్లాడారు. తక్షణమే గేట్లకు మరమ్మతులను చేయించి పంటలను కాపాడాలని కోరారు. విజయవాడ, కర్నూలు నుంచి ప్రత్యేక సిబ్బందిని పిలిపించి కనీసం ఒక్క గేటుకైనా మరమ్మతులు చేయించి నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా చేసే ప్రయత్నంలో అధికారులున్నారు.



జలాశయం వద్ద గేటును పరిశీలిస్తున్న డీసీ చైర్మన్ వెంకటనారాయణ, రైతులు



కనిగిరిలో గొర్రెల మండిని పరిశీలించి కాపరులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, పక్కన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరిలో గొర్రెల మండి రాష్ట్రానికే ఆదర్శం

- జిల్లాలో మరికొన్ని చోట్ల ఏర్పాటుకు కృషి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

6లో

1న గృహప్రవేశాలు

- 2,944 మంది లబ్ధిదారుల చేతికి ఇళ్ల తాళాలు

ఒంగోలు నగరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వం ఫిబ్రవరి ఒకటో తేదీన సామూహిక పక్కా గృహాల ప్రారంభోత్సవాలు నిర్వహిస్తోంది. ప్రతి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించేందుకు గృహనిర్మాణశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, పక్కాగృహాల లబ్ధిదారులను భాగస్వాములను చేసి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా చర్యలు చేపట్టారు. జిల్లాలో ప్రభుత్వం

మిగతా 6వ పేజీలో



ఒంగోలులోని పీవీఆర్ హైస్కూలు మైదానంలో జరుగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. నిత్యం నాటకంతోపాటు సంగీతం, కోలాటం, నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుండగా వాటిని చూసేందుకు వేలాదిగా ప్రజలు తరలివస్తున్నారు. బుధవారం ప్రముఖ నాట్య గురువు డాక్టర్ కాజా సుబ్రహ్మణ్యం దర్శకత్వంలో గుంటూరు శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన విప్రనారాయణ నృత్యరూపకం భక్తిరసభరితంగా సాగింది.

నిర్లక్ష్యాన్ని సహించను

- ఉపాధి సిబ్బందిపై డ్వామా పీడీ ఆగ్రహం
- జిల్లాకు కొత్తగా 1,400 మినీ గోకులాలు మంజూరు

కొత్తపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పనులు ప్రారంభించకుండా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ గంగవరపు జోసఫ్‌కుమార్



కొత్తపట్నంలో ఉపాధి హామీ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ జోసఫ్‌కుమార్

హెచ్చరించారు. బుధవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాల ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశమయ్యారు. పనులు చేపట్టడంలో సిబ్బంది నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ పద్ధతి మార్చుకోకపోతే దూరప్రాంతాలకు బదిలీ చేయాల్సి వస్తుందని

మిగతా 6వ పేజీలో



చెరుకూరు చెరువులో కొట్టిన చిల్ల, తుమ్మ కర్రను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న కూలీలు

కలప దొంగలు

- చెరుకూరు చెరువులో తుమ్మ, చిల్లచెట్లు అక్రమంగా నరికివేత
- రూ.43లక్షలకు అమ్మకం
- పంచాయతీకి రూపాయి కూడా జమ చేయని వైనం
- ఆర్డీవోకు ప్రజల ఫిర్యాదు
- సాగునీటి సంఘం అధ్యక్షుడి పాత్ర ఉందని ఆరోపణ

పొన్నలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకూరు చెరువులో దొంగలు పడ్డారు. కలపను అక్రమంగా అమ్ముకుని పెద్దఎత్తున డబ్బులు స్వాహా చేశారు. దీనిపై చెరువు పరిధిలోని గ్రామాలకు చెందిన కొందరు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు నర్రా తిరుపతినాయుడి పాత్ర ఉందని వారు ఆరోపించారు. అందిన సమాచారం మేరకు.. చెరుకూరులోని సర్వే నంబర్ 674లో 284 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. అందులో తుమ్మ, చిల్లచెట్లు ఉన్నాయి. వీటిని విక్రయించేందుకు అధికారికంగా అటవీ, ఇరిగేషన్ శాఖ అనుమతులతో గ్రామ పంచాయతీ తరఫున బహిరంగ వేలం పాట నిర్వహించి, అధిక ధరకు పాడుకున్న వారికి అనుమతి ఇవ్వాల్సి ఉంది. అయితే ఇక్కడ అదేమీ జరగలేదు. తాజాగా చెరువుకు ఏర్పడిన సాగునీటి సంఘం బాధ్యుడు చెరువులోని చెట్లను లోపాయికారీగా దాదాపు రూ.43 లక్షలకు విక్రయించినట్లు తెలుస్తోంది. పంచాయతీకి మాత్రం రూపాయి కూడా జమ చేయలేదు. ఆ మొత్తం కలప వాస్తవ విలువ రూ.60లక్షలకుపైనే ఉంటుందని అంచనా. దీనిపై చెరువు పరిధిలోని రామన్నపాలెంతోపాటు చెరుకూరు, వెంకుపాలెం గ్రామాలకు చెందిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువులో చెట్లు విక్రయించడానికి

మిగతా 6వ పేజీలో

సదరమ్ సర్టిఫి'కేట్ల'పై విచారణ

- మండలాలవారీగా నోటీసుల జారీకి సిద్ధం
- ఇతర జిల్లాల వైద్యాధికారులతో పరిశీలన
- వచ్చేనెల నుంచి రిమ్స్, మార్కాపురం, గిద్దలూరు ఏరియా ఆస్పత్రులలో ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు
- రేపటితో ముగియనున్న ఆరోగ్య పింఛన్లపై విచారణ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : వివిధ రకాల వ్యాధుల పేరుతో సదరమ్ సర్టిఫికెట్లు పొంది పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారులపైనా కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. వారిని విచారణ చేసేందుకు వైద్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది. అందుకోసం మూడు కేంద్రాలను ఎంపిక చేసింది. ఒంగోలులోని రిమ్స్‌తోపాటు మార్కాపురం, గిద్దలూరు ఏరియా వైద్యశాలలో లబ్ధిదారుల సదరమ్ సర్టిఫికెట్లను ఇతర జిల్లాల నుంచి వచ్చే వైద్యాధికారులు పరిశీలన చేయనున్నారు. జిల్లాలో కేన్సర్, దివ్యాంగులు, మూగ, చెవిటి, అంధ తదితర రకాల సర్టిఫికెట్లతో పింఛన్లు పొందుతున్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ సానుభూతిపరులకు

మిగతా 6వ పేజీలో



ఆరోగ్య కోటీశ్వరుడు

7

- ఎక్కడికైనా సైకిల్‌పైనే ప్రయాణం
- దానిపైనే కార్యాలయానికి వెళుతున్న ఏఆర్ ఎస్సై

పశువైద్య సహాయకుడు ఆత్మహత్యాయత్నం

ఏడీ దూషించారని పురుగుమందు తాగిన వైనం

6

మెప్మా పీడీగా శ్రీహరి



శ్రీహరి



చిల్లచెట్లతో నిండిఉన్న జలాశయం ప్రధాన కట్ట

అయ్యో 'రామ'

(5వ పేజీ తరువాయి)

వారి మీద లేదు. రిజర్వాయర్‌కు సంబంధించిన మిగతా పనులు ఎవరు చూడాలన్నది ఇప్పటికీ మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. రిజర్వాయర్ ఔట్‌ఫాల్ రెగ్యులేటరీ వద్ద నాలుగు వెంట్‌లు ఉన్నాయి. ఒక్కో వెంట్‌కు రెండు చొప్పున మొత్తం ఎనిమిది గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తుంటారు. వీటిల్లో నాలుగు పవర్ గేట్లు కాగా మరో నాలుగు మాన్యువల్‌వి. పవర్ గేట్లు పనిచేయకపోగా మాన్యువల్ గేట్లలో రెండు మొరాయించడంతో నీటి సరఫరాపై నియంత్రణ లేకుండాపోతోంది. కాగా జలాశయం ప్రారంభం నుంచే ఈ సమస్య కొద్దిమేర ఉండగా కాలక్రమేణా నిర్వహణను గాలికొదిలేయడంతో పూర్తిగా కిందికి దిగడం లేదు. దీంతో నీటి సరఫరా నిలిపివేసినా ప్రయోజనం లేకుండాపోతుంది. గేట్ల బిగింపు సమయంలో నెలకొన్న హడావుడితోనే ఈ సమస్యకు బీజం పడిందని నిపుణులు తెలిపారు. జలాశయం సామర్థ్యం 85.34 మీటర్లు కాగా నీటిమట్టం 80 మీటర్లకు చేరుకోగానే లీకేజీ మొదలై నీరు వృథా అవుతోంది. ప్రస్తుతం దాదాపు 40 క్యూసెక్కుల మేర జలాలు లీకేజీ రూపంలో వృథా అవుతున్నాయి.

వెంటనే మరమ్మతులు చేయాలి

ఇటీవల అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని జలాశయాల గేట్ల మరమ్మతులపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టిపెట్టి నిధులు సాధించడం ద్వారా శాశ్వత ప్రతిపదికన సమస్యకు చెక్ పెట్టే అవకాశం ఉంది. గెలాక్సీ గ్రానైట్ క్వారీల నుంచి రాయల్టీలో భాగంగా ప్రభుత్వానికి చెల్లించే జిల్లా మినరల్ ఫండ్ కలెక్టర్ ఆధీనంలో ఉంటుంది. దాదాపు వంద కోట్ల మేర నిధులు అందుబాటులో ఉన్నాయి. అందులో కొంతమేర వెచ్చించి గేట్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపడితే జలాశయం లక్ష్యం నెరవేరుతుంది. ఆ దిశగా చర్యలు చేపట్టడంపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంపీ మాగుంట వినతితో కదిలిన సీఎం పేషీ

జలాశయం గేట్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఇటీవల సీఎం చంద్రబాబునాయుడికి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన సీఎం పేషీ.. గేట్ల మరమ్మతులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు రూ.45లక్షలు ఖర్చవుతుందని ఇరిగేషన్ అధికారులు అంచనాలు తయారుచేసి అనుమతి కోసం కలెక్టర్‌కు పంపారు. డీఎంఎఫ్ నిధులు ఉపయోగించి గేట్ల మరమ్మతులు నిర్వహించేందుకు కలెక్టర్ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి త్వరితగతిన అనుమతులు మంజూరైతే గేట్ల సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

ప్రతిపాదనలు పంపాం

చీమకుర్తి డివిజన్ పరిధిలో మేజర్, మైనర్ కాలువల అభివృద్ధికి రూ.5కోట్ల నిధులు అవసరమని ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే రామతీర్థం జలాశయంపై చిల్లచెట్లు తొలగింపుతోపాటు పలు అభివృద్ధి పనులు చేపడతాం. గత ఐదేళ్ల కాలంలో ఎటువంటి నిధులు మంజూరుకాకపోవడంతో ఏమీ చేయలేకపోయాం. ఇక జలాశయం వద్ద ఉద్యోగులను నియమించేందుకు సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించాలంటే ఏళ్ల తరబడి పెండింగ్ బిల్లులను చెల్లించాల్సి ఉంది. డీఎంఎఫ్ నిధులు మంజూరైతే గేట్ల మరమ్మతులు చేపడతాం.

\- రామకృష్ణ, ఈఈ, చీమకుర్తి



టంగుటూరు-పొదిలి రోడ్డు నిర్మాణం కోసం నిల్వ చేస్తున్న ఇసుక, కంకర

టంగుటూరు-పొదిలి రోడ్డు పనులకు మోక్షం

- మంత్రి స్వామి చొరవతో ఎట్టకేలకు కదలిన కాంట్రాక్టర్
- ప్రాథమిక చర్యలు ప్రారంభం

మర్రిపూడి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు-పొదిలి ఆర్‌అండ్‌బీ రహదారి పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి చొరవతో ఐదేళ్ల తర్వాత కాంట్రాక్టర్ కదిలారు. ప్రాథమిక పనులకు శ్రీకారం పలికారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రహదారి అభివృద్ధి పనులకు అప్పట్లో శాసనసభ్యులుగా ఉన్న ప్రస్తుత మంత్రి స్వామి రూ.39 కోట్లు మంజూరు చేయించారు. మర్రిపూడి మండలంలోని కూచిపూడి నుంచి పొదిలి అడ్డరోడ్డు వరకూ 16 కి.మీ తారు రోడ్డు, టంగుటూరులోని తహసీల్దార్ కార్యాలయం వరకు, పెట్లూరు గ్రామంలో 600 మీటర్లు సిమెంటు రోడ్డు, అదే గ్రామంలోని సహజానంద భారతీ దేవాలయం వరకూ రెండు వరసల రోడ్డుగా అభివృద్ధి చేయాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టెండర్లు ఖరారు అయినప్పటికీ పనులు చేస్తే నిధులు రావనే భయంతో కాంట్రాక్టర్ మిన్నకుండి పోయారు. ఐదేళ్లుగా రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు కూడా చేయకపోవడంతో దానిపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. మర్రిపూడి చెరువు కట్ట కింద అడుగడుగునా గోతులు ఏర్పడి తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కోనేరుల వద్ద ఏర్పాటు చేసిన రక్షణ గోడలు కూలిపోవడంతో ఎప్పుడు ఏప్రమాదం చోటుచేసుకుంటుందోనని మండల ప్రజలు హడలెత్తిపోతున్నారు. రోడ్డు దుస్థితిపై 'ఆంధ్రజ్యోతి' పలుమార్లు ప్రత్యేక కథనాలను ప్రచురించింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత నియోజకవర్గంలోని అతిపెద్దదైన టంగుటూరు-పొదిలి రోడ్డు అభివృద్ధిపై మంత్రి స్వామి ప్రత్యేక దృష్టి సారించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయించేందుకు సంబంధిత కాంట్రాక్టర్‌పై ఒత్తిడి పెంచారు. దీంతో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ ముందుకు వచ్చారు. ఇప్పటికే పెట్లూరు సమీపంలో ఇసుక, కంకర నిల్వ చేస్తున్నారు. కల్వర్టుల నిర్మాణానికి మార్కింగ్‌లు తీశారు.

అదనపు అంచనాలు

టంగుటూరు-పొదిలి రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా మరికొన్ని పనులను చేర్చి అదనపు అంచనాలను అధికారులు తయారు చేశారు. మర్రిపూడి చెరువు కట్ట కింద ఉన్న కోనేరులను పూడ్చి రెండు వరుసల రహదారిగా విస్తరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. దీంతోపాటు వాటర్ పైప్‌లైన్, విద్యుత్ స్తంభాలను మార్చేందుకు అంచనాలు వేస్తున్నారు. ఈ రహదారి అభివృద్ధి అయితే దర్శి, మార్కాపురం, కొండపి నియోజకవర్గ ప్రజలకు చెన్నై, కోలకతా జాతీయ రహదారితో అనుసంధానం ఏర్పడుతుంది. మొత్తం మీద నిర్మాణం పనులకు శ్రీకారం పలకడంపై మండల ప్రజలు మంత్రి స్వామికి కృతజ్ఞతలు తెలపడంతోపాటు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కనిగిరిలో గొర్రెల మండి రాష్ట్రానికే ఆదర్శం

కలెక్టర్ తమీమ్ అన్సారియా

కనిగిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కనిగిరిలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో గొర్రెలమండి ఏర్పాటు రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. కనిగిరిలో బుధవారం వివిధ కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. రోడ్డులోని పొగాకు బోర్డు ఎదురు ఇటీవల ప్రారంభమైన గొర్రెల మండిని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గొర్రెల పెంపకందారులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ మండీలను ఏర్పాటు చేసే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, నారపరెడ్డి(యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, బాలు ఓబులురెడ్డి, నంబులు కొండయ్య, నంబలు వెంకటేశ్వర్లు, తమ్మినేని వెంకటరెడ్డి, తాతపూడి స్టాలిన్, శ్యామల చినవెంకటేశ్వర్లు, గాయం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా శ్రీహరి

ఒంగోలు, కార్పొరేషన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా పి. శ్రీహరిని నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ బుధవారం ఎస్. సురేష్ కుమార్, ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పీడీగా ఉన్న తేళ్ళ రవికుమార్‌ను డీఆర్‌డీఏ ఇన్‌ఛార్జి పీడీగా నియమించగా, తాడేపల్లిలోని మెప్మా కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్ (స్టాటిస్టిక్స్)గా పనిచేస్తున్న శ్రీహరిని ఒక సంవత్సరం పాటు డిప్యూటేషన్‌పై నియమించారు. కాగా నూతన పీడీగా నియమితులైన శ్రీహరి రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

1న గృహ ప్రవేశాలు

(5వ పేజీ తరువాయి)

మంజూరుచేసిన పక్కా గృహాల్లో 2,944 నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిని ఒకటో తేదీన ప్రారంభించి లబ్ధిదారులకు తాళాలు అందజేయనున్నారు. కార్యక్రమాన్ని ప్రభుత్వం గత నెలలోనే నిర్వహించాలని చూసింది. అనివార్య కారణాలతో వాయిదా వేసింది. ఫిబ్రవరి ఒకటో తేదీన జిల్లాలో మార్కాపురం నియోజకవర్గంలో అత్యధికంగా 677, అత్యల్పంగా కొండపి నియోజకవర్గంలో 141 ఇళ్లల్లో ప్రవేశాలను నిర్వహించనున్నారు.

కలప దొంగలు

(5వ పేజీ తరువాయి)

వెంకుపాలెం గ్రామ పంచాయతీ అనుమతి తీసుకోవాల్సి ఉన్నప్పటికీ అలాంటిదేమీ లేకుండా నీటిసంఘం అధ్యక్షుడు ఏకపక్షంగా అమ్ముకోవడాన్ని ఆక్షేపిస్తున్నారు. ప్రభుత్వ ధనాన్ని ఆయన స్వాహా చేశారని ఆరోపిస్తున్నారు. దీనిపై చెరువు పరిధిలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన చెరుకూరి సురేష్‌బాబు, దాచర్ల నరసింగరావు తదితరులు కనిగిరి ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈవిషయమై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.

నిర్లక్ష్యాన్ని సహించను

(5వ పేజీ తరువాయి)

హెచ్చరించారు. ఇప్పటివరకు కూలీలతో ఎన్ని గ్రూపులు ఏర్పాటు చేశారు.. రోజువారీ ఎంతమంది పేదలకు పని కల్పిస్తున్నారు? అయన ప్రశ్నించగా సిబ్బంది సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. మండలంలో రెండు వేల మంది కూలీలు ప్రతిరోజూ పనులకు వచ్చేలా చూడకపోతే టెక్నికల్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. అమృత్ సరోవర్, ఫిష్ పాండ్స్ ట్రెంచింగ్ పనులు, హార్టికల్చర్, రైతువారీ కుంటలు వంటి పనులు ఉపాధి హామీ కింద గుర్తించాలన్నారు. ఉపాధి హామీ కింద చేపట్టే పనులు రైతులకు, గ్రామాలకు ఉపయోగకరంగా ఉండాలని ఆయన కోరారు. సమావేశంలో ఏపీడీ వెంకటస్వామి, ఏపీవో జ్యోత్స్న, ఈసీ చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ జోసఫ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 1,054 పశువుల షెడ్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. వీటిలో 700 షెడ్ల నిర్మాణం పూర్తయ్యిందన్నారు. ఇప్పుడు కొత్తగా గ్రామానికి రెండు షెడ్ల వంతున జిల్లాకు 1,400 మినీగోకుల షెడ్లు మంజూర య్యాయని ఆయన తెలిపారు. త్వరలోనే లబ్ధిదారులు ఎంపిక పూర్తిచేసి పనులు ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు.

సదరమ్ సర్టిఫి'కేట్ల'పై విచారణ

(5వ పేజీ తరువాయి)

ఇష్టం వచ్చినట్లుగా సర్టిఫికెట్లు జారీ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఏడునెలల క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బోగస్ లబ్ధిదారులపై పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆరోగ్య పింఛన్ల లబ్ధిదారులు విచారణ చేపట్టారు. జిల్లాలో ఐదు బృందాలు ఇంటింటికి వెళ్లి విచారణ చేయగా అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి.

ఆరోగ్య పింఛన్లపై ముగుస్తున్న విచారణ

ఆరోగ్య పింఛన్లపై చేపట్టిన విచారణ శుక్రవారం ముగియనుంది. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు ఆ విచారణ బృందాలు నివేదికలు ఇవ్వనున్నాయి. వాటిని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వైద్యశాఖ అధికారులు అందజేస్తారు. ఈ నేపథ్యంలో మిగిలిన పింఛన్లపై వైద్యశాఖ దృష్టి కేంద్రీకరించింది. లబ్ధిదారులకు జిల్లాలోనే సదరమ్ సర్టిఫికెట్లు ఇవ్వడంతో ఇప్పుడు ఆ విచారణ ఆ అధికారులతో కాకుండా ఇతర జిల్లాల వైద్యాధికారులు చేయనున్నట్లు తెలిసింది. అందుకోసం ఇప్పటికే మండలాల వారీగా జాబితాలను సిద్ధం చేసినట్లు తెలిసింది. డీఆర్‌డీఏ నుంచి అవసరమైన జాబితాలను కూడా వైద్యశాఖ అధికారులు తెప్పించుకొని మండలాల వారీ పరిశీలించినట్లు తెలిసింది. ఆ ప్రకారం ఎంపిక చేసిన మూడు కేంద్రాల్లో వైద్యాధికారులు సర్టిఫికెట్లను పరిశీలన చేయడంతోపాటు అవసరమైతే ఆయా ధ్రువీకరణ పత్రాల ఆధారంగా మరోసారి వైద్యపరీక్షలు చేయనున్నట్లు సమాచారం. ఆ పరీక్షలు స్థానిక డాక్టర్లు చేస్తే ఒత్తిళ్లు వచ్చే అవకాశం ఉండటంతో ఇతర జిల్లాల వైద్యాధికారులను అందుకోసం నియమించినట్లు సమాచారం.

అత్యవసర పనులకు రూ.26.14 కోట్లు

(5వ పేజీ తరువాయి)

గుర్రపుడెక్క వంటివి పెరిగాయి. దీంతో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడటంతోపాటు షట్టర్లు, డ్రాపులు దెబ్బతిని వృథాగా నీరు పోతోంది. అలాగే మీడియం వనరుల కాలువల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహా ఉండటాన్ని గుర్తించిన ప్రభుత్వం ఆ పనులు చేపట్టి వచ్చే ఏడాది (2025-26) పంటలకు నీటి సరఫరా సజావుగా సాగేందుకు చర్యలు తీసుకుంటోంది. ఆ తరహా పనులపై అధికారులను ప్రతిపాదనలను కోరింది. పక్షంరోజులుగా జలవనరులశాఖ అధికారులు ఈ ప్రతిపాదనలపై కసరత్తు చేసి ఒంగోలు సర్కిల్‌తో ఉన్న ఉమ్మడి జిల్లాలో ఎన్‌ఎస్‌పీ అలాగే మీడియం ఇరిగేషన్ పరిధిలో మొత్తం రూ.26.14 కోట్లతో అత్యవసర పనులు చేపట్టాలని ప్రతిపాదించారు.

సాగునీటి సంఘాలకు పనులు!

భారీ నీటివనరుల విభాగంలో ఉండే ఎన్‌ఎస్‌పీ కింద రూ.12.93కోట్లు ప్రతిపాదించగా చీమకుర్తి డివిజన్‌లో రూ.7.68 కోట్లు, అద్దంకి డివిజన్‌లో రూ.3.20 కోట్లు, దర్శి డివిజన్‌లో రూ.2.05 కోట్లు అవసరంగా నివేదించారు. మీడియం ఇరిగేషన్ విభాగంలో రూ.13.21 కోట్లకు ప్రతిపాదించగా అందులో ఒంగోలు డివిజన్ పరిధిలో రూ.8.26 కోట్లు, రాళ్లపాడు ప్రాజెక్టు పరిధిలో రూ.3.95కోట్లు, మార్కాపురం డివిజన్‌కు రూ.కోటి అవసరంగా పేర్కొన్నారు. ఆమేరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. కాగా ఈ పనులను సాగునీటి సంఘాల ద్వారా చేయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో కూడా టీడీపీ ప్రభుత్వంలో ఈ తరహా పనులను నీటిసంఘాల ద్వారా చేయిచారు. అదేతరహాలో ఈసారి కూడా సంఘాలకే వాటిని ఇవ్వనున్నట్లు సమాచారం. గతంలో రూ.5లక్షల వరకు ఉండే పనిని టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిపై ఇవ్వగా, ఈసారి ఆ మొత్తాన్ని రూ.10 లక్షలకు పెంచారు. ఇటీవలే సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగి కొత్త కమిటీలు రాగా త్వరలో వాటిని ఈ పనులు దక్కనున్నాయి.

కొత్తకొత్తగా ఉన్నదీ..

కళకళలాడుతున్న రహదారులు

- ఎమ్మెల్యే బీఎన్ చొరవతో రోడ్లుకు మహర్దశ
- హామీలను నెరవేరుస్తున్న కూటమి ప్రభుత్వం

నాగులుప్పలపాడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాలలోని రోడ్లు కొత్త కళను సంతరించుకొన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో మండల పరిధిలోని రోడ్లు అధ్వానంగా మారి అభివృద్ధికి నోచుకోక గతుకులు, గతుకుల రోడ్లతోనే గ్రామీణ ప్రాంతాల ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. జాతీయ రహదారి-216 నుంచి చేకూరపాడు వరకు గల రోడ్డు దెబ్బతిని గుంతల మయంగా మారింది. నరక ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి. అలాగే పాత చీర్వానుప్పలపాడు రోడ్డుది కూడా అదే కథ. వైసీపీ పాలనలో ఆయా రోడ్లు అభివృద్ధి చేస్తారేమోనని గ్రామస్థులు కళ్లు కాయలు కాచేలా ఎదురు చేసినా ఫలితం శూన్యం. ఈక్రమంలో ఎన్నికల నగారా మోగడంతో ప్రచారంలో భాగంగా చేకూరపాడు గ్రామానికి వచ్చిన బీఎన్.విజయ్‌కుమార్‌కు గ్రామస్థుల ప్రధాన సమస్యగా ఉన్న రోడ్డు నిర్మాణం చేపట్టాలని టీడీపీ నాయకులు, సర్పంచ్ కొమ్మినేని రమేష్‌బాబు ఆధ్వర్యంలో విన్నవించారు. ఇక పాత చీర్వానుప్పలపాడు గ్రామంలో ప్రచారంలో ఉన్న సమయంలో రోడ్డు నిర్మాణం చేయాలని సర్పంచ్ మేడికొండ చెన్నమ్మ ఆధ్వర్యంలో కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తానని బీఎన్ హామీ ఇచ్చారు. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు గ్రామీణ ప్రాంతంలోని రోడ్ల అభివృద్ధిపై ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ దృష్టి సారించారు. ఇచ్చిన హామీల మేరకు ఆరు నెలల కాలంలోనే 13 కిలోమీటర్లు కలిగిన చేకూరపాడు రోడ్డు, 2 కిలోమీటర్ల పాత చీర్వానుప్పలపాడు రోడ్డును తారురోడ్లగా అభివృద్ధి చేశారు. దీంతో మాట నిబెట్టుకొన్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఆయా గ్రామాల ప్రజలు అభినందిస్తున్నారు.



పాత చీర్వానుప్పలపాడుకు నిర్మించిన తారురోడ్డు



హైవే నుంచి చేకూరపాడు వరకు నిర్మించిన తారురోడ్డు



ఎమ్మెల్యే బీఎన్‌కు ధన్యవాదాలు

పాత చీర్వానుప్పలపాడులో అధిక బాగం ఎస్సీ జనాభా నివసిస్తుంటారు. గ్రామస్థులు నిత్యం తమ అవసరాలకు అనుగుణంగా ప్రయాణించే రోడ్డు దెబ్బతిని ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రచారానికి వచ్చిన సమయంలో రోడ్డు సమస్యను ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లాం. కూటమి ప్రభుత్వంలో వచ్చిన ఆరు నెలల్లోనే ఇచ్చిన మాట నిలబెట్టుకొని మా గ్రామానికి తారురోడ్డు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌కు ధన్యవాదాలు.

\- మేడికొండ మురళి, టీడీపీ నాయకుడు, పాతచీర్వానుప్పలపాడు



ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు..

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మా గ్రామం రోడ్డు అభివృద్ధి గురించి ఎవరూ పట్టించుకోలేదు. గుంతలమయంగా ఉన్న రోడ్డుపైనే ప్రయాణించాల్సిన దుస్థితి. ఎన్నికల సమయంలో తమ గ్రామానికి రోడ్డు ఏర్పాటు చేస్తానని ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ మా గ్రామానికి తారురోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. రోడ్డు సమస్య తీర్చిన ఎమ్మెల్యే బీఎన్‌కు రుణపడి ఉంటాం

\- కొమ్మినేని రమేష్‌బాబు, సర్పంచ్, చేకూరపాడు


గ్రామ వెటర్నరీ వైద్య సహాయకుడి ఆత్మహత్యాయత్నం

- ఏడీ దూషించాడని పురుగుమందు తాగిన ఏహెచ్‌ఏ

కనిగిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కనిగిరి వెటర్నరీ ఏడీ దూషించాడని గ్రామ వెటర్నరీ వైద్య సహాయకుడు (ఏహెచ్‌ఏ) పురుగు మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం జరిగింది. తోటి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం... కనిగిరి మండలంలోని దిరిశవంచ గ్రామానికి చెందిన కొత్తా వెంకటేశ్వర్లు అనే దివ్యాంగుడు పీసీపల్లి మండలంలోని వెంగళాయపల్లిలో గ్రామ వెటర్నరీ వైద్య సహాయకుడిగా విధులు నిర్వర్తిస్తుంటాడు. కనిగిరిలో స్నేహితుడితో కలసి రూంలో ఉంటూ విధులకు వెళ్లి వస్తుంటాడు. మంగళవారం వెంగళాయపల్లిలో పశువైద్య శిబిరం నిర్వహించారు. అధికారులు రావడం ఆలస్యం కావడంతో పశుపోషకులు తమ పశువులను తోలుకుని ఇళ్లకెళ్లారు. శిబిరంలో కేవలం 10 గేదెలు మాత్రమే ఉండటంతో ఏడీ ఆగ్రహించి వైద్య సహాయకుడిపై బూతు పురాణంతో విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం కనిగిరిలో రూంకు వచ్చిన వెంకటేశ్వర్లు పురుగుమందు తాగి అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. స్నేహితుడు వచ్చి చూసేసరికి నోటి వెంట నురుగు వస్తుండటంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స చేస్తున్నారు. అపస్మారక స్థితి నుంచి తేరుకున్న వెంకటేశ్వర్లు తమపై అధికారి ఏడీ తనను బూతులతో దూషించాడని, దానికి మనస్తాపం చెందానని తెలిపాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై ఏడీ శ్రీనివాసరెడ్డిని వివరణ కోరగా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నందున అతనిని మందలించానని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పశువైద్యశిబిరాల నిర్వహణను నీరుగారుస్తున్నారన్నారు.

7న విచారణకు హాజరుకానున్న వర్మ

ఒంగోలుక్రైం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సినిమా దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మపై నమోదైన కేసు సంబంధించి విచారణకు ఈనెల 7న హాజరవుతానని పోలీసులకు తెలిపారు. చంద్రబాబునాయుడు, లోకేష్, పవన్‌కల్యాణ్‌లపై అసభ్యకర పోస్టులు పెట్టిన వర్మపై మద్దిపాడు పోలీసు స్టేషన్‌లో గత ఏడాది నవంబరు 10న కేసు నమోదైన విషయం తెలిసిందే. ఆ నేపథ్యంలోనే నవంబరు 19, 25 తేదీలలో విచారణకు హాజరుకావాలని వర్మను ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు కోరారు. అయితే అతను హైకోర్టును ఆశ్రయించి అరెస్టు కాకుండా బెయిల్ తెచ్చుకున్నారు. అదేసమయంలో పోలీసుల విచారణకు సహకరించాలని కోర్టు ఆదేశించింది. దీంతో ఫిబ్రవరి 4న విచారణకు హాజరుకావాలని పోలీసులు వాట్సాప్ ద్వారా సమాచారమిచ్చారు. అందుకు రామ్‌గోపాల్‌వర్మ తనకు 4న షూటింగ్ షెడ్యూలు ఉందని, 7న విచారణకు రాగలనని సమాధానం ఇవ్వడంతో విచారణాధికారి అంగీకరించారు. దీంతో ఆర్జీవీ ఒంగోలు రూరల్ పోలీసు స్టేషన్‌లో హాజరుకానున్నారు.



ఆరోగ్య కోటీశ్వరుడు!

- నగర పరిధిలో ఎక్కడికైనా సైకిల్‌పైనే ప్రయాణం
- అదే వాహనంపై కార్యాలయానికి వెళుతున్న ఏఆర్ ఎస్సై

మోటారు వాహనాల వినియోగం పెరిగిన ఈ కాలంలో ఇప్పటికీ సైకిల్‌పైనే ప్రయాణం చేస్తున్నారు ఈ పోలీసు అధికారి. 54 ఏళ్ల వయస్సులోనూ ఉత్సాహంగా సైకిల్‌పైనే ప్రయాణిస్తున్నారు. తనకు ఎటువంటి అనారోగ్య సమస్య లేకపోవడానికి సైకిల్ తొక్కడమే ప్రధాన కారణమని చెబుతున్నారు. ఆయనే ఒంగోలు ఏఆర్ ఎస్సైగా పనిచేస్తున్న సోమేపల్లి కోటేశ్వరరావు. ఈయన వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ముండ్లమూరు బుచ్చయ్య, రమణమ్మలకు కోటేశ్వరరావు నాలుగో సంతానం. మిగిలిన ముగ్గురు అన్నలు పొలం పనులు చేస్తుంటారు. చివరి వాడైన కోటేశ్వరరావును తల్లిదండ్రులు చదివించారు. 1990లో కానిస్టేబుల్ ఉద్యోగం సంపాదించి ప్రస్తుతం ఉద్యోగ ఉన్నతితో ఒంగోలులో ఏఆర్ విభాగంలో ఎస్సైగా పనిచేస్తున్నారు. చిన్నప్పటి నుంచి పేదరికంలో పెరిగిన కోటేశ్వరరావుకు సైకిల్ తొక్కడం అంటే ఎంతో ఇష్టం. ఆరేళ్లుగా పూర్తిగా సైకిల్‌పై ప్రయాణం చేస్తున్నారు. నగరంలో ఎక్కడికెళ్లాలన్నా సైకిల్‌ను ఉపయోగిస్తారు. కార్యాలయానికి కూడా అదే వాహనంపై వెళుతున్నారు. తన ఆరోగ్యం మెరుగ్గా ఉండటానికి సైకిల్ వినియోగం ఒక కారణమని ఆయన చెబుతున్నారు. ఇప్పటికీ ఎటువంటి జబ్బులు దరిచేరలేదని చెప్పారు.

- ఒంగోలు క్రైం, (ఆంధ్రజ్యోతి)



నగరంలో మహిళల వాహన ర్యాలీని ప్రారంభిస్తున్న మేయర్ గంగాడ సుజాత

హెల్మెట్‌తో ప్రాణాలు కాపాడుకో..

రహదారి భద్రతా వారోత్సవాల్లో ర్యాలీని ప్రారంభించిన మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు క్రైం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహన చోదన చేసే మహిళలు విధిగా హెల్మెట్ ధరించాలని నగర మేయర్ గంగాడ సుజాత పిలుపునిచ్చారు. బుధవారం రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా నగరంలో మహిళలతో రవాణాశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రహదారి నిబంధనలు అందరూ పాటించాలని సూచించారు. రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల మాట్లాడుతూ రహదారి భద్రతా వారోత్సవాలు ఈనెల 16 నుంచి వచ్చే నెల 15 వరకు జరుగుతాయని తెలిపారు. ప్రజలకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటుగా వారి తల్లి దండ్రులను చైతన్యపరిచే విధంగా కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ప్రకాశం భవన్ వద్ద నగర మేయర్ గంగాడ సుజాత జెండా ఊపీ ర్యాలీని ప్రారంభిచారు. కోర్టు సెంటర్, పద్మాలయ బేకరీ, సాయిబాబా గుడి, మంగమూరు రోడ్డు జంక్షన్, జిల్లా పోలీసు కార్యాలయం, అద్దంకి బస్టాండ్ మీదుగా కొత్తపట్నం బస్టాండ్‌కు వచ్చి తిరిగి ప్రకాశం భవన్ వద్దకు ర్యాలీ చేరింది. కార్యక్రమంలో ఎంవీఐలు కిరణ్ ప్రభాకర్, సురేంద్ర ప్రసాద్, రామచంద్రరావు, భాస్కరరెడ్డి, రవికుమార్, ఏఎంవీఐలు భాను ప్రకాష్, ధర్మేంద్ర, ఏవో శ్రీనివాసరావు ఉన్నారు.

జిల్లా అభివృద్ధికి సహకారం అందించాలి

సీఎంను కోరిన ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కంభం చెరువు అభివృద్ధితో పాటు విమానాశ్రయం, సంగీత- నృత్య కళాశాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సీఎం చంద్రబాబు నాయుడిని కోరారు. పార్లమెంట్‌సభ్యులతో జరిగిన పార్లమెంటరీ కమిటీ సమావేశం అనంతరం మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై లిఖితపూర్వకంగా కోరారు. గిద్దలూరు నియోజకవర్గంలోని కంభంచెరువు అభివృద్ధితో పాటు చెరువులోని 8 కొండలకు అష్టదిగ్గజాల పేర్లు పెట్టాలని కోరారు. ఒంగోలు సమీపంలో విమానాశ్రయం ఏర్పాటుపై కేంద్ర నిపుణుల బృందం, రాష్ట్ర నాయకులు, అధికారులతో కలిసి ఇటీవల పరిశీలించారని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఒంగోలు సమీపంలోని అల్లూరు-ఆలూరు మధ్య ఉన్న 657 ఎకరాల స్థలాన్ని పరిశీలించారని, అందులో ప్రభుత్వ స్థలం పోను మిగతా స్థలానికి కేవలం రూ.115 కోట్లు సరిపోతుందని, అందువల్ల కేంద్ర పౌరవిమానయాన మంత్రి, అధికారులతో సంప్రదించి విమానాశ్రయాన్ని మంజూరు చేయించాలని మాగుంట కోరారు. త్యాగరాజస్వామి, శ్యామశాస్త్రి జిల్లాకు చెందిన వారేనని, అందువల్ల జిల్లాలోని ఔత్సాహిక విద్యార్థులు, కళాకారులకు నాణ్యమైన శిక్షణ ఇచ్చేందుకు సంగీతం, నృత్య కళాశాలను ఒంగోలులో ఏర్పాటు చేయాలని సీఎంను కోరారు. కంభం చెరువు అభివృద్ధికి రూ.9,585 కోట్లు మంజూరు చేసి చెరువులో ఉన్న 8 చిన్న కొండలకు అష్టదిగ్గజాలు అల్లసాని పెద్దన్న, నంది తిమ్మన, మాదయ్యగారి మల్లన్న, దూర్జటి, పింగళి సూరన, రామరాజభూషణుడు, తెనాలి రామకృష్ణ పేర్లు పెట్టే విధంగా చూడాలని సీఎంను మాగుంట కోరారు. ఆయా అంశాలపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించి వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు మాగుంట చెప్పారు.



సీఎం చంద్రబాబుతో మాట్లాడుతున్న ఎంపీ మాగుంట

పదో తరగతి పరీక్షల నిర్వహణకు ప్రణాళిక

ప్రతి మూడు రోజులకు ఇన్విజిలేటర్ల మార్పు

ఒంగోలు విద్య, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మార్చి 17 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ కెవి.శ్రీనివాసులురెడ్డి కార్యాచరణ ప్రణాళికను విడుదల చేశారు. ఏర్పాట్లకు సంబంధించి ప్రతి పనినీ నిర్దిష్ట కాల పరిమితిలో పూర్తి చేయాలని డీఈవోలు, ఆర్జేడీలు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్లను ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులను మాత్రమే వినియోగించాలన్నారు.

- సమస్యాత్మక పరీక్షా కేంద్రాలకు సమర్థవంతమైన హెచ్‌ఎంలు, సీనియర్ స్కూలు అసిస్టెంట్లను చీఫ్‌లు, డీవోలుగా నియమించాలి. అవసరమైతే ఇతర పాఠశాలల హెచ్‌ఎంలను చీఫ్‌లు, డీవోలుగా నియమించమన్నారు.
- ఫిబ్రవరి 8 నుంచి 11లోపు కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రత్యేకంగా సమన్వయ సమావేశాలు నిర్వహించి పరీక్షల నిర్వహణలో అన్ని శాఖల సహకారం తీసుకోవాలి.
- ఫిబ్రవరి 12 నుంచి 15 లోపు రూట్ ఆఫీసర్లు, జాయింట్ కస్టోడియన్లను నియమించాలి. మండల విద్యాధికారులను రూట్ అధికారులుగా నియమించాలి.
- ఫిబ్రవరి 17, 18 తేదీల్లో పరీక్షా కేంద్రాల చీఫ్‌లు, డీవోలకు డివిజన్ స్థాయి సమావేశాలు నిర్వహించి శిక్షణ ఇవ్వాలి. ఈ సమావేశాలకు రూట్ ఆఫీసర్లు, జాయింట్ కస్టోడియన్లు కూడా హాజరుకావాలి.
- ఫిబ్రవరి 19 నుంచి 26లోపు పరీక్షా కేంద్రాలకు ఇన్విజిలేటర్లను నియమించి వారికి నియామక ఉత్తర్వులు జారీ చేయాలి. పరీక్షా కేంద్రాలకు ప్రతి మూడు రోజులకు ఇన్విజిలేటర్లను మార్చాలి.
- సమస్యాత్మక, సున్నితమైన పరీక్షా కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. ప్రతి జిల్లాలో సమస్యాత్మక కేంద్రాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా విదాయశాఖాధికారులు వచ్చేనెల 3వ తేదీ నాటికి సమస్యాత్మక కేంద్రాల జాబితాను పంపించాలని డైరెక్టర్ ఆదేశించారు.
- మార్చి 1వ తేదీ నాటికి జిల్లాలో పరీక్షల నిర్వహణకు సంబంధించి పరీక్షా కేంద్రాలు, రూట్లు, సిబ్బంది నియామకం ఇతర పూర్తి వివరాలతో కమ్యూనికేషన్ ప్లానర్‌ను తయారు చేసి పంపించాలని డైరెక్టర్ ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

రెవెన్యూ సదస్సుల్లో అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

పామూరు, జనవరి 29 ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ గ్రామసభల్లో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. పామూరు తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆమె సందర్శించారు. రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా దూబగుంటకు చెందిన రైతు తనను పొలంలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, అసైన్డ్‌మెంట్ భూమిలో లేటట్లు వేసి తమకు దారిలేదని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, న్యాయం చేయాలని సూరిపోగు చినశివరామయ్య, గర్నిపూడి చిన్నయ్యలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గుమ్మలంపాడులో ఉన్న 150 ఎకరాల భూమి సమస్యను పరిష్కరించి తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని అబ్బూరి శేషయ్య, దామచర్ల రవీంద్ర కలెక్టర్‌ను కోరారు. వెంటనే భూమికి సంబంధించిన పూర్తి వివరాలు తనకు అందజేయాలని వీఆర్వోను కలెక్టర్ ఆదేశించారు. జీరో ఖాతాల భూముల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఓగూరు ఏడుకొండలు కోరగా జేసీ లాగిన్‌లో ఉందని పరిష్కరించేలా చర్యలు తీసుకొంటామన్నారు. సెలవుపై ఉన్న పామూరు తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశామని కలెక్టర్ చెప్పారు.



మోపాడు రిజర్వాయర్ ను పరిశీలిస్తున్న కలెక్టర్‌అన్సారియా, ఎమ్మెల్యే ఉగ్ర

మోపాడు రిజర్వాయర్‌ను పరిశీలించిన కలెక్టర్

మండలంలోని మోపాడు రిజర్వాయర్‌ను కలెక్టర్ ఎమ్మెల్యే ఉగ్రతో కలిసి సందర్శించారు. జైకో నిధులతో జరుగుతున్న పనులను పరిశీలించారు. రిజర్వాయర్ కట్టకు పలుచోట్ల పడిన గండ్లను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. రిజర్వాయర్ ఆనకట్టపై రెండు వాహనాలు వెళ్లే విధంగా డబుల్ రోడ్డుగా నిర్మించాలని ఎమ్మెల్యే ఉగ్ర జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేశవవర్ధనరెడ్డి, డిప్యూటి తహసీల్దార్ బ్రహ్మయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, ప్రాజెక్టు సూపర్ చైర్మన్ వైస్ చైర్మన్లు చుంచు కొండయ్య, ఎం నరసింహారావు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, సయ్యద్ అమీర్‌బాబు, వై ప్రసాద్ రెడ్డి, డీ కండబాబు, ఎం గిడ్డయ్య యాదవ్, డీ మాల్యాద్రి, మెంటా నరసింహారావు, ఇరిగేషన్ డీఈ విజయభాస్కరరెడ్డి, ఏఈ సీహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు.



విప్రనారాయణ నృత్య రూపకం ప్రదర్శన

నయనమనోహరం విప్రనారాయణీయం

అలరిస్తున్న ఎన్టీఆర్ కళాపరిషత్ నాటకోత్సవాలు

ఒంగోలు కల్చరల్, జనవరి29(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పీవీఆర్ స్కూలు మైదానంలో జరుగుతున్న ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాలు ప్రతిరోజు ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందజేస్తున్నాయి. నిత్యం సంగీతం, కోలాటం, నాటకం, నృత్యం వంటి నాలుగైదు ప్రదర్శనలు ఏర్పాటు చేయగా వాటిని చూసేందుకు వేలాదిగా ప్రజలు తరలివస్తున్నారు. ఇక బుధవారం సాయంత్రం బొట్లగూడూరుకు గోనుగుంట నాగరాజు బృందం నాదస్వర కచేరి శ్రవణానందకరంగా కొనసాగింది. వెంకటగిరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాదస్వరంపై గోనుగుంట నాగరాజు, గుడ్లూరు ఏడుకొండలు, డోలుపై రాజంపల్లి శ్రీనివాసులు, కందుకూరి ముత్యాలు పలు శాస్త్రీయ గీతాలను రసరమ్యభరితంగా వినిపించారు. అనంతరం శంకరాపురం ఎంపీయూపీ స్కూలు విద్యార్థుల కోలాట ప్రదర్శన సైతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. జాస్తి లక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు పలు జానపద గీతాలకు చక్కటి కోలాటాన్ని ప్రదర్శించారు. అనంతరం వారిని ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు, ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబులు ప్రశంసించి ప్రదర్శనా పారితోషికాన్ని, జ్ఞాపికను బహూకరించారు.



జానపద గీతాలకు చిన్నారుల నృత్యం

డ్రగ్స్‌పై చర్చా వేదిక

ఇక వివిధ అంశాలపై ప్రజలను చైతన్యపరిచే దిశగా నిత్యం నిర్వహించే స్వల్పకాలిక చర్చలో భాగంగా బుధవారం డ్రగ్స్ అవేర్‌నెస్ అనే అంశంపై చర్చ జరిగింది. ప్రస్తుతం సమాజంలో అనేకమంది ముఖ్యంగా యువత గంజాయి వంటి మత్తుపదార్థాలకు బానిసలు అయి తమ జీవితాలను ఏవిధంగా నాశనం చేసుకుంటున్నదీ తల్లిదండ్రులు వారిని చూసి ఏరకంగా కుమిలిపోతున్నదీ చర్చలో పాల్గొన్న వారు సవివరంగా చర్చించారు. బెజవాడ వెంకట్రావు చర్చకు సంధానకర్తగా వ్యవహరించగా మత్తు పదార్థాలకు తాము దూరంగా ఉంటూ వాటికి బానిసలైన వారిలో మార్పు తెచ్చేందుకు కృషిచేస్తామని ప్రేక్షకుల చేత ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు ప్రమాణం చేయించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

అనంతరం ఒంగోలుకు చెందిన డ్రీమ్స్ హైస్కూల్, ఆక్స్‌ఫర్డ్ హైస్కూలు విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇటు శాస్త్రీయ గీతాలకు అటు సినీ గీతాలకు వారు చక్కటి నృత్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నారు.

విప్రనారాయణ నృత్యరూపకం

ప్రముఖ నాట్య గురువు డాక్టర్ కాజా సుబ్రహ్మణ్యం దర్శకత్వంలో గుంటూరు శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన విప్రనారాయణ నృత్యరూపకం భక్తిరసభరితంగా కొనసాగింది. విష్ణుభక్తుడైన విప్రనారాయణుడు మన్నార్ గుడిలో కొలువైన రాజగోపాలుని సేవించటానికి ఆ ప్రాంతానికి చేరుకుని చక్కటి పూలతోట ఏర్పాటుచేసి భగవంతుని పూజిస్తాడు. రాజు ఆస్థానంలో నర్తించే నర్తకి విప్రనారాయణుడిని చూసి అతన్ని పలుకరించగా అది గమనించకుండా స్వామి పూజలో మునిగిన విప్రనారాయణుడిని ఏవిధంగానైనా వశపరచుకోవాలని ఆ నర్తకి దాసరి స్త్రీగా వేషం కట్టడం విప్రనారాయణుడు ఆమెతో ప్రేమలో పడటం ఆమెను విడిచిఉండలేకపోవటం వంటి సన్నివేశాలను తమ నృత్యాల ద్వారా నృత్య కళాకారులు చక్కగా ప్రదర్శించారు.

'కేసుల నుంచి విముక్తి పొందినవారు క్రమశిక్షణతో మెలగాలి'

గిద్దలూరు టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కేసుల నుంచి విముక్తి చెంది బయటకు వచ్చిన వారు క్రమశిక్షణతో మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కె.శ్యాంబాబు అన్నారు. బుధవారం పట్టణంలోని సబ్ జైలును ఆయన తనిఖీ చేశారు. విచారణలో ఖైదీలను ఉంచే రూములను, సదుపాయాలను పరిశీలించారు. సదుపాయాలు ఎలా ఉన్నాయని విచారణ ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. శ్యాంబాబు మాట్లాడుతూ న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్థోమత లేనివారు ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేసుకోవచ్చని, సంబంధిత న్యాయసేవాధికార సంస్థకు దరఖాస్తు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ పి.రవీంద్రనాథ్, లీగల్ ఎయిడ్ న్యాయవాది పోలయ్య పాల్గొన్నారు.

జగన్ కుటుంబం లూటీ రూ.8లక్షల కోట్లు

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్



సంతనూతలపాడు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లపాలనలో అధికారం అడ్డుపెట్టుకుని జగన్ కుటుంబం రూ.8లక్షలకోట్లు లూటీ చేసిందని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. జగన్‌రెడ్డి భూకేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్‌కు అనుమతుల పేరుతో ఇష్టమొచ్చినట్లు దోచుకున్నారన్నారు. గడిచిన ఏడునెలల్లో ఆరోగ్యశ్రీ, ధాన్యం బకాయిలు, ఫీజు రియంబర్స్‌మెంట్ తదితర వాటికి సంబంధించి గత ప్రభుత్వం పెట్టిన రూ.22వేలకోట్ల బకాయిలను అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చెల్లించిందని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో గత ప్రభుత్వ పాపానికి ఏడాదికి రూ.71వేలకోట్లు అసలే చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆంధ్రప్రదేశకు గుండెకాయలాంటి సచివాలయాన్ని సైతం తాకట్టు పెట్టారని, రాష్ట్రంలో వైసీపీ పాలనలో ప్రజావ్యతిరేక పరిపాలన నడిచిందన్నారు. పరిపాలన అంటే సీఎం చంద్రబాబును చూస్తే తెలుస్తుందని పేర్కొన్నారు.

మోడల్ ప్రైమరీ పాఠశాల వ్యవస్థను స్వాగతిస్తున్నాం

● తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి స్వామి

ఒంగోలు(రూరల్), జనవరి29(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామ పంచాయతీలో ఒక మోడల్ ప్రైమరీ పాఠశాలను ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం నాయులు(టీఎన్ఎస్‌యూ) పేర్కొన్నారు. బుధవారం విజయవాడలో వారు మంత్రి స్వామిని, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో కలిసి విద్యా విషయాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ గతప్రభుత్వం 117 జీవో తీసుకొచ్చి విద్యా వ్యవస్థను నాశనం చేశారన్నారు. ఇప్పుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ జీవోను రద్దు చేసి ఇచ్చిన మాట నిలపెట్టుకున్నారని తెలిపారు. కాగా మంత్రి స్వామి సంఘ క్యాలెండరు, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మన్నం శ్రీనివాసరావు, శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు, వెంకట్రావుయాదవ్, అరైబోయిన రాంబాబు, మేడా రామలింగం, బాలస్వామి, ఎస్.జగదీష్ పాల్గొన్నారు.

అయ్యో.. ఎంతకష్టం వచ్చిందో..

● ఉరి వేసుకుని యాచకుడి ఆత్మహత్య



వేలాడుతున్న మృతదేహం

ఒంగోలు క్రైం, జనవరి29(ఆంధ్రజ్యోతి): మూడు చక్రాల రిక్షాలో కూర్చుని యాచన చేసుకునే గుర్తు తెలియని వ్యక్తి ఒంగోలులో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యాచకునకు ఎంత కష్టం వచ్చిందోనని ప్రజలు చర్చించుకున్నారు. ఈ సంఘటన స్థానిక రంగారాయుడు చెరువు సమీపంలో కామాక్షమ్మ గుడి వద్ద వెలుగు చూసింది. సుమారుగా ఐదు పదులు పైబడిన వ్యక్తి గతంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద టీకొట్టులో పని చేసినట్లు చెబుతున్నారు. ఇటీవల కొంత కాలం నుంచి మూడు చక్రాల బండిపై తిరుగుతూ యాచకుడిగా జీవనం సాగిస్తున్నాడు. అయితే బుధవారం తెల్లవారే సరికి దేవాలయం ఐరన్ మెట్లకు ఉరివేసుకొని మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్ళి పరిశీలించారు. అక్కడ అతను తిరిగే మూడు చక్రాల రిక్షా పక్కన నిలిపి ఉంది. అతని సంబంధించిన ఎలాంటి వివరాలు దొరకలేదు. వన్‌టౌన్ పోలీసులు ఆత్మహత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

9న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వచ్చేనెల 9వతేదీన స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జరుగుతుందని జడ్పీ సీఈవో చిరంజీవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, శాసన సభ్యులు హాజరవుతారని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు సంబంధిత సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

సీఐ శ్రీకాంత్‌బాబుకు సత్కారం

మద్దిపాడు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌బాబును పెద్దకొత్తపల్లి దర్గా కమిటీ సభ్యులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈనెల 26న పెద్దకొత్తపల్లి దర్గా ఉరుసు కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలి వచ్చినపుడు సీఐ శ్రీకాంత్‌బాబు, ఎస్సై శివరామయ్యల పర్యవేక్షణలో భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ మస్తాన్ మాటాడుతూ దర్గా 40 సంవత్సరాల చరిత్రలో ఉరుసు ఉత్సవం ప్రశాంతంగా జరిగిందన్నారు. కార్యక్రమంలో మరిపూడి చంద్రబాబు, షేక్ మస్తాన్‌వలి, గౌస్‌బాషా, రాజారెడ్డి, ఎస్‌కే.జమీర్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

1న మండల సర్వసభ్య సమావేశం

మద్దిపాడు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండల సర్వసభ్య సమావేశం ఫిబ్రవరి 1వ తేదీన నిర్వహించనుననట్లు ఎంపీడీవో వి.జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ వాకా అరుణ అధ్యక్షతన జరుగుతుందని, అన్ని శాఖలకు సంబంధించిన అంశాలపై అధికారులు సమగ్ర నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని ఆమె కోరారు.

15న చీమకుర్తిలో మాలకళల మహాజాతర

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తిలో ఫిబ్రవరి 15వతేదీన మాలకళల మహాజాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దళిత సంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు తెలిపారు. స్థానిక పాత రిమ్స్‌లోని జేడీశీలం లైబ్రరీలో బుధవారం మహాజాతర కరపత్రాలను నిర్వహకులు దండేల కృష్ణ, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిళ్ళా వసంతరావులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలకళలు, ఊరువులనృత్యాలు, మాస్టిన్ మాలల యుద్ధ విన్యాసాలు, కోలాటాలు, కర్రసాము, కత్తిస్వాము, బేతాళ యక్షగానం, కంజర కథలు, హరిదాసులు, కాటిపాపలు, బుర్రకథ తదితర 30 రకాల కళలను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. అనంతరం మాల కన్నమనీడు కాలభైరవ ఖడ్గం ప్రదర్శన ఉంటుందని చచెప్పారు. ముఖ్యఅతిధిగా వాగ్గేయకారుడు, తెలంగాణా ఎంఎల్‌సీ గోరేటి వెంకన్న, మాలమహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు, పలువురు ప్రముఖులు పాల్గొంటారన్నారు. ఈ జాతరలో మాలలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఈ-పంట నమోదుకు ఈకేవైసీ తప్పనిసరి



పొగాకును పరిశీలిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్‌బాబు

సంతనూతలపాడు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ-పంట నమోదుకు ఈకేవైసీ నమోదు తప్పనిసరని ఒంగోలు సహాయ వ్యవసాయ సంచాలకుడు బి.రమేష్‌బాబు తెలిపారు. బుధవారం మండలంలోని ఎండ్లూరు, పేర్నమిట్ట గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన పాల్గొని రైతులతో మాట్లాడారు. సూపర్‌చెక్ నిమిత్తం పొగాకు పంటలో సాగుచేసిన ఈ-పంట నమోదు వివరాలను పరిశీలించారు. రాయితీపై పురుగులు మందులు అన్ని రైతుసేవాకేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. రబీ పంటనమోదుకు సంబంధించి రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో పావని, ఉద్యానశాఖ అధికారి ప్రత్యూష, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

తీరిన రోడ్డు కష్టాలు !

లక్ష్మీపురం-రుద్రవరం రహదారి నిర్మాణం పూర్తి

ఎమ్మెల్యే బీఎన్ చొరవపై స్థానికుల హర్షం



సుందరంగా మారిన రుద్రవరం రోడ్డు

సంతనూతలపాడు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలో లక్ష్మీపురం -రుద్రవరం గ్రామాల మధ్యన 3.5 కిలోమీటర్ల మేర అధ్వానంగా ఉన్న గుంతల రోడ్డు ఎట్టకేలకు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ చొరవతో సుందరంగా రూపాంతరం చెందింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దాదాపు రూ.90లక్షలతో పటిష్టంగా తారు రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రజల వెతలు తీర్చింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నా కనీసం వాటి మరమ్మతులు పట్టించుకున్న పాపాన పోలేదని రెండు గ్రామాల ప్రజలు వాపోయారు. నాడు పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం చేపట్టకుండా మరమ్మతుల పేరిట రుద్రవరం, లక్ష్మీపురం గ్రామాల మధ్యన రోడ్డుకు రూ.25లక్షలు ఖర్చుపెట్టి బూడిదపాలు చేశారని వారు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అంటేనే ప్రజలకు ఒక భరోసా అని రుద్రవరం టీడీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు కూకట్ల శరత్ బుధవారం పేర్కొన్నారు. ఎట్టకేలకు గుంతల రోడ్డు పునరుద్ధరణకు నోచుకోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్యాలను పూర్తి చేయకపోతే ఇళ్లకు వెళ్లిపోండి

● డ్వామా పీడీ జోసఫ్‌కుమార్



సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ జోసఫ్‌కుమార్

మద్దిపాడు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విధించిన లక్ష్యాల ప్రకారం ఉపాధి పని దినాలు పూర్తి చేయకపోతే సిబ్బంది ఇంటికి వెళ్లిపోవచ్చని డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మద్దిపాడు మండల సమావేశ మందిరంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో పనిదినాలు తక్కువగా ఉండటం పట్ల మండిపడ్డారు. మండలంలో కేవలం 360 పనిదినాలు మాత్రమే చేయించారని, కనీసం వెయ్యి పనిదినాలు గురువారం నుంచి కల్పించాలని, వారం తర్వాత 2000 పనిదినాలు కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. టెక్నికల్ అసిస్టెంట్లు ఒక్కొక్కరు 2 వేలు పనిదినాలు కల్పించాలని, కానీ ఆ విధంగా లేనందున పశ్చిమ ప్రాంతానికి వెళ్లి అక్కడ పనులు చేయించాలని చెప్పారు. కంప్యూటర్ ఆపరేటర్లు కూడా సవ్యంగా పని చేయాలని, లేకుంటే బదిలీ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.జ్యోతి, ఏపీడీ వెంకటస్వామి, ఏపీవో ధనుంజయ, టీఈ కిషోర్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యం కోసమే శిబిరాల ఏర్పాటు

● డీఏహెచ్‌వో బేబీరాణి



దూడకు నట్టల నివారణ మందు తాగిస్తున్న డాక్టర్ బేబీరాణి

ఒంగోలు(రూరల్), జనవరి29(ఆంధ్రజ్యోతి): పశువుల ఆరోగ్యం కోసం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రత్యే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్య అధికారి (డీఏహెచ్‌వో) డాక్టర్ కె.బేబీరాణి కోరారు. బుధవారం ఒంగోలు నగరం పెళ్లూరు గ్రామంలో పశుసంవర్ధక శాఖ, ఆచార్య ఎన్‌జీరంగా సర్వీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏహెచ్‌వో బేబీరాణి మాట్లాడుతూ లేగ దూడలకు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించాలన్నారు. దీనివల్ల పశుసంపద ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. గర్భకోశవ్యాధులు రాకుండా మందులు వాడాలన్నారు. జీవాలకు బొబ్బవ్యాధి నివారణకు టీకాలు వేయించాలని కోరారు. రంగా సంస్థ అధ్యక్షుడు నామినేని మోహనరావు మాట్లాడుతూ రైతుల అభివృద్ధే లక్ష్యంతో సంస్థ పని చేస్తుందన్నారు. అనంతరం పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అధికారులు చంద్రశేఖరరావు, ఎ.రమేష్, వెంకటరెడ్డి, నాయకులు నాదెండ్ల చంద్రశేఖరరావు, చుంచు శేషయ్య, మండవ రంగారావు, మండవ శ్రీనివాసరావు, గుండవరపు కోటేశ్వరరావు, బొడపాటి కోటేశ్వరరావు, పశువైద్యాధికారులు జగత్ శ్రీనివాసరావు, బి.బసవశంకరరావు, వై.భూపాల్‌రెడ్డి, నాయకుడు చిరుమళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరు పశువైద్యశాల బుధవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని ఏడీఏ డాక్టర్ నాగభూషణం ప్రారంభించారు. పశువైద్యురాలు జాస్మిన్ పశువులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. దూడలు, గొర్రెలకు నట్టల నివారణ మందు తాపించారు. మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో వైద్యులు లావణ్య, వెంకటసురేఖ, అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

మంగమూరులో..

సంతనూతలపాడు: మండలంలో మంగమూరు గ్రామంలో బుధవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరిగిన పశువైద్యశిబిరం జరిగింది. 3102 గొర్రెలు, మేకలు, గేదెలకు డాక్టర్ చిరంజీవి వైద్య పరీక్షలు చేశారు. గొర్రెలు, మేకలకు నట్టలనివారణ మందును తాగించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణం కలయ సఖి సుందరం..

● ఆకట్టుకున్న నృత్యరూపకం



నృత్యం చేస్తున్న కళాకారులు

ఒంగోలు కల్చరల్, జనవరి29(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ కళాపరిషత్ ఉత్సవాలలో భాగంగా స్థానిక పీవీఆర్ స్కూలు మైదానంలో జరుగుతున్న కార్యక్రమాల్లో బుధవారం రాత్రి ఒంగోలు నగరం అన్నవరప్పాడు ఆక్స్‌ఫర్డ్ స్కూలు విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ముఖ్యంగా కృష్ణం కలయ సఖి సుందరం అంటూ నారాయణతీర్థుల వారి తరంగానికి బాలికలు చేసిన నృత్యం నయనానందకరంగా అలరించింది. రాగ తాళ లయబద్ధంగా నృత్యం చేస్తుంటే ప్రేక్షకులు తమ కరతాళధ్వనులతో అభినందనల జల్లు కురిపించారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు రెవెన్యూ డివిజన్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు బుధవారం ఇంటర్వ్యూలు జరిగాయి. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న నేతృత్వంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ల పోస్టులు ఆరు ఖాళీగా ఉండగా 33మంది దరఖాస్తు చేసుకోగా వారిలో ముగ్గురు గైర్హాజరయ్యారు. 45 హెల్పర్ పోస్టులకు 140 మంది దరఖాస్తులు చేసుకోగా 95 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా 45 మంది గైర్హాజరయ్యారు. కమిటీ సభ్యులు ఆయా పోస్టులకు అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేయడంతో సర్టిఫికెట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హెనసుజన్, ఇతర కమిటి సభ్యులు పాల్గొన్నారు.

మొదటి అదనపు జిల్లా న్యాయాధికారిగా అమన్‌రాజా

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు మొదటి అదనపు జిల్లా న్యాయాధికారిగా అమన్‌రాజాను ఉద్యోగోన్నతిపై నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫ్యామిలీకోర్టు న్యాయాధికారిగా పనిచేస్తున్న అమన్‌రాజాను ఉద్యోగోన్నతిపై ఇక్కడి మొదటి అదనపు జిల్లా న్యాయాధికారిగా నియమించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి డి.దీనను ఫ్యామిలీకోర్టు/8వ అదనపు జిల్లా న్యాయాధికారిగా ఉద్యోగోన్నతిపై ఇక్కడే నియమించారు. ఇక జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర సివిల్ న్యాయాధికారి శ్యాంబాబును బాపట్ల 6వ అదనపు జిల్లా న్యాయాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

బాలల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, పక్కన ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. కనిగిరి మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న షాదీఖానాలో బుధవారం డివిజన్‌స్థాయి అధికారులకు బంగారుబాల్యంపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు సాధికారత దిశగా ఎదగాలన్నదే ప్రభుత్వాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అందుకోసమే ప్రత్యేకంగా బంగారుబాల్యం కార్యక్రమం రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో ఎంతో మంది బాలలు విద్యను మధ్యలోనే ఆపివేసి పనుల బాట పడుతున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి తిరిగి బడిలో చేర్పించాలని చెప్పారు. ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుడిని నోడల్ ఆఫీసర్‌గా నియమించి డ్రాపవుట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. బాల్యవివాహాల వల్ల చిన్న వయస్సులోనే గర్భం దాల్చి అనారోగ్యంతో కూడిన శిశువులకు జన్మనిస్తున్నట్లు చెప్పారు. దీంతో భావి జీవితం మొత్తం ఆ శిశువు అనారోగ్యంగా, అంగవైకల్యకులుగా జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అందువల్ల బాల్య వివాహాలను అరికట్టేందుకు చొరవ చూపాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలోని గ్రామాల్లోని కిశోర బాలికలతో పాటు ఐదు నుంచి 18 ఏళ్ల బాలబాలికల వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు.

సర్పంచ్ పదవికి రాజీనామా

బల్లికురవ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామ సర్పంచ్ పసుమర్తి మహాలక్ష్మమ్మ అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావుకు లెటర్ అందజేశారు. ఆరు మాసాల నుంచి అనారోగ్య కారణాలతో సర్పంచ్ మహాలక్ష్మమ్మ సెలవు పెట్టారు. దీంతో జిల్లా అధికారులు ఉప సర్పంచ్ ఉప్పుమాగులూరు శాంతికి ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలను అప్పగించారు. మంగళవారం తాను సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తు మహాలక్ష్మమ్మ అధికారులకు లేఖ అందజేశారు. గత సర్పంచ్ ఎన్నికల సందర్భంగా టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య జరిగిన ఒప్పందం మేరకే వైసీపీకి చెందిన సర్పంచ్ తన పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం.

రేపు అష్టలక్ష్మి ఆలయ ప్రతిష్ఠోత్సవం

పర్చూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : రూ.4కోట్ల వ్యయంతో కల్యాణ వేంకటేశ్వర స్వామి సమేత అష్టలక్ష్మి దేవాలయం పర్చూరులో రూపుదిద్దుకుంటోంది. ఈనెల 31న అలయ ప్రతిష్ఠోత్సవం సందర్భంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అవధూత దత్త పీఠాధిపతి శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీతో పాటు దత్త విజయానంద తీర్థ స్వామిజీ హాజరు కానున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు పాబోలు వెంకట సత్యనారాయణ బుధవారం తెలిపారు. గోశాలను కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నందిపాడు మాజీ సర్పంచ్ కన్నుమూత



వెంకట్రాది (ఫైల్)

మద్దిపాడు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నందిపాడు మాజీ సర్పంచ్ మండవ వెంకట్రాది (94) బుధవారం ఉదయం గ్రామంలోని తన స్వగృహంలో వయోభారంతో తుదిశ్వాస విడిచారు. గత 30 సంవత్సరాలుగా ఆయన గ్రామానికి సర్పంచ్‌గా సేవలు అందించారు. నందిపాడు గ్రామ అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారు. ఆయన మరణవార్త తెలుసుకున్న పొగాకు బోర్డు విస్తరణాధికారి మారెళ్ల మారుతీరావు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మండవ రంగారావులు వెంకట్రాద్రి మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు.

ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడికి డాక్టరేట్

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ట్రిపుల్ ఐటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో అధ్యాపకుడుగా పనిచేస్తున్న వెంకటఅంజనీకుమార్‌కు డాక్టరేట్ లభించింది. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎం.దామోదర్‌రెడ్డి పర్యవేక్షణలో పీవీ ఇంటిగ్రేటెడ్ ఎస్ఏపీఎఫ్ ఫర్ హార్మానిక్ రిడెక్షన్ ఇన్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ యూజింగ్ అప్టిమైజేషన్ టెక్నిక్ అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించినందుకు వెంకటఅజనీకుమార్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా బుధవారం స్థానిక కళాశాలలో అధ్యాపకుడిని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ భాస్కర్‌పటేల్, డీన్ రూపన్‌కుమార్, ఏవో చంద్రశేఖర్, అధ్యాపకులు అభినందించారు.

స్కూళ్లలో వలస కార్మికుల పిల్లల పేర్లను కొనసాగించాలి : ఏపీటీఎఫ్

ఒంగోలు విద్య, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పొట్టకూటి కోసం ఉపాధి వెతుక్కుంటూ తాత్కాలికంగా వలసపోయిన కార్మికుల పిల్లల పేర్లు పాఠశాలల్లో కొనసాగించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వాకా జనార్దన్‌రెడ్డి, డి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వీరి పేర్లు పాఠశాల రిజిస్టర్ల నుంచి తొలగించమనడం తగదన్నారు. 117 జీవో ఉపసంహరణ అనంతరం ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం చేస్తున్న పాఠశాల విద్యకు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయని, బోగస్ రోల్‌ను ఉపాధ్యాయులు ఎవరూ సమర్థించడం లేదని పేర్కొన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను కొనసాగించాలని, 117 జీవోకు ప్రత్యామ్నాయంగా ఫ్యాప్టో చేసిన సూచనలను అమలు చేయాలని, హైస్కూళ్ళలో రెండు మధ్యామాల్లో బోధన సాగేలాచర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యాసామగ్రి పంపిణీ



శిద్దా సుధాకర్ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు

చీమకుర్తి, జనవరి 29(ఆంధ్ర జ్యోతి): బండ్లమూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. శిద్దా సుధాకర్, జయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా విద్యార్థులకు వాటిని అందజేశారు. చేశారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయిలకు ఎదగాలను దాతలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కాంతారావు, వద్ది శ్రీనివాసరావు, ఆలపాటి నరసింహారావు, చలువాది వెంకటశివప్రసాద్, మద్ది వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులను విధుల్లోకి చేర్చుకోవాలి

ఒంగోలువిద్య, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎయిడెడ్ పాఠశాలల్లో సర్దుబాటు చేసిన ఉపాధ్యాయులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్‌హై, డి.వీరాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నందున అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను సర్దుబాటు కింద పలు మండలాల్లోని ఎయిడెడ్ పాఠశాలలకు కేటాయించారన్నారు. కానీ వారికి కేటాయించిన పాఠశాల యాజమాన్యం కోర్టు కారణాలతో విధుల్లోకి తీసుకునేందుకు నిరాకరిస్తున్నారని తెలిపారు. ఆ విధంగా జిల్లావ్యాప్తంగా 50 మందికిపైగా ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. విధుల్లో చేరకుంటే గ్యాప్ పీరియడ్‌కు వేతన సమస్య ఉత్పన్నమవుతుందని, అందువల్ల వెంటనే విధుల్లోకి చేర్చుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

'వంతెన నిర్మాణం చేపడతాం'

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు(రూరల్), జనవరి29(ఆంధ్రజ్యోతి): గుత్తికొండవారిపాలెం సమీపంలోని సాగర్‌కాలువపై గల వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ఈక్రమంలో బుధవారం శిథిలావస్థలో వంతెన శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఎన్నెస్పీ అధికారులు స్పందించారు. వంతెన నిర్మాణం కోసం త్వరలో టెండర్లు పిలిచి నిర్మించేలా చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

ఎంపీడీవోకు సన్మానం

కొండపి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రాన్ని అందుకున్న కొండపి ఎంపీడీవో బి.రామాంజనేయులును కార్యాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఘనంగా సత్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలన ప్రజలకు శాపం



మాట్లాడుతున్న హరిబాబు

సంతనూతలపాడు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఐదేళ్ల కాలంలో వైసీపీ పాలన ప్రజలకు శాపంగా మారినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు అన్నారు. బుధవారం సంతనూతలపాడులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన అప్పులను ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చెల్లించినట్లు తెలిపారు. నాడు-నేడు, స్మార్ట్‌మీటర్లు, రేషన్‌బియ్యం, పిల్లలకు ఇచ్చే చిక్కి, కోడిగుడ్లలో భారీ ఎత్తున అవినీతి జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు మందాడి వెంకటేశ్వర్లు, ముప్పరాజు శ్రీను, నలగట్ల సుబ్బారావు, రావుల సుబ్బారావు, బోస్, పీఎన్ఎస్.చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం



సర్పంచ్ శిల్పసౌందర్యను సత్కరిస్తున్న నాయకులు

మద్దిపాడు, జనవరి29(ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే రోజున విజయవాడ రాజ్‌భవన్‌లో ఎట్‌హోం కార్యక్రమానికి అందిన ఆహ్వానం హాజరైన యువ సర్పంచ్ దాసరి శిల్ప సౌందర్యను బుధవారం ఏడుగుండ్లపాడులో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నేత హరిప్రసాద్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో యువతకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. దాసరి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీఎల్‌వో మీరావలి, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ



ఫార్మర్ చాట్ యాప్ గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారిణి శ్వేత

ఫార్మర్‌చాట్ యాప్‌ను రైతులు ఇన్‌స్టాల్ చేసుకోవాలి

కంభం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్న ప్రతి రైతు తమ ఫోన్‌లో ఫార్మర్ చాట్ యాప్‌ను ప్లేస్టోర్ నుంచి ఇన్‌స్టాల్ చేసుకుని తమ పొలాల్లోని పంటలు, తెగుళ్లను ఫొటో తీసి పంపించినట్లయితే తాము రైతులు తీసుకోవలసిన సూచనలు తెలియచేస్తామని ఉద్యాన శాఖాధికారిణి డి.శ్వేత తెలిపారు. బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని లింగోజీపల్లి, ఔరంగాబాద్ గ్రామాలలో పర్యటించారు. గ్రామాలలో రైతులు వేసిన మిరప పంటను పరిశీలించారు. శ్వేత మాట్లాడుతూ ఫార్మర్ చాట్ యాప్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈయాప్‌లో వాతావరణ సూచన, దగ్గరలో ఉన్న మార్కెట్ ధరల వివరాలను గురించి పూర్తిగా తెలియజేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో రైతులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ సభ్యులు

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి ఆర్థిక సాయం

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యో): మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఆటో డ్రైవర్‌కు రూ.46,500 ఆర్థిక సాయం అందించారు. స్థానిక ఇస్లాంపేటలో నివసించే ఆటో డ్రైవర్ లింగాల నాగరాజు కిడ్నీ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ గుంటక వనజాక్షి మాట్లాడుతూ.. నాగరాజు వైద్యఖర్చుల నిమిత్తం మానవతా ఫౌండర్ ఎన్.రామచంద్రారెడ్డి, మార్కాపురం కనిగిరి మానవతా శాఖల సహకారంతో నగదు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, మార్కాపురం శాఖ అధ్యక్షుడు చలమయ్య, కార్యదర్శి గుంటక చెన్నారెడ్డి, సభ్యులు చెన్నకృష్ణ, శైలజ, కృష్ణారావు, నరసింహం తదితరులు పాల్గొన్నారు.



ఉచిత కంటి వైద్యశిబిరం ప్రారంభంలో టీడీపీ నేతలు

టీడీపీ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం

కంభం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తోట శ్రీనివాసులు ఆధ్వర్యంలో శాంతిరామ్ ఆసుపత్రి వారు ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరంలో సుమారు 60 మంది కంటి పరీక్షలు చేయించుకోగా 15 మందికి శుక్లాల ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరిలో ముగ్గురిని బుధవారం తీసుకెళ్లారు. మిగిలిన 12 మందిని ఫిబ్రవరి 2వ తేదిన నంద్యాలలోని శాంతిరామ్ ఆసుపత్రికి ఉచితంగా తీసుకెళ్లి ఆపరేషన్ల అనంతరం తిరిగి కంభంలో దిగబెడతామని తెలిపారు. ఈకార్యక్రమంలో మండలంలోని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

గిద్దలూరు టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ తహసీల్దార్‌గా, అలాగే ఉత్తమ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా అవార్డులు పొందిన ఎం.అంజనేయరెడ్డి, జి.భాస్కర్‌రావులను రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో వీఆర్‌వోల సంఘం జిల్లా అధ్యక్షులు వై.పి.రంగయ్య, మండలశాఖ అధ్యక్షులు వెంకటరామయ్య, డిప్యూటీ తహసీల్దార్ నాయబ్ ఖాజాహుస్సేన్, రెవెన్యూ సిబ్బంది, వీఆర్‌వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

పొదిలిలో..

పొదిలి : గణతంత్ర దినోత్సవం రోజున ఉత్తమ అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్న పలువురు అధికారులను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ బుధవారం సన్మానించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మంచిపాలన అందించిన వారిని గుర్తించి పత్రాలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. తహసీల్దార్ కృష్ణారెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ వేమన, ఏఎస్‌ఐ సత్యనారాయణలను పుష్పగుచ్ఛం ఇచ్చిసత్కరించారు.

మురుగును తొలగించాలి

పొదిలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విశ్వనాథపురం ఆంజనేయస్వామి దేవస్థానం సమీపంలో మురుగు నీరు రహదారిపై ప్రవహిస్తున్నది. కాలువల్లో పూడిక తీయకపోవడంతో అవి నిండిపోయి మురుగునీరు పోయే వీలులేక రోడ్లపైకి వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలలతరబడి పట్టణంలోని గీతాంజలి పాఠశాల సమీపంలో, పవర్ ఆఫీస్ వీధిలో కూడా కాలువలు నిండి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తున్నది. దీంతో పాదచారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా గాయత్రి మహాయజ్ఞం

గిద్దలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశినాయన ఆశ్రమంలోని ఆలయంలో గాయత్రి మహాయజ్ఞం అత్యంత వైభవంగా జరిగింది. అమావాస్య సందర్భంగా లోక కల్యాణార్థం నిర్వహించిన గాయత్రి మహాయజ్ఞంలో భక్తులు సామూహికంగా పాల్గొన్నారు. గాయత్రి పరివార్ సభ్యులు హనుమంతరెడ్డి, ప్రసన్నలక్ష్మి, వెంకటేశ్వర్లు, యోగా గురూజీ నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'మన ఊరు- మన ఎమ్మెల్యే'

● ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తీర్చడానికే మన ఊరు-మన ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక 9వ వార్డు పరిధిలో బుధవారం మన ఊరు- మన ఎమ్మెల్యే కార్యక్రమం జరిగింది. వార్డు పరిధిలోని ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉన్నట్లు ప్రజలు తెలియజేశారు. కొంత మంది చెరువును ఆక్రమించి గృహాలు నిర్మించారని చెప్పారు. చెరువుకట్టపై పడమర వైపున కొందరు ఆక్రమించడంతో నడవడానికి కూడా వీలులేకుండా పోయిందన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని మరుగుదొడ్ల వ్యర్థాలు రహదారికి పైకి వస్తున్నాయని ఫిర్యాదు చేశారు. డ్రైనేజీ సమస్య గురించి ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ గతంలో సీసీ రహదారులపై మళ్లీ ఒక లేయర్ సీసీ వేయడంతో డ్రైనేజీ సమస్య ఏర్పడినట్లు గుర్తించామన్నారు. చెరువు కట్టపై, చెరువులో ఆక్రమణలను ఉపేక్షించేదిలేదని, త్వరలోనే వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, పలు విభాగాల సిబ్బంది, టీడీపీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్, తాళ్లపల్లి సత్యనారాయణ, షేక్ మౌలాలి, కొప్పుల శ్రీనివాసులు, పఠాన్ ఇబ్రహీం, నాగూర్‌ఖాన్, పసుపుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

రథసప్తమి వేడుకలను విజయవంతం చేయాలి

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ఫిబ్రవరి 4న నిర్వహించనున్న రథసప్తమి వేడుకలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలోని మధ్యరంగ మండపంలో బుధవారం రథసప్తమి మహోత్సవ కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఇలవేల్పు శ్రీలక్ష్మీచెన్నకేశస్వామి రథసప్తమి వేడుకలు గతంలో కంటే భిన్నంగా ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ 4వ తేదీ ఉదయం 5.30గంటలకు సూర్యప్రభ వాహనం, 9గంటలకు శేష వాహనం, 11 గంటలకు గరుడ వాహనం, మధ్యాహ్నం 1గంటకు హనుమంత వాహనం, 2 గంటలకు చక్రస్నానం, 3 గంటలకు కల్పవృక్ష వాహనం, 5 గంటలకు వెండి రథోత్సవం, 8గంటలకు చంద్రప్రభ వాహనం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రథసప్తమి సేవా సంఘం అధ్యక్షులు యక్కలి కాశీవిశ్వనాథం, కార్యదర్శి ఆలంపల్లి శ్రీనివాసరావు, గౌరవ సలహాదారులు వక్కలగడ్డ మల్లికార్జునరావు, తాళ్లపల్లి సత్యనారాయణ, కోశాధికారి బొంతల వెంకట సుధీర్ కుమార్, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోదరుడు క్రిష్ణకిశోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సోదరుడు కృష్ణకిశోర్‌రెడ్డి అన్నారు. బీపీఎల్ తరగతికి చెందిన దివ్యాంగుల లింకో సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిపాలన యంత్రాంగం సహకారంతో బుధవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో దివ్యాంగుల గుర్తింపు, పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఈసందర్భంగా నియోజకవర్గంలోని 6 మండలాలకు చెందిన దివ్యాంగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని దివ్యాంగులను గుర్తిం చి వారికి పరికరాలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి నియోజకవర్గంలోని దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నారని, భవిష్యత్తులో ఎటువంటి అవసరం ఉన్నా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లివారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీఐపీ అసిస్టెంట్ డైరెక్టర్ జి.అర్చన, వైద్యశాల సూపరింటెండెంట్ ఆదామ్, మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ వెంకటదాస్, పట్టణశాఖ అధ్యక్షులు సయ్యద్ షానేషావలి, తదితరులు పాల్గొన్నారు.

నేడు శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

త్రిపురాంతకం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరీ దేవి అమ్మవార్ల ఆలయాల్లో ఫిబ్రవరి 26 నుంచి 28 వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్షను ఈనెల 30న మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు తహసీల్దారు జి.శ్రీనివాస్ తెలిపారు. అమ్మవారి ఆలయం వద్ద జరిగే సమీక్ష మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ ఆధ్వర్యంలో జరుగుతుందని, సంబంధిత అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని తహసీల్దారు తెలిపారు.

అన్నదానానికి విరాళం

గిద్దలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాశినాయన ఆశ్రమంలో ప్రతి బుధవారం ఏర్పాటు చేస్తున్న ఉచిత భోజన పథకానికి రిటైర్డ్ హెచ్‌ఎం రామాంజనేయరెడ్డి లక్ష రూపాయల విరాళాన్ని అందించారు. అన్నదాన కమిటీ నిర్వాహకులు నారాయణరెడ్డి, హనుమంతరెడ్డి, కమిటీ ప్రతినిధులకు ఈ విరాళాన్ని హెచ్‌ఎం నారాయణరెడ్డి అందచేశారు.

పాఠశాల అభివృద్ధికి వితరణ

పెద్ద దోర్నాల,జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నదోర్నాల మండల ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి దోర్నాల పంచాయతీ గ్రామ కార్యదర్శి నలగాటి శివ కోటేశ్వర రావు రూ.20,000లు విరాళం ఇచ్చారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు అభ్యర్థన మేరకు బుధవారం నగదును అందజేశారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

మండలంలోని బీసీలు రుణాల మంజూరుకుదరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో నాసర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గృహనిర్మాణానికి నిధులు కేటాయించాలి

మంత్రి పార్థసారథిని కోరిన ఎమ్మెల్యే కందుల

మార్కాపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మార్కాపురం నియోజకవర్గంలో గృహ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఆ శాఖమంత్రి పార్థసారథిని స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కోరారు. అమరావతిలోని సచివాలయం మంత్రి చాంబర్‌లో బుధవారం కలిసిన ఎమ్మెల్యే కందుల పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పట్టణంలోని పలు ప్రభుత్వ లేఅవుట్లలో జరుగుతున్న గృహ నిర్మాణాలకు సంబంధించి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో మంజూరైన ఇళ్లకు సంబంధిదించి నిర్మాణాలు చేపట్టని వారికి ప్రస్తుత స్కీమ్‌ల ప్రకారం బిల్లులు వచ్చేలా అవకాశం కల్పించాలన్నారు. సమస్యలను సానుకూలంగా విన్న మంత్రి పార్థసారథి తప్పక నిధులు కేటాయించేందుకే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నెహ్రూ యువకేంద్రం అధికారి కమల్‌సా

క్రీడలతో మానసిక ఉల్లాసం

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులలో క్రీడల ద్వారా ఆరోగ్యం, మానసిక ఉల్లాసం చేకూరుతాయని నెహ్రూ యువకేంద్రం జిల్లా యువజన అధికారి కమల్‌సా అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెహ్రూ యువకేంద్రం దీక్షా యూత్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బ్లాక్ క్లస్టర్ లెవెల్ వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, సైక్లింగ్ పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.చంద్రశేఖర్ రెడ్డి, కమల్‌సా ప్రారంభించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో దీక్షా యూత్ సర్వీస్ ఆర్గనైజేషన్ మార్కాపురం ప్రతినిధి శ్రీధర సాయిసుబ్బారావు, పీఈటీలు కృష్ణ, నాగరాజు, హరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కంది పంట పరిశీలన



కందిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గిద్దలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు లాంఫామ్‌కు చెందిన శాస్త్రవేత్తలు పలు గ్రామాల పరిధిలో సాగైన కందిపంటను పరిశీలించారు. గిద్దలూరు మండలం సంజీవరాయునిపేట, తాళ్ళపల్లి, ముండ్లపాడు, రాచర్ల మండలం యడవల్లి గ్రామ పరిధిలో సాగైన కందిపంటను శాస్త్రవేత్త డాక్టర్ ఎం.మోహన్‌రెడ్డి, స్థానిక వ్యవసాయాధికారులు పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడారు. పంట పూతదశలో ఉన్నపుడు ఎక్కువగా వర్షాలు పడడం, ఆ తరువాత ముసురు వలన పూత రాలిపోయిందని, ఎకరాకు 100 కిలోలు కూడా దిగుబడులు వచ్చే అవకాశం లేదని రైతులు అధికారులకు విన్నవించారు. ఈదశలో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. ఈకార్యక్రమంలో శాస్త్రవేత్తలు సాంబ శివరావు, సంధ్యారాణి, రమేష్, సహాయ వ్యవసాయ సం చాలకులు బాలాజీనాయక్, వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

మండలంలోని కొంగళవీడు, తిమ్మాపురం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రైతు ఈకేవైసీ చేసుకోవాలని, తద్వారా పంట నష్టపరిహారం పొందవచ్చని అధికారులు వివరించారు. శనగ పంటను పరిశీలించి చీడపీడలు, నివారణ చర్యల గురించి వివరించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి, విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణ చర్యలు చేపట్టాలి

పెద్ద దోర్నాల :మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి జవహర్ లాల్ నాయక్ అన్నారు. మండలంలోని ఎగువ చెర్లోపల్లి, చిలకచెర్లలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఏవో గ్రామాల్లో సాగు చేసిన మినుము, మిరప, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశించడాన్ని గమనించారు.నివారణకు వేపనూనె 10000పీపీఎం 2ఎంఎల్ లేదా 5శాతం వేపగింజల కషాయం, క్లోరిపైరిపాస్ 2.5 ఎంఎల్ లేదా ఏమమేక్టిన్ బెంజోఎట్ 0.4గ్రాములు లేక స్పైనోఫాడ్ 0.3ఎంఎల్ లీటరునీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో చైతన్య కుమార్, వీఎస్‌ఏ షెడ్రక్ బాబు, సీడబ్ల్యూఎస్ ఎన్‌జీవో ప్రతినిధి బాలరాజు రైతులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



మిరప పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలోని గంజివారిల్లి, వెంకటాద్రిపాలెం గ్రామాలలో వ్యవసాయ శాఖ అధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో కేవీ శేషారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు గ్రామాలలో కంది, పొగాకు, ఉలవ పంటలను పరిశీలించారు. వ్యవసాయ విస్తరణాధికారి ఎల్. మాల్యాద్రి రెడ్డి, సిబ్బంది మీరావలి, శ్రీలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

టమోటాలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

తర్లుపాడు : ప్రస్తుతం టమోటా పంటపై పచ్చపురుగు ఉధృతంగా ఉందని, వెంటనే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖాధికారి పి.రమేష్ అన్నారు. మండలంలోని తాడివారిపల్లి, మంగళకుంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు దేవేంద్ర గౌడ్, గురవయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పొదిలిలో

పొదిలి : బుధవారం మండలంలోని కంభాలపాడు, నందిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కందిపంటను రిజిస్ట్రేషన్ చేయించుకుంటే మార్కెట్ ధర తక్కువగా ఉన్న సమయంలో కొనుగోలు కేంద్రంవద్ద అమ్ముకునే అవకాశం ఉంటుందని వ్యసాయాధికారి జైన్‌లుద్దీన్ అన్నారు. రబీలో సాగుచేసిన పంటలను నమోదు చేసుకొని ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



డివిజన్‌లోని అధికారులతో సమీక్షిస్తున్న డీఎస్పీ డాక్టర్ నాగరాజు

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించండి

● నేరసమీక్షలో డీఎస్పీ నాగరాజు

మార్కాపురం, జనవరి 29(అంధ్రజ్యోతి): పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టిసారించాలని మార్కాపురం డీఎస్పీ డాక్టర్ యు.నాగరాజు అన్నారు. స్థానిక ఎస్‌డీపీవో కార్యాలయంలో బుధవారం మార్కాపురం డివిజన్ నేర సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ నాగరాజు సర్కిల్స్ వారీగా పెండింగ్ కేసులను సమీక్షించారు. వాటిని త్వరితగతిన విచారణ చేయాలని సూచించారు. పట్టణాల పరిధిలో ట్రాఫిక్ సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. సీడీ ఫైళ్ల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. కేసులు నమోదు చేసిన తర్వాత నిర్ణీత కాలవ్యవధిలోగా ఫైళ్లు తయారు చేసుకోవాలన్నారు. ఐపీసీ, సీఆర్‌పీసీ స్థానంలో వచ్చిన నూతన చట్టాలు బీఎన్‌ఎస్ గురించి పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సమీక్షలో మార్కాపురం, ఎర్రగొండపాలెం, కంభం, గిద్దలూరు పట్టణ, గ్రామీణ సీఐలు పి.సుబ్బారావు, ప్రభాకర్, మల్లిఖార్జున్, సురేష్, రామకోటయ్యలతోపాటు అన్ని పోలీసు స్టేషన్‌ల ఎస్సైలు పాల్గొన్నారు.



యంత్రంతో వరిగ పంటను కోస్తున్న రైతులు

వరిగ సాగు రైతులకు నష్టాలు

తర్లుపాడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా ఈ ఏడాది వరిగ పంట సాగుచేసిన రైతులకు నష్టాలు తప్పలేదు. ప్రస్తుతం వరిగ పంట ముమ్మరంగా కోతలు కోస్తున్నారు. ఎక్కువ మంది యంత్రాలతో కోసి నూర్పిళ్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఎకరాకు 2 నుంచి 3 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తుంది. ప్రస్తుతం వరిగలను క్వింటా రూ.3800 కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఎకరాకు దాదాపుగా వ్యవసాయం, మందులు రూ.25వేల ఖర్చు అయింది. ప్రస్తుతం 2 క్వింటాళ్లు వచ్చిన రైతులకు దాదాపుగా రూ.17,000 నష్టం చవిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. వారం రోజులక్రితం క్వింటా రూ.4,400 కొనుగోలు చేసిన వ్యాపారులు ప్రస్తుతం ధర తగ్గించేశారు. కేవలం రూ.3,800కు మాత్రమే కొనుగోలు చేయటంతో రైతులు మరింత నష్టాల్లో కూరుకుపోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని వరిగ రైతులు కోరుతున్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకోండి : ఎపీఈడీవో

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి రుణాల కోసం బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎర్రగొండపాలెం ఎంపీడీవో బండారు శ్రీనివాసులు బుధవారం తెలిపారు. మండలంలో బీసీ లకు 37, ఈబీసీలకు 19 యూనిట్లు వచ్చాయని తెలిపారు. ఈ నెల 30వ తేదీ నుంచిఫిబ్రవరి 7వ తేదీ లోపు ఉపాధి రుణాలకు పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. 8 నుంచి 11వ తేదీ వరకు అధికారులు పరిశీలిస్తారని తెలిపారు. 12 నుంచి 14వ తేదీ వరకు అధికారులు, బ్యాంకర్లు సంయుక్త పరిశీలన చేపడతారని అన్నారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి 21 నుంచి 23వ తేదీ వరకు కలెక్టర్ వద్ద ఆమోదం తీసుకోనున్నట్లు తెలిపారు. 26 నుంచి 28వ తేదీ వరకు బ్యాంక్ రాయితీ విడుదల, మార్చి 6నుంచి 9వ తేదీ వరకు లబ్ధిదారులకు రుణం విడుదల చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

క్రైం సమాచారం

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న నాగలక్ష్మి

పుల్లలచెరువు, జనవరి29 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వివాహిత ఉరేసుకొని మృతి చెందింది. ఈ ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పుల్లలచెరువు గ్రామానికి చెందిన వేముల నాగ లక్ష్మి(22) మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఇనుప పైపుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ముగ్గురిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

పుల్లలచెరువు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మానేపల్లిలో ఎస్సీ వ్యక్తిపై దాడి చేసి కులం పేరుతో తిట్టిన ముగ్గురు వ్యక్తులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు పుల్లలచెరువు ఎస్‌ఐ సంపత్ కుమార్ బుధవారం తెలిపారు. మానేపల్లి ఎస్సీ పాలెం చెందిన కొండా అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన ముగ్గురు ఓసీలపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశికుంట తండా సమీపంలోని జాతీయ రహదారిపై ఈ నెల 26వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మెట్టబోడుతాండాకు చెందిన వెంకటేశ్వర నాయక్ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై పి. చౌడయ్య తెలిపారు. వెంకటేశ్వర నాయక్ బావమరిది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్టుకు గాయాలు

గిద్దలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు-బేస్తవారపేట రోడ్డులోని యడవల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ సైక్లిస్టు గాయపడ్డాడు. సీవీ సుబ్బారెడ్డి అనే ఉపాధ్యాయుడు మోటార్ సైకిల్‌పై వెళుతుండగా కుక్క అడ్డురావడంతో తప్పించబోయి అదుపుతప్పి పడిపోయాడు. గాయపడిన సుబ్బారెడ్డిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

ముఖాముఖి

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలకు త్వరలో పరిష్కారం

లక్ష్మీనారాయణ, తహసీల్దార్ ముండ్లమూరు



ముండ్లమూరు మండలంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి 80 శాతం మేర పరిష్కరించామని, మిగిలిన 20 శాతం వారం రోజుల్లో పరిష్కరిస్తామని తహసీల్దార్ లక్ష్మీనారాయణ చెప్పారు. పలు విషయాలపై ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడుతూ...

ప్రశ్న : రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు ఎన్ని? ఎన్ని పరిష్కరించారు?

తహసీల్దార్ : మండల పరిధిలో 327 అర్జీలు వచ్చాయి. వాటిలో 207 పరిష్కరించాం. మిగతా వాటిని వారంలో పరిష్కరిస్తాం.

ప్ర : రీ సర్వే అర్జీలు ఎన్ని వచ్చాయి..

జ : 181 అర్జీలు వచ్చాయి. అందులో 106 పరిష్కరించాం. పది రోజుల్లో మిగిలినవి పరిష్కరిస్తాం.

ప్ర : ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం వెనుక వీఆర్‌వోల పాత్ర నిజమేనా?

జ : వాగుపోరంబోకు, పశువుల మేతపోరంబోకు, చెరువుల ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. దీనివెనుక వీఆర్‌వోల పాత్ర ఉన్నా చర్యలు తీసుకుంటాం.

ప్ర : రేషన్ డీలర్లు సరిగా సరుకులు ఇవ్వటం లేదని విమర్శలున్నాయి?

జ : రేషన్ డీలర్లందరూ నిత్యవసర సరుకులు కార్డుదారులకు తప్పనిసరిగా అందజేయాలి. లేకుంటే చర్యలు తీసుకుంటాం.

ప్ర : మండలంలో కొత్తగా ఎన్ని రేషన్ షాపులు మంజూరయ్యాయి?

జ : కొత్తగా నాలుగు షాపులు మంజూరయ్యాయి. పోలవరం -2, పసుపుగల్లు -2, పెదఉల్లగల్లు -2, పులిపాడు -2గా విభజించాం.

నేటి నుంచి రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

తాళ్లూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి బీసీలు, ఈడబ్ల్యూఎస్ వర్గాల వారు రుణాల కోసం ఈనెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బుధవారం ఎంపీడీవో దారా హనుమంతరావు తెలిపారు. మండలంలోని 16 పంచాయతీలలోని గ్రామాలకు బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలకు, ఆర్థికంగా బలహీనంగా ఉన్న(ఈడబ్ల్యూఎస్) లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేస్తున్నదన్నారు. ఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో చెప్పారు.

పీసీపల్లిలోనూ...

పీసీపల్లి, జనవరి29(ఆంధ్రజ్యోతి) : బీసీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రుణాలకు నేటి నుంచి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ప్రభాకరశర్మ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలానికి మొత్తం 52రకాల స్వయం ఉపాధి యూనిట్లు మంజూరయ్యాయన్నారు.

కందుల విక్రయానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

పీసీపల్లి, జనవరి29(ఆంధ్రజ్యోతి) : కంది పంటను సాగు చేసిన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.ప్రకాశరావు చెప్పారు. మండలంలోని నేరేడుపల్లి, మురుగుమ్మి గ్రామాల్లో రైతులు సాగుచేసిన కంది పైరును బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024లో కందిపంటను సాగుచేసి ఈ-క్రాప్ చేయించుకున్న రైతులు రైతుసేవాకేంద్రాలలో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్

కాలిపోయిన మూడు కంప్యూటర్లు, బల్బులు

తాళ్లూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సాయంత్రం విద్యుత్తు షాట్ సర్క్యూట్ జరిగింది. కంప్యూటర్ల వద్ద సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా సాయంత్రం 5గంటల సమయంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ జరిగి పెద్ద మంటలు వచ్చాయి. మొత్తం మూడు కంప్యూటర్లు కాలిపోయాయి. విద్యుత్తు బల్బులు సైతం దెబ్బతిన్నాయి. వెంటనే సిబ్బంది అప్రమత్తమై కరెంట్ నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. కంప్యూటర్లు కాలిపోవటం వల్ల విధులకు ఆటంకం కల్గింది.

ప్రమాదంలో యువకుడి మృతి

సంతమాగులూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన బండారు ఫణీంద్ర మృతి చెందాడు. ఏల్చూరు నుంచి ట్రాక్టర్‌ను తీసుకుని వస్తుండగా, పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం గంటవారిపాలెం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందాడు.

బాలల భవిష్యత్తుకు బంగారు బాటవేయాలి

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

కనిగిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న షాదీఖానాలో బుధవారం డివిజన్‌స్థాయి అధికారులకు బంగారుబాల్యంపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు సాధికారత దిశగా ఎదగాలన్నదే ప్రభుత్వాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అందుకోసమే ప్రత్యేకంగా బంగారుబాల్యం కార్యక్రమం రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో ఎంతో మంది బాలలు విద్యను మధ్యలోనే ఆపివేసి పనుల బాట పడుతున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి తిరిగి బడిలో చేర్పించాలని చెప్పారు. ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుడిని నోడల్ ఆఫీసర్‌గా నియమించి డ్రాపవుట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. బాల్యవివాహాల వల్ల చిన్న వయస్సులోనే గర్భం దాల్చి అనారోగ్యంతో కూడిన శిశువులకు జన్మనిస్తున్నట్లు చెప్పారు. దీంతో భావి జీవితం మొత్తం ఆ శిశువు అనారోగ్యంగా, అంగవైకల్యకులుగా జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అందువల్ల బాల్య వివాహాలను అరికట్టేందుకు చొరవ చూపాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలోని గ్రామాల్లోని కిషోర బాలికలతో పాటు ఐదు నుంచి 18 ఏళ్ల బాల బాలికల వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా, పక్కన ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

ప్రభుత్వాసుపత్రిలో కాన్పు చేయించే ఆశాకు వెయ్యి బహుమతి

ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పు చేయించిన ప్రతి ఆశా కార్యకర్తకు తాను సొంతంగా వెయ్యిరూపాయలను బహుమతిగా ఇస్తానని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసిహారెడ్డి చెప్పారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రతి నెల వారీ ఆరోగ్య పరీక్షలు ప్రభుత్వాసుపత్రిలో చేయించుకుంటూ ప్రసవం చేయించుకునేలా ఆశా కార్యకర్తలు ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో ఆర్డీవో కేశవర్దన్‌రెడ్డి, డీఎస్పీ సాయి ఈశ్వర్‌యశ్వంత్, సీఐ ఖాజావలి, డీఎల్‌డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ రవికిషోర్, మున్సిపల్ ఛైర్మన్ గఫార్, ఎస్ఐ మాధవరావు పాల్గొన్నారు.

అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఉగ్రకు ఆహ్వానం

పామూరులోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం వద్ద ఈ నెల 31వ తేదీన జరుగు ఆత్మార్పణ దినోత్సవ కార్యక్రమానికి రావాలని ఎమ్మెల్యే ఉగ్రను దేవస్థాన కమిటీ సభ్యులు ఆహ్వానించారు. కనిగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కమిటీ సభ్యులు బుధవారం ఉగ్రను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించారు. ఉగ్రను కలిసిన వారిలో దేవస్థాన కమిటీ ఛైర్మన్ యేల్చూరి బాలకొండలరావు, కోట నరసింహారావు, శేగు కృష్ణయ్య, గురు, పరకోటి చంద్ర ఉన్నారు.

దర్శి ఏఎంసీ ఛైర్మన్ పదవి కోసం పోటాపోటీ

ఇన్‌చార్జి డాక్టర్ లక్ష్మీకి దరఖాస్తులు అందిస్తున్న ఆశావాహులు

దొనకొండ మండలం నుంచి పలువురు క్యూలో...

దొనకొండ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): దర్శి ఏఎంసీ ఛైర్మన్ పదవి ఎస్సీకి రిజర్వు అయిందనే సమాచారంతో మండలంలోని ఎస్సీ వర్గానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు ఆ పదవిని పొందేందుకు పోటీపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఛైర్మన్ పదవి పట్ల ఆసక్తి ఉన్న టీడీపీలో ఎస్సీ వర్గానికి చెందిన కొందరు స్థానిక టీడీపీ నాయకులతో సంప్రదింపులు జరిపి తమకు మద్దతు తెలపాలని కోరుతున్నారు. అనంతరం వారి మద్దతుతో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులను కలుసుకొని విజ్ఞప్తి చేస్తున్నారు. పార్టీలో నిర్వహించిన పదవులు, చేసిన సేవాకార్యక్రమాలతో పూర్తి బయోడేటాను అందించి తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఛైర్మన్ పదవి కోసం మాజీ ఎంపీపీ నూనె విజయకుమారి ఇటీవల మండల టీడీపీ నాయకులను సంప్రదించినట్లు సమాచారం. నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కుందుర్తి లక్ష్మణ్ బుధవారం తన మద్దతుదారులు, అనుచరులతో ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, లలిత్‌సాగర్‌లను కలుసుకొని తనకు ఏఎంసీ ఛైర్మన్ పదవి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోతిపోగు చెన్నయ్య అదేబాటలో ఉన్నట్లు సమాచారం. మండల తెలుగుదేశం పార్టీలో వివిధ పదవుల్లో దీర్ఘకాలికంగా సేవలందిస్తున్న సీనియర్ నాయకులు కొమ్మతోటి సుబ్బారావు పేరును కొందరు నాయకులు ప్రతిపాదిస్తున్నట్లు సమాచారం.



డాక్టర్ లలిత్‌సాగర్‌కు బయోడేటా ఇస్తున్న లక్ష్మణ్

దర్శి ఏఎంసీ ఛైర్మన్‌గా 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో మండలంలోని మంగినపూడి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ రాచగొర్ల వెంకటయ్య ఏఎంసీ ఛైర్మన్ పదవి చేపట్టారు. ఆ తర్వాత టీడీపీ, వైసీపీ పాలనలో దర్శి మండలానికి ఏఎంసీ ఛైర్మన్ పదవి అవకాశం దక్కలేదు. కూటమి ప్రభుత్వంలో దర్శి ఏఎంసీ ఛైర్మన్ పదవి ఏ మండలానికి చెందిన వారిని వరిస్తుందో అనే చర్చలు ప్రజల్లో ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

పశు గర్భకోశ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ శ్రీనివాసరెడ్డి

కనిగిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పశువుల్లో గర్భకోశ వ్యాధులు పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ కనిగిరి ఏడీ డాక్టర్ జీ శ్రీనివాసరెడ్డి చెప్పారు. మండలంలోని లింగారెడ్డిపల్లిలో బుధవారం పశువైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మినీ గోకులం షెడ్లు, బహువార్షిక గడ్డి పెంపకం రాయితీలను పోషకులు వినియోగించుకోవాలన్నారు. అనంతరం పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. అదేవిధంగా చూడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి 151 గేదెలకు సంబంధించి మందులను పశు పోషకులకు అందజేశారు. అదేవిధంగా గొర్రెలు, మేకలకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి బాలకృష్ణ, ఏహెచ్‌ఏలు వాసు, అమ్మిరెడ్డి, వెంకటేశ్వర్లు, సర్పంచ్ కమతం వెంకటేశ్వర్లు, నాగార్జునరెడ్డి, రేష్మాబేగం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీ శ్రీనివాసరెడ్డి

తాళ్లూరులో...

తాళ్లూరు, జనవరి29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దోసకాయలపాడు రైతు సేవా కేంద్రంలో పశువైద్యశిబిరాన్ని సర్పంచ్ కోట శివలక్ష్మి ప్రారంభించారు. తూర్పుగంగవరం పశువైద్యాధికారి రాంబాబు 28 పశువులకు సాధారణ చికిత్సలు, 17 పశువులకు గర్భకోశ చికిత్సలు చేయడంతోపాటు 47 పశువులకు, 140 జీవాలకు నట్టల నివారణ మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగంబొట్లపాలెం జేవీవో మస్తాన్‌ఖాన్, దోసకాయలపాడు ఏహెచ్ఏ పి.అంకయ్య పాల్గొన్నారు.

సీఎస్‌పురంలో..

సీఎస్‌పురం/పామూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీజీపేట పశు వైద్యాధికారి మునీర్ చెప్పారు. మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో ఉచిత పునరుత్పత్తి చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ పురం పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్, డాక్టర్లు శ్రీసాయి, హనుమాన్, సర్పంచ్ సరోజనమ్మ, వసంతకుమార్, టీడీపీ నాయకులు గురుకృష్ణ, నరసింహరాజు, వీరాంజనేయులు, శ్రీనివాస్‌రాజ్ పాల్గొన్నారు.



సాగులో ఉన్న పంటలను పరిశీలిస్తున్న ఏవో రాధ

సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పామూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : పంటలకు సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించవచ్చునని ఏవో కే రాధ సూచించారు. మండలంలోని తిరగలదిన్నె, తాతయ్యపల్లి, గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు అవినాష్, కల్యాణ్, ఏఈవో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బత్తాయి తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి

సీఎస్‌పురం/పామూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : బత్తాయి తోటల్లో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చునని ఉద్యానశాఖ అధికారి కే కుసుమ ఆదేశించారు. మండలంలోని పెదగోగులపల్లి, రెడ్డిగారి కొత్తపల్లి గ్రామాల్లోని బత్తాయి తోటలను పరిశీలించారు.

బెల్టు షాప్‌పై దాడి.. ఒకరి అరెస్ట్

చీరాలటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్తపాలెంలో బెల్టు షాప్‌పై ఎక్సైజ్ శాఖ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈక్రమంలో కిషోర్ అనే వ్యక్తి వద్ద 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఘటనపై కేసు నమోదు చేశారు. ప్రభుత్వ విధానాలకు భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు.

సర్పంచ్ పదవికి రాజీనామా చేసిన మహాలక్ష్మమ్మ

బల్లికురవ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామ సర్పంచ్ పసుమర్తి మహాలక్ష్మమ్మ అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావుకు లెటర్ అందజేశారు. ఆరు మాసాల నుంచి అనారోగ్య కారణాలతో సర్పంచ్ మహాలక్ష్మమ్మ సెలవు పెట్టారు. దీంతో జిల్లా అధికారులు ఉప సర్పంచ్ ఉప్పుమాగులూరు శాంతికి ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలను అప్పగించారు. మంగళవారం తాను సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తు మహాలక్ష్మమ్మ అధికారులకు లేఖ అందజేశారు. గత సర్పంచ్ ఎన్నికల సందర్భంగా టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య జరిగిన ఒప్పందం మేరకే వైసీపీకి చెందిన సర్పంచ్ తన పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం.

31న అష్టలక్ష్మి ఆలయ ప్రతిష్ఠోత్సవం

పర్చూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : రూ.4కోట్ల వ్యయంతో కల్యాణ వేంకటేశ్వర స్వామి సమేత అష్టలక్ష్మి దేవాలయం పర్చూరులో రూపుదిద్దుకుంటోంది. ఈనెల 31న ఆలయ ప్రతిష్ఠోత్సవం సందర్భంగా రుత్వికుల నేతృత్వంలో అత్యంత ఘనంగా పూజాకార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం విశేష హోమాలు నిర్వహించారు. స్వామివార్ల ప్రతిష్ఠ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రతిష్ఠా కార్యక్రమ వేడుకలకు అవధూత దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీతో పాటు దత్త విజయానంద తీర్థ స్వామిజీ హాజరు కానున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు పాబోలు వెంకట సత్యనారాయణ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో గోశాలను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



చీర కట్టిన చేను..!

వీసీపల్లి, జనవరి29 (ఆంధ్రజ్యోతి) : చేను ఏంటి.. చేను చీర కట్టడమేంటి అని అనుకుంటున్నారా.. అవును నిజమే.. రైతులు తాము సాగుచేసిన పంటలను పశువులు, అడవి జంతువుల బారినుండి రక్షించుకునేందుకు తమ పంట చేనుకు చీరలు కట్టి రక్షించుకుంటున్నారు. మండలంలో పెద్దన్నపల్లి, బుడ్డారెడ్డిపల్లి, పెదయిర్లపాడు, తలకొండపాడు, నేరేడుపల్లి గ్రామాలలో కంది, మిరప, శనగ, మినుము, వరి తదితర పంటలను రైతులు సాగు చేశారు. పంట చేలల్లోకి రాత్రివేళ అడవిపందులు, నక్కలు వచ్చి ధ్వంసం చేస్తున్నాయి. దీంతో రైతులు వారు సాగుచేసిన పంటను కాపాడుకునేందుకు పంటచేల చుట్టూ రంగురంగు చీరలను రక్షణ వలయంగా కట్టి పంటను రక్షించుకుంటున్నారు.

అవీఇవీ

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రెస్టారెంట్ దగ్ధం



కాలిపోయిన రెస్టారెంట్

ముండ్లమూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈదర గ్రామంలో ఉన్న ఎరబ్రోలు చంద్రశేఖరరెడ్డికి చెందిన బాలాజీ రెస్టారెంట్ బుధవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. లక్ష రూపాయల మేర నష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళితే... గ్రామంలో ఉన్న రెస్టారెంట్‌కు సమీపంలో 11కేవీ లైన్ సబ్‌స్టేషన్‌కు వెళ్ళే తీగలు ఉన్నాయి. రెస్టారెంట్ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభంపై ఒక పక్షి పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అవి పెద్దవై రెస్టారెంట్‌కు అంటుకోవటంతో పూర్తిగా కాలిపోయింది. వెంటనే విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

మారెళ్ల చెరువులో గ్రావెల్ తవ్వకాలు నిలిపివేత



సంఘటనా స్థలంలో ఎక్స్‌కవేటర్

ముండ్లమూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారెళ్ల చెరువులో కొందరు ఎక్స్‌కవేటర్లతో మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్నట్టు తహసీల్దార్ లక్ష్మీనారాయణకు సమాచారం అందింది. దీంతో ఆయన వీఆర్‌వో బీ గురవయ్యను వెళ్లి మట్టి తవ్వకాలను ఆపివేయించాలని ఆదేశించారు. దీంతో వీఆర్‌వో వెళ్లి మట్టి అక్రమ తవ్వకాలను నిలిపివేయించారు.

టీడీపీ నేత మృతికి నివాళి

దొనకొండ, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బత్తుల వెంకటేశ్వర్లు(31) బుధవారం గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఇతను వ్యాపారం నిమిత్తం దర్శిలో ఉంటున్నాడు. గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే హాస్పిటల్‌కు తరలించగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పలువురు టీడీపీ నాయకులు దర్శి వెళ్లి అతని మృతదేహానికి నివాళులర్పించారు. దేశిరెడ్డిపల్లిలో గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

కొలిక్కి వచ్చిన దొంగతనం కేసు



చోరీ జరిగిన గృహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు(ఫైల్)

కురిచేడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కురిచేడు నుసుం బజారు ప్రాథమిక పాఠశాల ఎదురుగా నివాసం ఉంటున్న మాదినేని హనుమంతరావు నివాసంలో రెండు రోజుల క్రితం దొంగతనం జరిగి 10 సవర్ల బంగారం చోరీ అయింది. దీనిపై ఎస్ఐ శివ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు అనుమానిత వ్యక్తిని పోలీసులు తమదైన స్టైల్‌లో విచారించగా దొంగతనం గుట్టంతా బయటకు విప్పినట్లు సమాచారం.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు వేగవంతం చేయాలి



రోగులను పరీక్షిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంకటేశ్వర్లు

కురిచేడు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు వేగవంతం చేయాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు చెప్పారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ నవంబరు 14వ తేదీ నుంచి ప్రతి పీహెచ్‌సీలో క్యాన్సర్ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ఏఎన్ఎం, హెల్త్ సూపర్‌వైజర్, ఆశా కార్యకర్తలు కలసి రోజూ 5 గృహాలను సందర్శించి కనీసం 30 మందికి పరీక్షలు చేయాల్సి ఉందన్నారు. ఎవరికైనా అనుమానాస్పదంగా ఉంటే వారికి వైద్యాధికారి పరీక్షలు చేసి జిల్లా కేంద్రం రిమ్స్ వైద్యశాలకు రిఫర్ చేస్తారని చెప్పారు. అక్కడ పూర్తి స్థాయి వైద్య పరీక్షల అనంతరం చికిత్స చేస్తామన్నారు. ప్రాథమికంగా నోరు, వక్షస్థలం, సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వైద్యాధికారి ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

హెల్త్ పింఛన్‌దారులను విచారించిన వైద్య బృందం



హెల్త్ పింఛన్లను పరిశీలిస్తున్న డాక్టర్ల బృందం

పామూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో నెలనెలా రూ.15 తీసుకొంటున్న పింఛన్‌దారులను వైద్యాధికారులు బుధవారం విచారణ చేపట్టారు. మండలంలోని కంభాలదిన్నె, మోపాడు, లక్ష్మీనరసాపురం, కొండారెడ్డిపల్లి, పామూరు 2, 3, 4, సచివాలయ పరిధిలోని గ్రామాల్లో హెల్త్ పింఛన్లు తీసుకొంటున్న లబ్ధిదారుల అర్హత పత్రాలను పరిశీలించారు. మండలంలో మొత్తం 30 పింఛన్లు ఉండగా బుధవారం 18 విచారణ చేశారు. ఈ బృందంలో డాక్టర్లు బీ ఆంజనేయులు, సౌజన్య, ఎం విజయకుమార్‌తో పాటు వెల్ఫేర్ అసిస్టెంట్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం.. రూ.4లక్షలు నష్టం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కనిగిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పొగాకు బ్యారన్ దగ్ధమై రైతుకు రూ.4లక్షల నష్టం వాటిల్లిన సంఘటన బుధవారం మండలంలోని తుమ్మకుంట గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బాసు వంశీకృష్ణకు చెందిన బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో బ్యారన్‌లో మంటలు చెలరేగి రూ.4లక్షల విలువైన పొగాకు మొత్తం పూర్తిగా కాలిబూడిదైపోయింది. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక ఎస్ఐ బంగారుబాబు సంఘటనాస్థలికి తన సిబ్బందితో చేరుకుని మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. ఈమేరకు కేసు నమోదు చేసి నష్టం అంచనాలు వేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఎస్ఐ తెలిపారు. మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బందిలో డీ రమేష్ బాబు, నాగేశ్వరరావు, వీరబాబు, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.



వాడరేవులో హార్బర్ నిర్మాణం కోసం పరిశీలన చేసిన స్థలం

హార్బర్ ఆశల తీరం

- ఎదురుచూస్తోన్న మత్స్యకారులు, నిరుద్యోగులు
- 2014లోనే కేంద్ర ప్రభుత్వం అధ్యయనం.. అటకెక్కించిన వైసీపీ
- తాజాగా ఇన్‌చార్జి మంత్రి ప్రకటనతో చిగురించిన ఆశలు
- అన్నీ సక్రమంగా జరిగితే ఫిబ్రవరి లేదా ఏప్రిల్‌లో పనులు



వలలకు మరమ్మతులు చేస్తున్న మత్స్యకారులు

చీరాలటౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వాడరేవు సముద్రతీరంలో హార్బర్ నిర్మాణంపై 2014లోనే కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేసింది. రూ.450 కోట్లతో అంచనాలను కూడా రూపొందించారు. ఇక నిర్మాణమే తరువాయి అని మెరుగైన ఉపాధి అవకాశాలు దక్కుతాయని నిరుద్యోగులు.. మార్కెటింగ్ పెరిగి లాభాలు గడించవచ్చని తీర ప్రాంత మత్స్యకారులు ఆశించారు. అయితే వైసీపీ ప్రభుత్వం వాడరేవు హార్బర్‌ను అటకెక్కించింది. దీంతో మత్స్యకారులు, నిరుద్యోగుల నిరాశకు గురయ్యారు. ఈ పరిస్థితుల్లో చీరాల మండలం దేవాంగపురి గ్రామంలో మంగళవారం జరిగిన సభలో ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి హార్బర్ నిర్మాణంపై ప్రకటన చేయడంతో తిరిగి మత్స్యకారుల్లో ఆశలు చిగురించాయి. వీలైనంత త్వరగా హార్బర్ నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు చేపడతామని చెప్పడంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో హార్బర్ అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. వాడరేవులో డిగ్రీలు పూర్తి చేసి సుమారు 1000 మంది నిరుద్యోగులు ఉన్నారు. ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో వారంతా తప్పనిసరి పరిస్థితుల్లో వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో హార్బర్ నిర్మాణం జరిగితే మత్స్యకారుల మనుగడకు ఆయా కుటుంబాల్లోని నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



2014లో కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో అధ్యయనం (ఫైల్)

ఉద్యోగం లేక.. వేటతోనే అండ



మత్స్యకార కుటుంబంలో జన్మించాను. అప్పులు చేసి తల్లి దండ్రులు చదివించారు. ఏదో ఒక ఉద్యోగం దొరుకుతుందని భావించాను. అయితే పెద్దవాళ్లతో కలిసి వేటకు వెళుతూ కుటుంబానికి అండగా ఉంటున్నాను. హార్బర్ నిర్మాణం జరిగితే నిరుద్యోగులకు ఉద్యోగాలు అందుతాయి. మా బాధలు తీరుతాయి.

-ఓసిపిల్లి కొండబాబు, బీఎస్సీ కంప్యూటర్స్

మార్కెటింగ్‌తో పాటు కూలి



హార్బర్ నిర్మాణం జరుగుతుందని ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. నిర్మాణాలు జరిగితే మార్కెటింగ్ పెరుగుతుంది. తద్వారా కూలి ధరలు కూడా పెరుగుతాయి. మా జీవితాలు బాగుపడాలంటే హార్బర్ రావాలి.

- కఠారి శ్రీను, మత్స్యకారుడు

ఒప్పందం జరిగింది

బెంగళూరుకు చెందిన మారిటైన్‌తో ఒప్పందం జరిగింది. డీపీఆర్ అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపుగా ప్రణాళికలు సిద్ధం చేశాం. పూర్తయ్యాక ఏపీ మారిటైం బోర్డు వారు పనులు ప్రారంభిస్తారు. అన్ని సక్రమంగా జరిగితే ఫిబ్రవరి లేదా ఏప్రిల్‌లో నిర్మాణాలు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.

- కృష్ణకిషోర్, మత్స్యశాఖ ఇన్‌చార్జి జేడీ, బాపట్ల జిల్లా



స్మార్ట్ లేఅవుట్ నమూనా

జాగా.. జాప్యం

ప్రభుత్వం మారింది.. పేరు మారింది.. అయినా అల్పాదాయవర్గాల వారి ఇంటి కల నెరవేరడం లేదు. జాగా వస్తోంది.. ఇల్లు కట్టుకుందాం.. అద్దె కష్టాల నుంచి బయట పడదామనుకున్న దరఖాస్తుదారులు ఏళ్లుగా ఎదురుచూపులతో ఉన్నారు. వైసీపీ ప్రభు త్వం జగనన్న స్మార్ట్‌సిటీల పేరుతో హడావుడి చేయగా కూటమి ప్రభుత్వం దానిని ఎన్టీఆర్ స్మార్ట్‌సిటీగా పేరు మార్చడంతోనే సరి పెట్టింది. బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలు ఆకాశాన్నంటుతుండగా.. సామా న్యులు స్థలాలు కొనుగోలు చేయలేకపో తున్నారు. ఈ పరిస్థితుల్లో తక్కువ ధరకు ప్రభుత్వం అందజేసే స్మార్ట్‌సిటీల్లో ఇంటి స్థలాల కోసం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 28,416 మంది దరఖాస్తులు చేసుకుని ఎదురు చూస్తున్నారు. అయితే ఇంతవరకు స్మార్ట్‌సిటీల భూ సేకరణ దశ దాటలేదు. స్థలాల సేకరణ.. లేఅవుట్ల ఏర్పాటు.. ధర నిర్ణయం.. ప్లాట్ల కేటాయింపు.. ఎప్పటికి జరుగు తుందనేది తెలియడంలేదు. ఇటీవల మంత్రి నారా యణ ఎన్టీఆర్ స్మార్ట్ సిటీలపై సమీక్షించి ప్రక్రియ వేగవంతం చేయమని ఆదేశించినా అధికారుల్లో కదలిక కానరావడంలేదు.



పురపాలక సంఘాల్లో కొత్తగా లేఅవుట్లు వేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం భూ బ్యాంకు ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త లేఅవుట్లు ఏర్పాటుకు అర్బన్ డెవలప్ మెంట్ అథార్టీలకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఇప్పటి వరకు ఏ ఒక్క మున్సిపాల్టీ పరిధిలో లేఅవుట్లు ఏర్పా టు చేయలేదు. గత నెలలో మున్సిపల్ శాఖ మంత్రి నారా యణ ఎన్టీఆర్ స్మార్ట్‌సిటీల లేఅవుట్లపై సమీక్షించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదే శించారు. అయితే ఇంతవరకు అధికారుల్లో కదలిక లేదు.

నిర్ణయంతోనే సరి

హడావుడితో స్మార్ట్‌సిటీలు సరి

- అల్పాదాయవర్గాల కల నెరవేరేదెన్నడో?
- నెలలు గడుస్తున్నా ప్రారంభంకాని భూ సేకరణ
- గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో
- 28,416 దరఖాస్తులు
- మంత్రి నారాయణ సమీక్షించినా వేగవంతం కాని ప్రక్రియ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

స్థలం కొని ఇల్లు కట్టుకోవాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో సామాన్యులకు అసాధ్యం. ఈ పరిస్థితుల్లో అల్పాదాయ వర్గాలకు తక్కువ ధరలకే స్థలాలు ఇస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వం జగనన్న స్మార్ట్‌సిటీల పేరుతో హడావుడి చేసింది. తక్కువ ధరకు ప్రభుత్వం స్థలం ఇస్తుందని అందులో ఇల్లు కట్టుకోవచ్చని ఎందరో ఆశపడ్డారు. వేలాది మంది మధ్య తరగతి వర్గాలు ఇంటి జాగా కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే నాటి వైసీపీ ప్రభుత్వం పథకం ప్రకటనకే పరిమితమైంది. భూ సేకరణ జరగలేదు.. లేఅవుట్ల ఏర్పాటు చేయలేదు. స్థలాలు వస్తాయని ఆశించిన వారికి నాటి ప్రభుత్వ తీరుతో దరఖాస్తుదారులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత జగనన్న స్మార్ట్ సిటీల పేరును ఎన్టీఆర్ స్మార్ట్‌సిటీలుగా పేరు మా ర్చింది. కూటమి ప్రభు త్వంలో తమకు తప్ప నిసరిగా స్థలాలు వస్తా యని దరఖాస్తుదారులు ఆశ లు పెట్టుకున్నారు. అయితే నెల లు గడుస్తున్నా వారి కల నెరవేర లేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 28,416 మంది ఇంటి స్థలం కోసం ఎదురు చూస్తున్నారు. స్థలాల కేటాయింపును మూడు విభాగాలుగా విభజించి దరఖాస్తులు స్వీకరించారు. 150 చదరపు గజాల స్థలాల కోసం 9,361 మంది, 200 చదరపు గజాల కోసం 8,228 మంది, 240 చదరపు గజాల కోసం 10,827 మంది దరఖాస్తు చేసుకున్నారు. మున్సిపాల్టీల వారీగా దరఖాస్తుదారుల జాబితాలను సిద్ధం చేశారు. స్థలాలను సేకరించి లేఅవుట్లు ఏర్పాటు చేసిన అనంతరం దరఖాస్తుదారులకు ప్లాట్లను ప్రభుత్వం విక్రయించాలి. అయితే ఇంకా భూసేకరణ ప్రక్రియ ప్రారంభం కాలేదు. లేఅవుట్ల ప్రక్రియలో జాప్యం జరుగుతుండటంతో వారు నిరాశకు లోనవుతున్నారు.

మునిసిపాల్టీ	దరఖాస్తుల సంఖ్య
బాపట్ల	3,171
చిలకలూరిపేట	651
గుంటూరు	9,614
మాచర్ల	436
మంగళగిరి	1,344
నరసరావుపేట	1,864
పొన్నూరు	531
రేపల్లె	1,066
సత్తెనపల్లి	346
తాడేపల్లి	2,065
తెనాలి	2,962
వినుకొండ	608
దాచేపల్లి	56
గురజాల	21
అద్దంకి	1,104
చీరాల	2,095
మొత్తం	28,416

పొలాల దారి ఆక్రమణపై విచారణ

1 ఇటీవల బాచిన కృష్ణచైతన్య క్వారీపై రైతుల ఫిర్యాదు

బల్లికురవ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అద్దంకి ఇన్‌చార్జిగా ఉన్న సమయంలో బాచిన కృష్ణ చైతన్య గ్రానైట్ క్వారీకి లీజులు పొంది ఎంతో కాలం నుంచి తాము పొలాలకు వెళ్లే దారిని ఆక్రమించారని మల్లాయపాలెం రైతులు ఇటీవల చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్డీవో కొత్త మల్లాయపాలెం సమీపంలోని సర్వే నెంబరు 871లోని గ్రానైట్ క్వారీని పరిశీలించారు. ఫిర్యాదు చేసిన రైతులు జూపల్లి రాఘవరావు, గంగాధర్, శేషయ్య, కోండూరి సూర్యనారయణ, వెంకట్రావు, అబ్బారెడ్డి రామాంజనేయులు మరో ఇరవై మంది ఆర్డీవో మాట్లాడారు. పొలాలకు వెళ్లే దారిని బాచిన కృష్ణ చైతన్య ఆక్రమించారని, దీంతో తాము తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని ఆర్డీవోకు రైతులు చెప్పారు. తక్షణమే పురాతన కాలం నుంచి ఉన్న దారిని ఇప్పించాలన్నారు. మ్యాప్‌ను పరిశీలించిన ఆర్డీవో పరిశీలించారు. తన ఇంటిపై తనకు తెలియకుండా గ్రానైట్ లీజు ఇచ్చారని అబ్బారెడ్డి రామంజనేయులు అనే రైతు ఆర్డీవోకు చెప్పారు. ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిలో గ్రానైట్ వ్యర్థాలను వేశారని మరికొందరు రైతులు తెలిపారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ రవినాయక్, సర్వేయర్ చంద్ర పాల్గొన్నారు.



మల్లాయపాలెంలో గ్రానైట్ క్వారీ వద్ద పొలాల దారిని పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

భూ విలువలు.. పెరిగాయ్



- వాణిజ్య ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చార్జీల పెరుగుదల
- సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో మోస్తరుగా పెంపు
- రేపటి నుంచి అమల్లోకి నూతన మార్కెట్ విలువలు

గుంటూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ భూ విలువలు పెరిగాయి.. పెరిగిన రిజిస్ట్రేషన్ చార్జీలు శని వారం నుంచి అమల్లోకి రానున్నాయి. అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లో పది నుంచి 20 శాతం వరకు మార్కెట్ విలువలు పెంచారు. సెమీఅర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ఓ మోస్తరుగా చార్జీలను పెంచారు. వాణిజ్య ప్రాంతాల్లో, ధనికవర్గాలు నివాసం ఉండే రెసిడెన్షియల్ ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువలను గజానికి 10 నుంచి 15 వేల వరకు పెంచారు. పెరిగిన మార్కెట్ విలువలను పరిశీలిస్తే..

★ మంగళగిరి పరిధిలో భారీగా..

రాజధాని సమీపంలోని మంగళగిరి ప్రాంతంలో భూముల మార్కెట్ విలువలను భారీగానే పెంచారు. తాడేపల్లి పరిధిలో మార్కెట్ విలువ గజం ఇప్పటి వరకు తక్కువలో 5 వేల 500 ఉంది. అయితే దాన్ని ఏకంగా 10 వేలకు పెంచారు. ఎక్కువగా 15 వేలు ఉంటే దానిని కూడా రూ.30 వేలకు పెంచారు. మంగళగిరిలో అతి తక్కువ గజం 6 వేలు ఉండగా దానిని ప్రస్తుతం 10 వేలకు పెంచారు. అత్యధికంగా గజం 24 వేలు ఉంటే దానిని ఏకంగా రూ.40 వేలకు పెంచారు. ఆత్మకూరు ప్రాంతంలో తక్కువగా గజం 5 వేలు ఉంటే దానిని ఎనిమిది వేలకు పెంచారు. ఎక్కువగా 8 వేలు ఉంటే దానిని పదివేలకు పెంచారు.

★ తెనాలి ప్రాంతంలో..

తెనాలి పట్టణంలోనూ భూముల మార్కెట్లలో కొన్ని వ్యాపార వాణిజ్య ప్రాంతాల్లో భారీగా పెంచారు. గాంధీనగర్లో తక్కువ 20 వేలు ఉంటే దానిని 24 వేలకు పెంచారు అత్యధికంగా 50 వేలు ఉంటే దానిని 60 వేలకు పెంచారు గంగానమ్మపేటలో తక్కువ 20 వేలు ఉంటే దానిని 25 వేలకు, ఎక్కువ 50 వేలు ఉంటే దానిని 60 వేలకు పెంచారు. మార్కెట్ ఏరియాలో తక్కువగా 25 వేలు ఉంటే దానిని 30 వేలకు, అత్యధిక స్థాయిలో 50 వేలు ఉంటే దానిని 60 వేలకు పెంచారు.

★ నరసరావుపేటలోనూ స్వల్పం..

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావు పేటలోను ఈ దఫా స్వల్పంగానే భూముల మార్కెట్ విలువ లు పెంచారు. రైల్వేస్టేషన్ రోడ్డులో తక్కువగా 19వేల 500 ఉంటే దానిని 21 వేలకు, అత్యధికంగా 78 వేలు ఉంటే దానిని 80 వేలకి పెంచారు. సత్తెనపల్లి రోడ్డులో తక్కువగా 32 వేల 500 ఉంటే దానిని 35 వేలు, అత్యధికంగా 52 వేలు ఉంటే దానిని 57 వేలకు పెంచారు. చిలకలూరిపేట రోడ్డులో తక్కువగా 39 వేలు ఉంటే దానిని 42 వేలకు, ఎక్కువగా 78 వేలు ఉంటే దానిని 80 వేలకు పెంచారు.

★ చీరాలలోనూ పెరిగాయి..

చీరాలలోను భూముల మార్కెట్ విలువలను పెంచారు. ఆంజనేయస్వామి దేవాలయం రోడ్డు, ఊటుకూరి వారి వీధి ప్రాంతంలో భూమి మార్కెట్ విలువ తక్కువలో 5 వేలు ఉంటే దానిని 7 వేలు పెంచారు. అత్యధికంగా 16 వేలు ఉంటే 20 వేలకు పెంచారు. సంతబజారు, గంజిపాలెం ప్రాంతాల్లో తక్కువగా 10 వేలు ఉంటే దానిని 12 వేలకు, ఎక్కువ 24 వేలు ఉంటే 35 వేలకు పెంచారు.

బాపట్ల పట్టణంలో..

జిల్లా కేంద్రమైన బాపట్లలోని పలు ప్రాంతాల్లో మార్కెట్ విలువలు స్వల్పంగా పెరిగాయి. జీబీసీ రోడ్డులో తక్కువగా 9 వేలు ఉంటే దానిని 13 వేల పెంచారు. అత్యధికంగా 25 వేలు ఉంటే దానిని 32 వేలకు పెం చారు. ఆఫీసర్స్ క్లబ్ రోడ్డులో తక్కువగా 8 వేలు ఉంటే దానిని 12 వేలకు, ఎక్కువగా ఉన్న 22 వేలను నాలుగు వేలు తగ్గించి 18 వేలకు కుదించారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డులో తక్కువగా 7 వేలు ఉంటే దానిని 9 వేల 500కు పెంచారు. ఇప్పటివరకు అత్యధికంగా ఉన్న 13 వేలను 16 వేలకు పెంచారు.

గుంటూరులో.. గజం 95 వేలు

గుంటూరులోని బ్రాడీపేటలో గజం మార్కెట్ విలువ ఇప్పటి వరకు రూ.84 వేలుగా ఉంది. తాజాగా ఆ విలువను రూ.95 వేలకు పెంచారు. తక్కువలో గజం రూ.38 వేలు ఉండగా దానిని రూ.42 వేలకు పెంచారు. బ్రాడీపేటలో అతి తక్కువ గజం 36 వేలు ఉండగా దానిని 38 వేలకు పెంచారు. విద్యానగర్, వికాస్‌నగర్, హరిహర మహల్ రోడ్లలో తక్కువగా 32 వేలు, అత్యధికంగా 38 వేలు ఉండగా, అక్కడ తాజాగా తక్కువగా 35 వేలకు, ఎక్కువగా 40 వేలకు పెంచారు. బృందావన్ గార్డెన్స్ ప్రాంతంలో ఇప్పటి వరకు తక్కువగా 34 వేలు, అధికంగా రూ.39 వేలు ఉండగా దానిని 35 వేలు, 40 వేలు చేశారు. కృష్ణనగర్‌లో తక్కువ 33 వేలు ఉంటే దానిని 34 వేలకు పెంచారు. అత్యధికంగా 36 వేలు ఉంటే 37 వేలకు పెంచారు. పట్టాభిపురంలో తక్కువగా గజం 34 వేలు ఉంటే అక్కడ కూడా 35 వేలకు పెంచారు. ఎక్కువగా 36 వేలు ఉంటే దానిని 37 వేలకు పెంచారు.

★ రేపల్లెలో స్వల్పంగా..

రేపల్లెలో స్వల్పంగానే భూముల మార్కెట్ విలువలను పెంచారు. రైల్వేస్టేషన్ రోడ్డులో ప్రస్తుతం తక్కువగా 17 వేలు ఉంటే దానిని 18 వేలకు పెంచారు. అత్యధికంగా 25 వేలు ఉంటే దానిని 26 వేల 500 కు పెంచారు. ఉప్పూడి రోడ్డులో తక్కువ 13 వేలు ఉంటే దానిని 18 వేలకు, అత్యధికంగా 25 వేలు ఉంటే దానిని 26, వేల 500కు పెంచారు. రామకోటిపేటలో తక్కువగా 17 వేలు ఉంటే 18 వేలు, అత్యధికంగా 25 వేలు ఉంటే దానిని 26 వేల 500కు పెంచారు.

★ చిలకలూరిపేటలో..

చిలకలూరిపేటలోని కృష్ణమహల్ రోడ్డులో అతి తక్కువగా 17 వేలు ఉంటే దానిని 19 వేలకు పెంచారు. అత్యధికంగా 25, వేల 500 ఉంటే దానిని అంతేఉంచారు. నరసరావుపేట రోడ్డులో తక్కువగా 5 వేలు ఉంటే 6 వేలకు, ఎక్కువగా 7 వేల200 ఉంటే 8 వేలకు పెంచారు. చీరాల నుంచి నరసరావుపేట వెళ్లే రోడ్డులో తక్కువగా 15 వేలు ఉంటే దానిని 16 వేల 500, అత్యధికంగా 15 వేలు ఉండగా దానిని 16 వేల 500కు పెంచారు.

★ సత్తెనపల్లిలో భారీగా..

సత్తెనపల్లి పట్టణంలో భూముల మార్కెట్ విలువలను భారీగా పెంచారు. మెయిన్ రోడ్డులో ప్రస్తుతం అతి తక్కువ ధర 3వేల 600 దానిని 4వేల 500కు పెంచారు. అత్యధికంగా 22 వేల 500 ఉంటే దానిని ఏకంగా 46 వేలకు పెంచారు. రైల్వే స్టేషన్‌రోడ్డులోని పశ్చిమ వైపు తక్కువగా గజం 8 వేల 200 ఉంటే దానిని 10 వేలకు పెంచారు. ఎక్కువగా 46 వేలు ఉంటే దానిని 50వేలకు పెంచారు. కట్టమూరు వారి వీధి మెయిన్ రోడ్డులో తక్కువగా 8 వేల 200 ఉంటే దానిని పదివేలకు, అత్యధికంగా 22 వేల 500 ఉంటే 30వేలకు పెంచారు.

నేరాల నియంత్రణకు.. సీసీ కెమేరాలు

- నేరగాళ్లలో నేరాల ఆలోచన రాకుండా చేయడమే లక్ష్యం
- దేశంలో మొదటిసారిగా పల్నాడులో డిజిటల్ బారికేడింగ్
- నరసరావుపేటలో వివిధ విభాగాల ప్రారంభోత్సవంలో డీజీపీ తిరుమలరావు

నరసరావుపేట లీగల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నేరాలు చేయాలనే ఉద్దేశం నేరస్తులకు రాకూడదనేది పోలీసుల ప్రథమ లక్ష్యం. అందుకోసం ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నాం. అన్ని ప్రాంతాల్లో సీసీ కెమేరాలను అమరుస్తున్నాం..' అని డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. డాగ్‌స్క్వాడ్, డ్రోన్లు, సీసీ కెమెరాలు, డిజిటల్ బారికేడింగ్ విభాగాలను నరసరావుపేటలోని పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం డీజీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. ఎస్పీ కార్యాలయంలో డీజీపీ మొక్కలు నాటారు. నూతనంగా నిర్మించిన పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక కార్యాలయంలో పోలీస్ అధికారులు, మీడియా ప్రతినిధులతో డీజీపీ మాట్లాడారు. దాతలు ముందుకు వచ్చి వారి ప్రాంతాల్లో సీసీ కెమేరాలను అమర్చుకోవాలన్నారు. నేరం జరిగిన తర్వాత దాన్ని ఛేదించడం కాకుండా ముందస్తుగానే దానిని నియంత్రించే చర్యలు అవసరమన్నారు. సీసీ కెమేరాల సహాయంతో నిఘా ఏర్పాట్లు చేస్తూ నేరాలు తగ్గుతాయన్నారు. సీసీ కెమేరాలను అనుసంధానం చేసి సంబంధిత పోలీస్‌స్టేషన్, కమాండ్ కంట్రోల్ భవనం నుంచి పరిశీలిస్తూ తగిన ఆదేశాలు జారీ చేయవచ్చన్నారు. నేర పరిశోధనకు ఈ సాంకేతికత ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల సబ్ డివిజన్‌కు 5 డ్రోన్ల చొప్పున కేటాయించినట్లు చెప్పారు. దేశంలోనే మొదటిసారిగా డిజిటల్ బారికేడింగ్‌ను పల్నాడు జిల్లాలో ఏర్పాటు చేసినట్లు డీజీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠత్రిపాఠి, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్‌గనోరే, నరసరావుపేట ఆర్డీవో, తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో డిజిటల్ బారికేడ్లను ప్రారంభిస్తున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు.

సదరమ్ సర్టిఫి'కేట్ల'పై విచారణ

- మండలాలవారీగా నోటీసులు జారీకి సిద్ధం
- ఇతర జిల్లాల వైద్యాధికారులతో పరిశీలన
- వచ్చే నెల నుంచి రిమ్స్, మార్కాపురం, గిద్దలూరు ఏరియా ఆస్పత్రులలో ప్రత్యేక కేంద్రాల ఏర్పాట్లు
- రేపటితో ముగియనున్న ఆరోగ్య పింఛన్ల విచారణ

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వివిధ రకాల వ్యాధుల పేరుతో సదరమ్ సర్టిఫికెట్లు పొంది పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారులపైనా ప్రభుత్వం దృష్టిపెట్టింది. వారిని విచారణ చేసేందుకు వైద్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది. అందుకోసం మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒంగోలులోని రిమ్స్‌తోపాటు మార్కాపురం, గిద్దలూరు ఏరియా వైద్యశాలలో లబ్ధిదారుల సదరమ్ సర్టిఫికెట్ల పరిశీలనతోపాటు ఇతర జిల్లాల నుంచి వచ్చే వైద్యాధికారులు పరిశీలన చేయనున్నారు. అందుకోసం ఇప్పటికే వైద్యశాఖ ఏర్పాట్లు చేసింది. జిల్లాలో క్యాన్సర్, కళ్లు లేవని, దివ్యాంగులు, మూగ, చెవిటి తదితర రకాల సర్టిఫికెట్లతో పింఛన్లు పొందుతున్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ సానుభూతిపరులకు ఇష్టం వచ్చినట్లుగా సర్టిఫికెట్లు మంజూరు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఏడునెలల క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బోగస్ లబ్ధిదారులపై ప్రభుత్వానికి పెద్దఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో ఇప్పటికే ఆరోగ్య పింఛన్ల లబ్ధిదారులు విచారణ చేపట్టారు. జిల్లాలో ఐదు బృందాలు ఇంటింటికి వెళ్లి విచారణ చేయగా అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి.

ఆరోగ్య పింఛన్లపై ముగుస్తున్న విచారణ

శుక్రవారంతో ఆరోగ్య పింఛన్లపై విచారణ ముగియనుండగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు ఆ విచారణ బృందం నివేదికలు ఇవ్వనున్నారు. ఆ నివేదికను కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వైద్యశాఖ అందజేయనుంది. ఈ విచారణ ముగింపు దశకు చేరుకోవడంతో మిగిలిన పింఛన్లపై వైద్యశాఖ దృష్టి కేంద్రీకరించింది. లబ్ధిదారులకు జిల్లాలోనే సదరమ్ సర్టిఫికెట్లు ఇవ్వడంతో ఇప్పుడు ఆ విచారణ ఆ అధికారులతో కాకుండా ఇతర జిల్లాల వైద్యాధికారులు చేయనున్నట్లు తెలిసింది. అందుకోసం ఇప్పటికే మండలాల వారీగా జాబితాలను సిద్ధం చేసినట్లు తెలిసింది. డీఆర్‌డీఏ నుంచి అందుకు అవసరమైన జాబితాలను కూడా వైద్యశాఖ అధికారులు తెప్పించుకొని పరిశీలించినట్లు తెలిసింది. మండలాల వారీగా ఆ జాబితాలను పరిశీలించి సదరమ్ సర్టిఫికెట్లను పరిశీలించేందుకు ఎంపిక చేసిన వైద్యశాలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఎంపిక చేసిన మూడు కేంద్రాల్లో వైద్యాధికారులు సర్టిఫికెట్లను పరిశీలన చేయడంతోపాటు అవసరమైతే ఆయా ధ్రువీకరణ పత్రాల ఆధారంగా మరోసారి వైద్యపరీక్షలు చేయనున్నట్లు సమాచారం. అందుకోసం వైద్యశాఖ అధికారులు ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఆ పరీక్షలు స్థానిక డాక్టర్లు చేస్తే వత్తిళ్లు వచ్చే అవకాశం ఉండటంతో ఇతర జిల్లాల వైద్యాధికారులను అందుకోసం నియమించినట్లు సమాచారం.



అత్యవసర ఆరోగ్యశ్రీని అందజేస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ

ఎమ్మెల్యే చొరవతో అత్యవసర ఆరోగ్యశ్రీ అందజేత

చీరాలటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే కొండయ్య చొరవతో వైద్యం కోసం ఓ మహిళకు అధికారులు అత్యవసర ఆరోగ్యశ్రీ పత్రాన్ని అందజేశారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని కొత్తపాలెంకు చెందిన నూతలపాటి ఫాతిమామేరి కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతుంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం, వీరి అవగాహన లేమితో ఆరోగ్యశ్రీ పొందలేకపోయారు. నిరుపేద కుటుంబం కావడంతో వైద్యం అందని ద్రాక్షగా మిగిలింది. దీంతో మంగళవారం మండల పరిధిలోని దేవాంగపురిలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో నిర్మించిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి గృహ నిర్మాణ మంత్రి పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫాతిమామేరి బంధువులు మంత్రి, ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. దీంతో వెంటనే స్పందించిన నాయకులు కలెక్టర్ వెంకటమురళికి సిఫార్స్ చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ గోపీకృష్ణ బుధవారం వారికి అత్యవసర ఆరోగ్యశ్రీ పత్రాన్ని అందజేశారు. దీంతో వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా అమావాస్య పూజలు



ప్రత్యేక అలంకరణలో వీరరాఘవస్వామి

చీరాలటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వీరరాఘవస్వామి దేవస్థానంలో బుధవారం ఘనంగా తై అమావాస్య పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు విశేషంగా పాల్గొని స్వామిని అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి చిన్ని కృపారావు ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

టెక్నాలజీపై అవగాహనతో ఉన్నత శిఖరాలు



ముగింపు వర్క్‌షాపులో జ్ఞాపికలను అందుకుంటున్న ప్రతినిధులు

చీరాలటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక టెక్నాలజీపై అవగాహన ద్వారా ఉన్నత శిఖరాలు చవిచూడవచ్చని చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు మరియు కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న విఎల్ఎస్ఐ డిజైన్ వర్క్‌షాప్ విజయవంతంగా బుధవారంతో ముగిసింది. ఈసందర్భంగా ప్రిన్సిపల్ డా.కె జగదీష్ మాట్లాడుతూ హైదరాబాదుకు చెందిన కల్కి టెక్నాలజీస్ ఆధ్వర్యంలో ఈసిఈ మూడవ సంవత్సరం విద్యార్థులకు వర్క్‌షాపు జరిగినట్లు వివరించారు. ఈసిఈ విభాగాధిపతి డా.డి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ శిక్షణ పొందిన అంశాలతో నూతన సాఫ్ట్‌వేర్‌లు సృష్టించి రాణించాలన్నారు. వర్క్‌షాపుకు డా.డివిఎస్ సుకన్య, కవిత కోఆర్డినేటర్‌లుగా వ్యవహరించారు. ముగింపు సభలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బరితెగిస్తున్న ఇసుకాసురులు



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్ వద్ద ఎస్సై వెంకటేశ్వర్లు

వేటపాలెం(చీరాలటౌన్), జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అధికారులు చర్యలు కట్టుదిట్టం చేసిన ఇసుక అక్రమార్కులు పోలీసు, రెవెన్యూ అధికారుల కళ్లు గప్పే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. రాత్రి పగలు తేడా లేకుండా ఏదోమూల ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఈక్రమంలోనే వేటపాలెం జాతీయ రహదారిలో అర్ధరాత్రి ఇసుక రవాణా సాగిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్సై వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి పట్టుకున్నారు. కేసు నమోదు చేసుకుని ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. అలాగే ఒకరిపై కేసు నమోదు చేశారు.

వరిలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

మేదరమెట్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : వరి పంట గింజ గట్టిపడే దశలో పురుగులు కంకులను నష్టపరచకుండా సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మండలంలోని బొడ్డువానిపాలెం, తమ్మవరం గ్రామాల్లో చెరువు, బోర్ల కింద సాగుచేసిన వరి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతలతో ఆయన మాట్లాడుతూ గింజ గట్టి దశపడే దశతో రెల్లు లాల్చు పురుగు ఆశిస్తుందని దాని నివారణకు ఎకరానికి క్లోరో ఫైరిపాస్ 500 మి.లీ. లేదా ప్రొపెనోపాస్ 400 మి.లీ. 200లీటరుల నిటిలో కలిపి సాయంత్రం వేళ పిచికారీ చేసుకోవాలని తెలిపారు. నాణ్యమైన దిగుబడిని సాధించడం కోసం సరైన సస్య రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏ ఆఫ్రిన్, ఎంపీ ఈవో హసీనా, ఎఎంసీ సిబ్బంది యలమంద, రైతులు పాల్గొన్నారు.

కందుల విక్రయానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

పీసీపల్లి, జనవరి29(ఆంధ్రజ్యోతి) : కంది పంటను సాగు చేసిన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.ప్రకాశరావు చెప్పారు. మండలంలోని నేరేడుపల్లి, మురుగుమ్మి గ్రామాల్లో రైతులు సాగుచేసిన కంది పైరును బుధవారం ఆయన పరిశీలించారు.

రీ-సర్వేలో భూ వివాదాలు లేకుండా చేయాలి



అంబడిపూడిలరీసర్వేను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

బల్లికురవ. జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : భూ సర్వేలో గ్రామాలలో ఎలాంటి భూ వివాదాలు లేకుండా అధికారులు తగు జాగ్రత్తలు పాటించాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు కోరారు. బుధవారం మండలంలోని గుంటుపల్లి రెవెన్యూ పరిధిలోని అంబడిపూడిలో జరుగుతున్న రీ సర్వేను ఆర్డీవో పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్డీవో సర్వే చేస్తున్న టీంలతో మాట్లాడుతూ సర్వే చేసే సమయంలో అక్కడ ఉన్న రైతులకు నోటీసులు అందించి వారి సమక్షంలో కొలతలు వేయాలన్నారు. అలానే ప్రభుత్వ భూములు ఆక్రమించుకొని సాగు చేస్తే వారిని నమోదు చేయవద్దు అన్నారు. తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన భూములకు వారి కుమారులు హక్కులు ఉంటే రికార్డులో నమోదు చేయాలన్నారు. ఎక్కడ వివాదాలు లేకుండా సర్వే పూర్తి చేయాలన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని గ్రామాల రెవెన్యూ అధికారులతో ఆర్డీవో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో రెవెన్యూ పరమైన సమస్యలు ఉంటే వెంటనే పరిష్కారం చేయాలన్నారు. ఎక్కడ చెడ్డ పేరు లేకుండా సిబ్బంది పనిచేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ రవినాయక్, సర్వే డీటీ ప్రహర్ష పాల్గొన్నారు.

అత్యవసర పనులకు రూ.26.14 కోట్లు

- జలవనరులశాఖ ప్రతిపాదన
- నీటి సంఘాలకు అప్పగించే అవకాశం

ఒంగోలు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది సాగునీటి సరఫరాపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. అధ్వానంగా ఉన్న నీటి సరఫరా కాలువలు, ఇతర వనరులకు అత్యంత అవసరంగా చేయాల్సిన పనులపై యంత్రాంగం నుంచి ప్రతిపాదనలు కోరింది. వైసీపీ పాలనలో సాగునీటి వనరుల నిర్వహణ దారుణంగా మారింది. కనీసం కాలువల్లో చిల్లచెట్ల తొలగింపు, పూడికతీత, అక్కడక్కడ దెబ్బతిన్న షట్టర్లు, డ్రాపుల మరమ్మతుల వంటి చిన్న చిన్న పనులకు కూడా నిధులు ఇవ్వలేదు. దాని వల్ల పొలాలకు నీరు చేరే క్రమంలో సగం నీరు వృథాగా పోయేది. జిల్లాలోని సాగర్ కాలువల్లో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపించింది. ఈక్రమంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తక్షణం చేయాల్సిన పనులపై మూడు మాసాల క్రితమే దృష్టిసారించి ప్రస్తుత సీజన్‌లో నీటి సరఫరాకు ఉన్న ఆటంకాలను తొలగించింది. అలా ఉమ్మడి జిల్లాలో రూ.12 కోట్లతో పనులు చేశారు.

ప్రతిపాదనలు పంపిన అధికారులు

కాగా అనేకచోట్ల మేజర్, మైనర్ కాలువలు అధ్వానంగా ఉన్నాయి. ఎన్ఎస్‌పీ పరిధిలోని ప్రధాన కాలువలతోపాటు మేజర్లు, మైనర్లు చిల్లచెట్లతో నిండిపోవడం, పూడిక పేరుకుపోయి గుర్రపుడెక్క వంటివి పెరిగాయి. దీంతో నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడటంతోపాటు షట్టర్లు, డ్రాపులు దెబ్బతిని వృథాగా నీరు పోతోంది. అలాగే మీడియం వనరుల కాలువల్లనూ ఇలాంటి పరిస్థితే ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహా ఉండటాన్ని గుర్తించిన ప్రభుత్వం ఆ పనులు చేపట్టి వచ్చే ఏడాది (2025-26) పంటలకు నీటి సరఫరా సజావుగా సాగేందుకు చర్యలు తీసుకుంటోంది. ఆ తరహా పనులపై అధికారులను ప్రతిపాదనలను కోరింది. గత పక్షంరోజులుగా జలవనరులశాఖ అధికారులు ఈ ప్రతిపాదనలపై కసరత్తు చేసి ఒంగోలు సర్కిల్‌తో ఉన్న ఉమ్మడి జిల్లాలో ఎన్ఎస్‌పీ అలాగే మీడియం ఇరిగేషన్ పరిధిలో మొత్తం రూ.26.14 కోట్లతో అత్యవసర పనులు చేపట్టాలని ప్రతిపాదించారు.

సాగునీటి సంఘాలకు పనులు

అందులో భారీ నీటివనరుల విభాగంలో ఉండే ఎన్ఎస్‌పీ కింద రూ.12.93కోట్లు ప్రతిపాదించగా చీమకుర్తి డివిజన్‌లో రూ.7.68 కోట్లు, అద్దంకి డివిజన్‌లో రూ.3.20 కోట్లు, దర్శి డివిజన్‌లో రూ.2.05 కోట్లు అవసరంగా నివేదించారు. మీడియం ఇరిగేషన్‌లో రూ.13.21 కోట్లకు ప్రతిపాదించగా ఒంగోలు డివిజన్ పరిధిలో రూ.8.26కోట్లు, రాళ్లపాడు పరిధిలో రూ.3.95కోట్లు, మార్కాపురం డివిజన్‌కు రూ.కోటి అవసరంగా పేర్కొన్నారు. ఈ పనులను సాగునీటి సంఘాల ద్వారా చేపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఈ తరహా పనులను నీటిసంఘాలతో చేపించారు. ఈసారీ వాటిని ఇవ్వనున్నట్లు సమాచారం. గతంలో రూ.5లక్షల వరకు ఉండే పనిని టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిపై చేపించగా ఈసారి ఆ మొత్తాన్ని రూ.10లక్షలకు పెంచారు. కొత్తగా ఎన్నికైన సాగు నీటి సంఘ కమిటీలకు ఈ పనులు దక్కనున్నాయి.

కనిగిరిలో గొర్రెల మండి రాష్ట్రానికే ఆదర్శం



గొర్రెలమండిని పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కనిగిరిలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లోని గొర్రెలమండి ఏర్పాటు రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. కనిగిరిలో వివిధ కార్యక్రమాలపై వచ్చిన ఆమె పొదిలి రోడ్డులోని పొగాకు బోర్డు ఎదురు డాక్టర్ ఉగ్ర చొరవతో ప్రారంభమైన గొర్రెల మండిని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గొర్రెల పెంపకం చేస్తూ జీవనం చేసే వేలాది కుటుంబాల సంక్షేమం కోసం ఎమ్మెల్యే ఉగ్ర పాటుపడుతున్నారన్నారు. జిల్లాలో గొర్రెల పెంపకందారులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో కూడా మండీలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, నారపరెడ్డి(యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, బాలు ఓబులురెడ్డి, నంబులు కొండయ్య, నంబలు వెంకటేశ్వర్లు, తమ్మినేని వెంకటరెడ్డి, తాతపూడి స్టాలిన్, శ్యామల చినవెంకటేశ్వర్లు, గాయం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

1న జిల్లాలో గృహప్రవేశాలు

2,944 లబ్ధిదారుల

చేతికి ఇళ్ల తాళాలు అప్పగింత

ఒంగోలు నగరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వం ఫిబ్రవరి ఒకటో తేదీన సామూహిక పక్కా గృహాల ప్రారంభోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు గృహనిర్మాణశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆయా శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, పక్కాగృహాల లబ్ధిదారులను ఈ వేడుకలో భాగస్వాములను చేసి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా చర్యలు చేపట్టారు. జిల్లాలో ప్రభుత్వం మంజూరుచేసిన పక్కా గృహాల్లో 2,944 నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ గృహాలను ఒ కటో తేదీన ప్రారంభించి తాళాలు అందజేయనున్నారు. కార్యక్రమాన్ని ప్రభుత్వం గత నెలలోనే నిర్వహించాలని చూసింది. కాని అనివార్య కారణాలతో వాయిదా వేసింది. ఫిబ్రవరి ఒకటో తేదీన రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇళ్ల గృహప్రవేశాల నేపథ్యంలో జిల్లాలో 2,944 గృహాలు ప్రారంభోత్సావాలకు సిద్ధం చేశారు. కార్యక్రమంలో జిల్లాలో మార్కాపురం నియోజకవర్గంలో అత్యధికంగా 677 పక్కాగృహాల్లో ప్రవేశాలను నిర్వహిస్తుండగా అత్యల్పంగా కొండపి నియోజక వర్గంలో 141 ఇళ్లల్లో ప్రవేశాలను నిర్వహించనున్నారు.

కలప దొంగలు

- చెరుకూరు చెరువులో తుమ్మ, చిల్లచెట్ల నరికివేత
- రూ.43లక్షల వరకూ అమ్మకం
- పంచాయతీకి రూపాయి కూడా జమ చేయని వైనం
- ఆర్డీవోకు ప్రజల ఫిర్యాదు
- సాగునీటి సంఘం అధ్యక్షుడి పాత్ర ఉందని ఆరోపణ

పొన్నలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకూరు చెరువులో దొంగలు పడ్డారు. కలపను అక్రమంగా అమ్ముకుని పెద్దఎత్తున డబ్బులు స్వాహా చేశారు. దీనిపై చెరువు పరిధిలోని గ్రామాలకు చెందిన కొందరు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో సాగునీటి సంఘం అధ్యక్షుడు నర్రా తిరుపతినాయుడి పాత్ర ఉందని వారు ఆరోపించారు. అందిన సమాచారం మేరకు.. చెరుకూరులోని సర్వే నంబర్ 674లో 284 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. అందులో తుమ్మ, చిల్లచెట్లు ఉన్నాయి. వీటిని కొట్టుకునేందుకు అధికారికంగా అటవీ, ఇరిగేషన్ శాఖ అనుమతులతో గ్రామ పంచాయతీ తరఫున బహిరంగ వేలం పాట నిర్వహించి, అధిక ధరకు పాడుకున్న వారికి అనుమతి ఇవ్వాల్సి ఉంది. అయితే ఇక్కడ ఇదేమీ జరగలేదు. తాజాగా చెరువుకు ఏర్పడిన సాగునీటి సంఘం బాధ్యుడు చెరువులోని చెట్లను లోపాయికారీగా దాదాపు రూ.43 లక్షలకు విక్రయించినట్లు తెలుస్తోంది. పంచాయతీకి మాత్రం రూ.11లక్షలు మాత్రమే జమ చేసినట్లు సమాచారం. ఆకలప విలువ రూ.60లక్షలకుపైనే ఉంటుందని అంచనా. దీనిపై చెరువు పరిధిలోని రామన్నపాలెంతోపాటు చెరుకూరు, వెంకుపాలెం గ్రామాలకు చెందిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెరువులో చెట్లు విక్రయించడానికి వెంకుపాలెం గ్రామ పంచాయతీ అనుమతి తీసుకోవాల్సి ఉన్నప్పటికీ అలాంటిదేమీ లేకుండా నీటిసంఘం అధ్యక్షుడు ఏకపక్షంగా అమ్ముకోవడాన్ని ఆక్షేపిస్తున్నారు. ప్రభుత్వ ధనాన్ని అయన స్వాహా చేశారని ఆరోపిస్తున్నారు. దీనిపై చెరువు పరిధిలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన సురేష్ బాబు, దాచర్ల నరసింగరావు కనిగిరి ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. ఈవిషయమై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

శాప్ ఛైర్మన్ రవినాయుడుతో ఎమ్మెల్యే ఏలూరి



శాప్ ఛైర్మన్ రవినాయుడుని కలిసిన ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. బుధవారం మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ రవి నాయుడుతో ఎమ్మెల్యే భేటీ అయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకొని మెరుగైన ఆరోగ్యంతో మెలిగేలా కృషి చేయాలన్నారు. యువత మానసిక ఉల్లాసం కోసం ఏర్పాటు చేసిన ఏలూరి యూత్ ఫిట్‌నెస్ సెంటర్‌ను సందర్శించాలని, క్రీడా వికాస కేంద్రాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో ఇండోర్ స్టేడియంలను పెద్ద ఎత్తున నిర్మించిన ఘనత టీడీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఇసుక దర్శిలో ఏలూరి క్యాంపు కార్యాలయంలో యూత్ ఫిట్‌నెస్ కోసం జిమ్‌లను ఏర్పాటు చేయడంపై రవినాయుడు ఏలూరిని అభినందించారు.

వైసీపీ పాలనతో రాష్ట్రం అస్తవ్యస్తం

ఎమ్మెల్యే కొండయ్య



చీరాలటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తమైందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రమంతా జల్సాలతో, ప్రచారార్భాటాలతో పాలన సాగించి ఆర్థిక విధ్వంసం సృష్టించినట్లు ఆరోపించారు. 10లక్షల కోట్లు అప్పులు చేయగా, ఏడాదికి రూ.71 వేల కోట్లు అసలు వడ్డీ భారంతో అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. ఐదేళ్లూ అధికారం అడ్డం పెట్టుకుని ప్రజలకు తీరని ద్రోహం చేశారని, రూ.1,40,000వేల కోట్లు పెండింగ్ బిల్లులతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారన్నారు. జగన్ జల్సాలకు ప్రజా ధనం రూ.19870 కోట్లు దుర్వినియోగం చేసినట్లు చెప్పారు. సచివాలయాన్ని తాకట్టు పెట్టి అభివృద్ధిని అటకెక్కించినట్లు ఎమ్మెల్యే కొండయ్య ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



జాతీయ రహదారిలో మరమ్మతులు చేయిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ఈపూరుపాలెం(చీరాలటౌన్), జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాలపై పూర్తి స్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్లు ఈపూరుపాలెం ఎస్సై అంబటి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈక్రమంలోనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిలో గుంతలకు మరమ్మతులు చేయించారు. ప్రమాదాల నియంత్రణకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. స్టేషన్ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

పశు పోషణ అభివృద్ధే లక్ష్యం



పశుపోషకులకు మందులను అందజేస్తున్న ఎంపీడీవో సింగయ్య

అద్దంకిటౌన్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): గ్రామాలల్లో పశు పోషను మరింతగా అభివృద్ధి చేసి పాడి పరిశ్రమను పెంచి పోషకులకు ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని, పశు పోషకులందరు వైద్య ఆ రోగ్య శిబిరాలను సద్వినియోగపర్చుకోవాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. బుధవారం మండలంలోని కొంగపాడు, మణికేశ్వరం గ్రామాలల్లో డాక్టర్ యం. సైదయ్య, డాక్టర్ ఇ. ఆశోక్ ఆధ్వర్యంలో పశు ఆ రోగ్య వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కొంగపాడులో జరిగిన పశు ఆ రోగ్య సిబిరాన్ని ఎంపిడీవో పరిశీలించారు. పశుపోషకులతో మాట్లాడారు. అందుతున్న సేవలు, కావాల్సిన సౌకర్యాలను గ్రామ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం పశువైద్యశాఖ వైద్యులు, సిబ్బంది ఎప్పుడు అందుబాటులో ఉంటారని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా పశుపోషకులకు అ వసరమైన మందులను ఎంపిడీవో చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, సహాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేగమే రోడ్డు ప్రమాదాలకు కారణం

ఇంకొల్లు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా డీసీఆర్ఎం కళాశాలలో బుధవారం విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రమణయ్య మాట్లాడుతూ అతివేగం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయన్నారు. ప్రతి ద్విచక్రవాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై సురేష్, కళాశాల డైరెక్టరు చిలుకూరి శ్రీధరరావు పాల్గొన్నారు.

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

» ప్రభుత్వం కొనడం ప్రారంభించడంతో బహిరంగ మార్కెట్ లోనూ పెరిగిన ధర
» తాత్కాలికంగా ఆపడంతో ధరలు తగ్గుతాయని రైతుల్లో ఆందోళన

అద్దంకి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ధాన్యం కొనుగోలును చేపట్టడంతో బహిరంగ మార్కెట్‌లో ధరలు కూడా పెంచారు. అయితే గత వారం రోజులుగా అద్దంకి ప్రాంతంలో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవటంతో బయట మార్కెట్‌లో పెరిగిన ధరలు మరలా తగ్గుతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. బాపట్ల జిల్లాకు కేటాయించిన 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తి అయింది. అదే సమయంలో అద్దంకిలో ధాన్యం కొనుగోలు చేస్తున్న రైస్‌మిల్‌లో కూడా ఇప్పటికే పరిమితికి మించి కొనుగోలు చేయడంతో చేతులెత్తేసినట్లు తెలుస్తుంది. సాగర్ ఆయకట్టు లో అద్దంకి ప్రాంతంలో వరినాట్లు ఆలస్యంగా వేయడంతో ప్రస్తుతం కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సమయంలో కొనుగోలుకు బ్రేక్ పడడంతో రైతులలో అయోమయం నెలకొంది. బహిరంగ మార్కెట్‌లో నెల రోజుల క్రితం ధాన్యం బస్తా 1400 రూపాయలు కాగా, ప్రభుత్వం 1740 రూపాయలు చొప్పున కొనుగోలు చేసింది. దీంతో బహిరంగ మార్కెట్‌లో కూడా ప్రస్తుతం 1700 రూపాయలకు చేరింది. అయితే ప్రస్తుతం ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసే రైస్ మిల్ నిర్వాహకులు కొనుగోలు నిలిపివేయడంతో రైతులు బయట మార్కెట్‌లో అమ్ముకునేందుకు సిద్ధం కావాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిని అసరాగా తీసుకున్న దళారులు ధర లు తగ్గించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తుంది. బయట మార్కెట్‌లో అమ్ముకుంటే చెల్లింపులు ఆలస్యం కావంతో పాటు, నగదు కు గ్యారెంటీ కూడా ఉండే పరిస్థితి లేకపోవడం, గతంలో పలువురు దళారులు ధాన్యం కొనుగోలు చేసి బిసానా ఎత్తివేసిన సందర్భాలు కూడా ఉండటంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు వెంటనే పునః ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.


బల్లికురవ మండలంలో ఇళ్లల్లో నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలు

మిల్లు దగ్గరకు తోలినా పర్మిషన్ రాలేదని కాటా వేయలేదు



ధాన్యం ను 10 రోజుల కిందట అద్దంకిలోని రైస్‌మిల్ వద్దకు తీసుకెళ్లాను. గతంలో ఇచ్చిన టార్కెట్ పూర్తయిందని, మరలా అనుమతులు రాలేదని ధాన్యంను 10 రోజులుగా కాటాలు కూడా వేయలేదు. బయట మార్కెట్‌లో దళారులను నమ్మలేక ప్రభుత్వం అనుమతించిన మిల్‌లోనే అమ్ముకుందామనుకుంటే ఆలస్యం అవుతుంది. వెంటనే కొనుగోలు చేపట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

- బొబ్బాల లక్ష్మీనారాయణ, రైతు, కొమ్మినేనివారిపాలెం, బల్లికురవ మండలం


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న అష్టలక్ష్మి ఆలయం

రేపు అష్టలక్ష్మి ఆలయ ప్రతిష్ఠోత్సవం

» రుత్వికుల నేతృత్వంలో హోమాలు
» ప్రారంభమైన ప్రత్యేక పూజలు

పర్చూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : రూ.4కోట్ల వ్యయంతో కల్యాణ వేంకటేస్వర స్వామి సమేత అష్టలక్ష్మి దేవాలయం పర్చూరులో రూపుదిద్దుకుంటోంది. ఈనెల 31న ఆలయ ప్రతి ష్ఠోత్సవం సందర్భంగా రుత్వికుల నేతృత్వంలో అత్యంత ఘనంగా పూజాకార్యక్రమాలు చేపడుతున్నారు. కార్యక్రమంలో భాగంగా గురువారం విశేష హోమాలు, నిర్వహించారు. స్వామివార్ల ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రతిష్ఠా కార్యక్రమ వేడుకలకు అవధూత దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీతో పాటు దత్త విజయానంద తీర్థ స్వామిజీ హాజరు కానున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు పాబోలు వెంకట సత్యనారాయణ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో గోశాలను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలయ ప్రతిష్ఠా పూజాకార్యక్రమాల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఆలయంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి.


కాకతీయ ఫౌండేషన్ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

కాకతీయ విద్యా ఫౌండేషన్ ద్వారా ఉచిత విద్య

చైర్మన్ సత్యనారాయణ

పంగులూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ ఫౌండేషన్ ద్వారా కమ్మవారిలోని పేద విద్యార్థులకు ఉచిత విద్య, వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు కాకతీయ విద్యా ట్రస్ట్ చైర్మన్ గూడూరి సత్యనారాయణ అన్నారు. పంగులూరు కాకతీయ ఫౌండేషన్ సర్వసభ్య సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ స్థానికంగా 8 నెలల నుంచి కాకతీయ కిచెన్ సెంటర్ నిర్వహించడం అభినందనీయమన్నారు. 2025 - 26 విద్యా సంవత్సరానికి తల్లి లేదా తండ్రి లేని విద్యార్థులతో పాటు పేద విద్యార్థులకు 6,7,8 తరగతులలో చేరి ఉచిత విద్యా వసతి పొందేందుకు అవకాశం ఉందన్నారు. ఉచిత విద్య, భోజన వసతితో పాటు కమ్యూనిటీ కిచెన్, క్రీడలకు ప్రోత్సాహం, ఆరోగ్య శిబిరాల నిర్వహణ లక్ష్యంగా కాకతీయ ఫౌండేషన్ సేవలిందిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతమైన పంగులూరులో నిర్వహిస్తున్న కాకతీయ కిచెన్‌కు దాతలు ఆర్థిక సాయం అందించాలని కోరారు. ట్రస్ట్ నిర్వహణకు భవన వసతి కల్పించి చేయూతనిస్తున్న చిలుకూరి శ్రీధర్, లక్ష్మిని అభినందించారు. కార్యక్రమంలో జగదీష్, పావులూరి బాపయ్య చౌదరి, విశ్రాంత ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ, బండారు రమేష్, ఆర్మీ సైంటిస్ట్ రాయిణి రామారావు, వీరరాఘవయ్య, జాగర్లమూడి సుబ్బారావు, తలపనేని రామాంజనేయులు, రాయిణి సుబ్బారావు, బాచిన ఆంజనేయులు, దేవి, హేమలత పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చేయూత

పంగులూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పాడి పరిశ్రమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేయూత ఇస్తున్నట్లు మాజీ సర్పంచ్, టీడీపీ నేత చక్రవరం శివరాజు అన్నారు. మండలంలోని బైటమంజులూరు గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాన్ని శివరాజు ప్రారంభించారు. మండల పశు వైద్యాధికారి మురళీకృష్ణ తన సిబ్బందితో దూడలు, గొర్రెలకు నట్టల నివారణ మందు తాగించారు. గేదెలకు ఎద పరీక్షలు నిర్వహించి రోగనివారణ మందులు అందచేశారు. కార్యక్రమంలో లక్ష్మణరాజు, ప్రమీలా బాయ్, భాగ్యజ్యోతి, యశోద, పలువురు రైతులు పాల్గొన్నారు.

సంతమాగులూరు : మండలం లోని కొప్పరం గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో గల పశువులు, మేకలు, గొర్రెలుకు టీకాలు వేశారు. పశువులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణి చేశారు. కార్యక్రమం లో పశు వైద్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

డాక్టర్ బాల రాజేశ్వరి

పంగులూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులు వైద్యుల సూచనలు పాటించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ బాలరాజేశ్వరి అన్నారు. ఆసుపత్రిలో బుధవారం గర్భిణులకు ఓజీటీటీ పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, ఆకుకూరలు, కూరగాయలు తినాలన్నారు. బరువులు మోయకుండా స్వల్ప వ్యాయామం చేయాలని, భోజనం అనంతరం రెండు గంటలపాటు నిద్రతో కూడిన విశ్రాంతి అవసరమన్నారు. గర్భంలో ఉన్న బిడ్డకు ఆరోగ్యం కోసం ఐరన్ మాత్రలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో భారతి, హెల్త్ ఎడ్యుకేటర్ అనూరాధ, టెక్నీషియన్ హరిచంద్రన, క్రాంతి, పద్మావతి, రమాదేవి, హరిబాబు, రాజారెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

వైభవంగా కదళీఫలార్చన



అద్దంకి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమవాస్య సందర్భంగా బుధవారం కదళీఫలార్చన పూజ వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామి వారికి నిత్య పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 10వేల అరటిపండ్లతో 11 ఆవృత్తాలుగా వేదపండితులు, పూ జారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

అద్దంకిలో పురందరదాసుల ఆరాధన

అద్దంకి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కన్నడ పద కవితా పితామహుడు పురందరదాసులఆరాధన కార్యక్రమాలను బుధవారం అద్దంకిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న పురందరదాసుల విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు పురందరదాసుల కీర్తనలను గురించి వివరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం దాససాహిత్య ప్రాజెక్టు, శ్రీదాస భారతీయ జానపద కళాక్షేత్రం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాససాహిత్య భజన మండలి ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో పలు సాహితీ సంస్థల ప్రతినిధులు చెన్నుపల్లి నాగేశ్వరరావు, దేవపాలన, నీలంరాజు నాగేశ్వరరావు, జ్యోతి చంద్రమౌళి, చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, చెన్నుపాటి రామాంజనేయులు, గోగుల వీరాంజనేయులు, సుబ్బయ్య, బత్తుల బాబు, జ్యోతి రమేష్, మాదాల దానయ్య, వెంకటాద్రి, పుట్టా వీరాంజనేయులు, రామిశెట్టి రవి, జాష్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


పురందరదాసుల విగ్రహం ముందు సాహితీ సంస్థల ప్రతినిధులు

చురుగ్గా సీసీ రోడ్ల నిర్మాణం

» 34 పనులకు పూర్తయినవి 20
» నాణ్యతలో రాజీ పడొద్దన్న ఎమ్మెల్యే ఏలూరి


హీరో షోరూం పక్కన వీధిలో పూర్తయిన సీసీ రోడ్డు


మార్టూరు నేతాజీనగర్‌లో జరుగుతున్న రోడ్డు పనులు

మార్టూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో సైడు కాల్వలతో పాటు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గత నవంబర్‌లో మండలానికి 34 పనులు నిమిత్తం రూ.5కోట్ల నిధులు మంజూరయ్యాయి. మొత్తం 6.6 కిమీ పొడవుతో సీసీ రోడ్లు, 5.47 కిమీ పొడవుతో కాల్వలు నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని, సిమెంటు రోడ్ల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తిచేయాలని సంబందిత గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులకు ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక సమావేశంలో చెప్పారు. అదేవిధంగా గ్రామాలలో సిమెంటు రోడ్ల నిర్మాణం నాణ్యతా ప్రమాణాలతో ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మండలంలో వేగవంతంగా సీసీ రోడ్ల నిర్మాణంపై నాయకులు, అధికారులు దృష్టి పెట్టారు. దాంతో ఇప్పటివరకు మండలంలో 34 పనులకు 20 పనులు పూర్తయ్యాయని, మిగిలిన 14 పనులు చురుగ్గా జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. మేజరు పంచాయతీ మార్టూరులో 10 పనులకు రూ.కోటి మంజూరు కాగా 9 పనులు పూర్తికాగా, చివరి పని నేతాజీనగర్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణం జరుగుతున్నది. అదేవిధంగా రాజుపాలెం, ఇసుకదర్శి, నాగరాజుపల్లి, ద్రోణాదుల, కోలలపూడి, తాటివారిపాలెం గ్రామాలలో సిమెంట్ రోడ్ల నిర్మాణపనులు పూర్తయ్యాయి. మిగిలిన గ్రామాలలో కూడా ఈ నెలలో పూర్తిగా సిమెంట్ రోడ్ల నిర్మాణాలు పూర్తవుతాయని ఏఈ సుబ్బరాయశాస్త్రి తెలిపారు.


దత్తపాదుకా క్షేత్రంలో పూజలు చేస్తున్న సచ్చిదానందస్వామి

యువతలో పెరుగుతున్న ఆధ్యాత్మిక భావన

సచ్చిదానందస్వామి

అద్దంకి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : యువతలో ఆధ్యాత్మిక భావం పెరుగుతోందని మైసూరు అవధూత దత్త పీఠాధిపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. బుధవారం అద్దంకిలోని దత్తపాదుకా క్షేత్రంలో సచ్చిదానంద స్వామిజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాగసాగరం వినడం ద్వారా భక్తులకు ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. శ్రీ చక్రార్చన, ధన్వంతరీ రాగసాగర కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయానంద తీర్థస్వామి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బోర్లకు మరమ్మతులు

సంతమాగులూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామంలో గ్రామంలో పాడైన బోర్లకు మరమ్మతులు చేయిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ జిర్రా విజయబాబు తెలిపారు. రానున్న వేసవిలో గ్రామంలో తాగునీటికి సస్యలు ఎక్కడా తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో మరమ్మతులు చేయిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.


బొమ్మల సెంటర్‌లో స్వీట్లు పంచిపెడుతున్న తమ్ముళ్లు

బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డ్‌పై హర్షం

పర్చూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి) హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణకు పద్మ భూషణ్ అవార్డు ప్రకటించడం పట్ల తెలుగు తమ్ముళ్లు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక బొమ్మల సెంటర్‌లో మైనార్టీ సెల్ నాయకులు షేక్ సుభానీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మిఠాయిలను అభిమానులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండ్రగంటి శివనాగేశ్వరరావు, బి.సాంబశివరావు, మల్లాది సురేష్, షేక్ గౌస్, షేక్ హుస్సేన్, హుస్సేన్, చందనాల వెంకటేశ్వర్లు, దగ్గుబాడు బాజీ, సుభానీ, అమీన్‌బుడే పాల్గొన్నారు.

సర్పంచ్ పదవికి రాజీనామా చేసిన మహాలక్ష్మమ్మ

బల్లికురవ. జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామ సర్పంచ్ పసుమర్తి మహాలక్ష్మమ్మ అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావుకు లెటర్ అందజేశారు. ఆరు మాసాల నుంచి అనారోగ్య కారణాలతో సర్పంచ్ మహాలక్ష్మమ్మ సెలవు పెట్టారు. దీంతో జిల్లా అధికారులు ఉప సర్పంచ్ ఉప్పుమాగులూరు శాంతికి ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలను అప్పగించారు. మంగళవారం తాను సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తు మహలక్ష్మమ్మ అధికారులకు లేఖ అందజేశారు. గత సర్పంచ్ ఎన్నికల సందర్భంగా టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య జరిగిన ఒప్పందం మేరకే వైసీపీ పార్టీకి చెందిన సర్పంచ్ తన పదవికి రాజీనామా చేసిన్నట్లు సమాచారం.

రసాయన రహిత వ్యవసాయానికి ప్రోత్సాహం

అద్దంకిటౌన్, జనవరి 29 (ఆంధ్ర జ్యోతి) : రసాయన రహిత వ్యవసాయాని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఏడీఏ కే ధనరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మాయపాలెం, రామాయపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు పురుగు మందులు వాడకాన్ని తగ్గించుకోవాని ధనరాజ్ సూచించారు. శనగ, ఇతర పంటలను, గ్రామంలో పురుగు మందులు వాడకుండా సాగు చేస్తున్న పంటలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకట కృష్ణ, వీఏవో కోటేశ్వరరావు, వీఏఏ ఖాజాబి, రైతులు నాగరాజు పాల్గొన్నారు.


చింతగుంపల్లెలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

పంగులూరు : రైతులు రబీలో తాము సాగు చేసిన పంటలను ఈనెల 31లోగా పంట నమోదు చేసుకోవాలని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని రేణింగివరం, కశ్యాపురం గ్రామాలలో బుధవారం పొ లంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలసి సాగులో ఉన్న మొక్కజొన్న, పొగ తోటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది శివాని, ధూళిపాళ్ల శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

మార్టూరు : రబీలో సాగు చేసిన పంటల వివరాలను రైతులు నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి బీ అంజిరెడ్డి రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని బొల్లాపల్లి, తాటివారిపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతుల పొలాలకు వెళ్లి శనగ, మొక్కజొన్నను పరిశీలించారు. శనగకు బెట్ట దశకు వచ్చే అవకాశం ఉందని, తాలు వచ్చే అవకాశం ఉందని అందుకు నివారణ మార్గాలను రైతులకు సూచించారు. అదేవిధంగా మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణా మార్గాలను తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ చైతన్య, వీరవల్లి కృష్ణమూర్తి రైతులు పాల్గొన్నారు.

చినగంజాం : మండలంలోని చింతగుంపల్లెలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు రత్నకుమారి, డాట్ సెంటర్ శాస్త్రవేత్త ఉష శనగ సాగులో ఉన్న పొలాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రత్నకుమారి, ఉష మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రసాయనిక ఎరువుల వాడకాని తగ్గించాలని అన్నారు. శనగపంటలో ఎండు తెగులు పంట మార్పిడి పద్ధతి ద్వారా నివారించవచ్చునని తెలిపారు. రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. గ్రామ సర్పంచ్ యార్లగడ్డ సత్యనారాయణరావు, ఏవో కే.భాస్కరరావు, వీఏఏ సంధ్య, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను సన్మానించిన టీడీపీ నాయకులు


తహసీల్దార్‌ని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

చినగంజాం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావుని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న తహసీల్దార్‌ని టీడీపీ నాయకులు కలిసి సన్మానించి, మిఠాయి తినిపించి, అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు కోకి భాస్కరరెడ్డి, వాటుపల్లి ఏడుకొండలు, దండుప్రోలు తిరుపతిరావు, రేవు నాంచార్లు, కొక్కిలిగడ్డ విష్ణు, కే.రామాంజనేయులు, పలు గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి


డాక్యుమెంట్స్ చూపుతున్న మాజీ కౌన్సిలర్‌లు

చీరాలటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : తమ పొలాన్ని ఆక్రమించేందుకే కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్‌లు శీలం శ్యామ్‌బాబు, పంచుమర్తి సాయి అన్నారు. మండల పరిధిలోని ఈపూరుపాలెంలో వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణాలు ఇప్పటికే జరుగుతున్నాయి. ఈక్రమంలో ఆ సమీపంలో ఉన్న 65 సెంట్ల భూమిపై ఇప్పటికే వీరికి మరో వర్గానికి వివాదం జరుగుతోంది. ఈనేపథ్యంలో రెండు వర్గాలు ఇప్పటికే జిల్లా అధికారులను సంప్రదించి ఫిర్యాదులు చేసుకున్నారు. అలాగే కౌన్సిలర్ స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు స్థానిక అంబేడ్కర్ భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అధికారులు న్యాయపరమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

అద్దంకిటౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో ఫిబ్రవరి మొదటివారంలో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సీహెచ్.గంగయ్య కోరారు. బుధవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో మీడియాతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ ఈ నెల 29 నుంచి పోలవరం ప్రాజెక్టు వద్ద నుంచి ప్రారంభించే జాతాను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు రావులపల్లి కోటేశ్వరరావు, కే. రఘుచంద్, బీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

యువకుడి మృతి

సంతమాగులూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన బండారు ఫణింద్ర మృతి చెందాడు. ఏల్చూరు నుంచి ట్రాక్టర్‌ను తీసుకుని వస్తుండగా, పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం గంటవారిపాలెం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందాడు.

బెల్టు షాప్‌పై దాడులు.. ఒకరి అరెస్ట్

చీరాలటౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని కొత్తపాలెంలో బెల్టు షాప్‌పై ఎక్సైజ్ శాఖ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈక్రమంలో కిషోర్ అనే వ్యక్తి వద్ద 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఘటనపై కేసు నమోదు చేశారు. ప్రభుత్వ విధానాలకు భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు.


పట్టుబడిన వ్యక్తితో ఎక్సైజ్ పోలీసులు





పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం వద్ద అలంకరించిన ఎర్రజెండాలు

ఎరుపెక్కిన సింహపురి

నెల్లూరులో ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో సీపీఎం రాష్ట్ర మహాసభలు జరుగనున్నాయి. ఈ క్రమంలో నగరమంతా ఎరుపు మయమైంది. ఎటు చూసినా సీపీఎం ఎర్రజెండాలు దర్శనమిస్తున్నాయి. కనకమహల్ సెంటర్‌లో ఉన్న కమ్యూనిస్టు ఉద్యమనాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే గాంధీబొమ్మ, వీఆర్‌సీ సెంటర్, ఆర్‌టీసీ, కేవీఆర్ పెట్రోలు బంకు కూడలి తదితర ప్రాంతాల్లో ఎర్రజెండాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే మినీబైపాస్‌రోడ్డులోని పూలేబొమ్మ, ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద కూడా సీపీఎం జెండాలు ఆకర్షణగా నిలిచాయి.

- నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి)

బుచ్చిలో అదృష్ట వంతులెవరో!?

- 3న నగర పంచాయతీ వైస్ చైర్మన్ల ఎంపిక

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీలో రెండు వైస్ చైర్మన్ల ఎంపిక రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేరకు వచ్చే నెల 3వ తేదీన వైస్‌చైర్మన్ల ఎంపిక జరగాల్సి ఉంది. ఈలోపు ఆశావహులు అధినేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 2021, నవంబరు 15న నగర పంచాయతీలో 20 వార్డులకు ఎన్నికలు జరిగాయి. 18 స్థానాల్లో వైసీపీ, రెండింట టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. అదే నెల 21న చైర్‌పర్సన్‌గా మోర్ల సుప్రజ, మిగలిన 19మంది కౌన్సిలర్లతో ప్రమాణస్వీకారం చేశారు. 5వ వార్డు కౌన్సిలర్ ఎస్‌కే. షాహుల్, 19వ వార్డు కౌన్సిలర్ కోటంరెడ్డి లలితలను వైస్ చైర్మన్లుగా ఎంపిక చేశారు. అయితే, గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో వైసీపీలోని చైర్‌పర్సన్‌తోపాటు 9మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ కౌన్సిలర్ల సంఖ్య 11కి చేరడంతో ఇద్దరు వైస్‌చైర్మన్లు రాజీనామా చేశారు. ఈ పదవుల కోసం పలువురు వలస కౌన్సిలర్లలో పోటీ నెలకొంది. నాయకులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో హామీలు కూడా పుచ్చుకున్నట్లు అధికార పార్టీలో చర్చనీయాంశమైంది. కాగా, టీడీపీకి చెందిన తాళ్ల వైష్ణవి, జూగుంట కల్యాణ్‌లు 17, 2వ వార్డుల్లో గెలిపొందారు. ఈ ఇద్దరు కౌన్సిలర్లు కాకుండా మిగతా 9మంది వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వారే. ఏదిఏమైనా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారం ఉన్నవారికే వైస్‌చైర్మన్ల పదవులు దక్కే అవకాశం ఉండటంతో అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది.

వైభవంగా త్రై అమావాస్య

త్రై అమావాస్య సందర్భంగా బుధవారం నగరంలోని వీరరాఘవస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, విశేష అలంకరణ, పూజలు జరిగాయి. జిల్లాతోపాటు పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని శివలింగానికి ఉప్పు, మిరియాలు వేసి అభిషేకం చేశారు. అనంతరం వేమాలశెట్టి బావిలో బెల్లం వేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే తల్పగిరి రంగనాథస్వామి స్వర్ణ గరుడుడిపై భక్తులకు దర్శనం ఇచ్చారు. చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.



వైద్య వీరరాఘవ స్వామి ఆలయంలో ఉప్పు, మిరియాలతో శివలింగాన్ని అభిషేకిస్తున్న భక్తులు


6

శత కీర్తి











నింగిలోకి పయనమవుతున్న రాకెట్ మొదటి దశ - రాకెట్ రెండో దశ - రాకెట్ మూడో దశ - రాకెట్ నుంచి విడిపోయి కక్ష్యలోకి చేరుతున్న నావిక్-02 ఉపగ్రహం

తిరుపతి జిల్లా శ్రీహరికోట నుంచి వందవ రాకెట్ విజయవంతంగా రోదసిలోకి దూసుకుపోవడంతో షార్ ఆనందోత్సాహాల్లో మునిగి తేలుతోంది. ఒకప్పుడు బయటి ప్రపంచాన్ని ఎరుగని ఏనాదులు జీవించే ఒక మారుమూల దీవి, ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షించిన అంతరిక్ష ప్రయోగ కేంద్రంగా మారిన పరిణామాలను ఈ ప్రాంతపు వాసులు గుర్తు చేసుకుంటున్నారు. తొలి రోజుల్లో షార్ అభివృద్ధిలో భాగం అయిన శాస్త్రవేత్తలు, ఇతర ఉద్యోగులు వందో విజయ సందర్భంలో సంబరపడుతున్నారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్ నుంచి బుధవారం ఉదయం 6.23 గంటలకు తెలిమంచు తెరలను చీల్చుకుంటూ జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ అంతరిక్షంలోకి దూసుకుపోయింది. ఈ దృశ్యాన్ని ఈ ప్రాంత ప్రజలంతా ఇళ్ల బయటకు వచ్చి ఆనందంతో వీక్షించారు. పొగ చారలు ఆకాశంలో మిగిల్చి అంతరిక్షంలోకి నావిగేషన్ ఉపగ్రహం నావిక్-02 ను విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి వందవ రాకెట్ చేర్చడంతో షార్ శాస్త్రవేత్తలు ఆలింగనాలూ, కరచాలనాలతో అభినందలు తెలుపుకున్నారు. ఈ విజయం షార్ భవిష్యత్తుకు కూడా కీలకం కానుంది. మూడవ లాంచ్ ప్యాడ్ నిర్మాణ నిర్ణయంతో, గత కొన్నేళ్లుగా స్తబ్దుగా మారిన శ్రీహరికోటలో మళ్లీ సందడి నెలకొననుంది. జీఎస్ఎల్వీ-ఎఫ్ 15 రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి ఐదువేల మందిదాగా బుధవారం శ్రీహరికోటకు తరలివచ్చారు. మంచు కురుస్తున్నా చలిని సైతం లెక్కచేయకుండా గ్యాలరీలో కూర్చున్నారు. వీరిలో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నారు. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోట వరకు వాహనాలు తెల్లవారుజామునుంచే బారులు తీరాయి. రాకెట్ నింగికి ఎగురుతున్న సమయంలో చప్పట్లు, ఈలలు, కేరింతలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది.

విద్యార్థులతో కలిసి వీక్షించిన కలెక్టర్

సూళ్లూరుపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాకెట్ ప్రయోగాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ దంపతులు, ఆర్డీవో కిరణ్మయి మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి వీక్షించారు. సైన్సు ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచిన సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.హిమ, అన్విని లకు కూడా కలెక్టర్‌తో పాటు మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ ప్రయోగాన్ని వీక్షించే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. సూళ్లూరుపేట పట్టణంలో ఉన్న 500 మంది విద్యార్థులకు రాకెట్ ప్రయోగాన్ని విజిటర్స్ గ్యాలరీ నుంచి వీక్షించే అవకాశం కల్పించారు.



మిషన కంట్రోలర్ సెంటర్‌లో ఇస్రో చైర్మన్ నారాయణన్, షార్ డైరెక్టర్ రాజరాజన్‌తో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, పక్కనే ఆర్డీవో కిరణ్మయి, విద్యార్థులు



రాకెట్ ప్రయోగాన్ని వీక్షిస్తున్న ఇస్రో మాజీ చైర్మన్లు



మంచు తెరలు చీల్చుకుంటూ.. నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లిన వందో రాకెట్

రాకెట్ వీక్షణకు మాజీ ఇస్రో చైర్మన్‌లు..

షార్ వేదికగా జరిగిన వందో రాకెట్ ప్రయోగ వీక్షణకు ఇస్రో మాజీ చైర్మన్లు డాక్టర్ ఎస్.సోమనాథ్, డాక్టర్ కె.రాధాకృష్ణ, శివన్, ఏఎస్.కిరణ్ కుమార్ శ్రీహరికోటకు వచ్చారు. వీరితో పాటు పలువురు శాస్త్రవేత్తలు కూడా విచ్చేసి మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ ప్రయోగాన్ని తిలకించారు. వందో ప్రయోగం విజయవంతమైనట్లు ఇస్రో చైర్మన్ ప్రకటించగానే ఆనందోత్సాహాలు ప్రకటించారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- డీఆర్వో ఉదయభాస్కర్‌రావు

నెల్లూరు (విద్య), జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేసి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) ఉదయభాస్కర్‌రావు అన్నారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జరిగిన సమన్వయ సమావేశంలో డీఆర్వో మాట్లాడారు. ఫిబ్రవరి 5 నుంచి ఇంటర్ ఒకేషనల్, 10వ తేదీ నుంచి ఇంటర్ జనరల్ ప్రాక్టికల్స్ జరుగుతాయన్నారు. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో అధికారులు సర్వం సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. జిల్లా కంట్రోల్ రూమ్ నుంచిపటిష్ట భద్రత నడుమ ప్రశ్నపత్రాలను పరీక్ష కేంద్రాలకు తరలించాలని సూచించారు. ప్రతి కేంద్రంలో కుర్చీలు, ఫ్యాన్స్, మంచినీరు వంటి మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఆర్టీసీ అధికారులు అవసరమైన ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆర్ఐఓ ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే 141 సెంటర్లలో ఇంటర్ ప్రాక్టికల్స్, 79 సెంటర్లలో సాధారణ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ప్రాక్టికల్స్‌కు 25,782 మంది, ప్రధాన పరీక్షలకు 54,200 మంది విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. సమస్యలు, సందేహాల నివృత్తికి 0861-2320312 ఫోన్ నెంబర్‌ను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈ సమావేశంలో మునిసిపల్ అదనపు కమిషనర్ ఒ.నందన్, డీఎంహెచ్‌వో సుజాత, డీఈఓ బాలాజీరావు, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్, డీవీఈఓ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

కాగా, ఇంటర్ పరీక్షల నిర్వహణపై ఆర్ఐవో ఆదూరు శ్రీనివాసులు కేఏసీ కళాశాలలో జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా అన్ని కళాశాలలకు పరీక్ష సామగ్రి అందచేశారు. ఈ కార్యక్రమంలో డీవీఈఓ మధుబాబు, డీఈసీ సభ్యులు దీనదయాళ్, వేణుగోపాల్, కొండయ్య, శ్రీనివాస రావు, రాజారెడ్డి, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ పుంజుకునేనా!?

- 2023తో పోలిస్తే భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్లు
- 65.58 శాతం మించని లక్ష్యం
- ఎన్నికల ప్రభావమంటున్న ఆర్థిక నిపుణులు
- 2024, డిసెంబరులో ఆశాజనకంగా అమ్మకాలు
- అదే ఊపు కొనసాగుతుందని ఆశాభావం

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : కీలకమైన రియల్ ఎస్టేట్ రంగం గతేడాది ఒడిదుడుకులు ఎదుర్కొంది. అంచనాలకు తగ్గట్లుగా క్రయ, విక్రయాలు జరగలేదు. రిజిస్ట్రేషన్ శాఖ వివరాలను చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. ఎన్నికల ఏడాది కావడంతోనే ఈ పరిస్థితి ఉన్నట్లు ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ఎప్పుడూ ఎన్నికల ఏడాదిలో రియల్ ఎస్టేట్ రంగం స్తబ్దుగా ఉంటుందని గుర్తు చేస్తున్నారు. మనీ ఫ్లో అనేది ప్రభుత్వ పాలసీల మీద ఆధారపడి ఉంటుంది కాబట్టి కొత్త ప్రభుత్వ నిర్ణయాల మేరకు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మార్పులు కనిపిస్తాయని విశ్లేషిస్తున్నారు. 2023లో ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు రూ.485.57 కోట్లు రెవెన్యూ వసూళ్ల రిజిస్ట్రేషన్ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే 82,045 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లతో రూ.362.49 కోట్లు వసూలు చేసి 74.65 శాతం లక్ష్యాన్ని చేరుకుంది. అదే 2024లో ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు రూ.516.47 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే 71,757 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లతో రూ.338.68 కోట్లు వసూలు చేసి 65.58 శాతం లక్ష్యాన్ని చేరుకుంది. అంటే ఎన్నికల ఏడాదిలో తొమ్మిది శాతం మేర రిజిస్ట్రేషన్లు తగ్గాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు నాటికి 9.02 శాతం గ్రోత్ రేటు నమోదవగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు నాటికి - 6.57 శాతానికి గ్రోత్‌రేటు తగ్గడం గమనార్హం. అయితే అనూహ్యంగా 2024, డిసెంబరులో రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది. అంతకముందు నెలలతో పోలిస్తే ఈ నెలలో భారీగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. గతేడాది మొత్తం సరాసరి 6.57 శాతం గ్రోత్ రేటు తక్కువగా నమోదైతే డిసెంబరులో మాత్రం 12.86 శాతం పెరగడం విశేషం. 2023, డిసెంబరుతో పోలిస్తే 2024 డిసెంబరులో పది శాతం ఎక్కువగా పురోగతి కనిపించింది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపార వర్గాల నుంచి ఆనందం వ్యక్తమవుతోంది. ఇదే ఊపు రానున్న రోజుల్లో కూడా కొనసాగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలి ఆరు నెలలు రియల్ ఎస్టేట్ రంగం నెమ్మదిగా కదిలింది. అయితే ఇప్పుడు ప్రభుత్వం కుదురుకోవడం, కొత్త పాలసీలు ప్రారంభమవడంతో వాటికి ప్రజలు అలవాటుపడుతున్నారు. దీంతో భూమిపై పెట్టుబడులు పెట్టేందుకు కొనుగోలుదారులు ముందుకొస్తున్నారని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. రానున్న రెండు, మూడు నెలలు కూడా ఇదే విధంగా రియల్ ఎస్టేట్ పుంజుకుంటే ఆ తర్వాత కొత్త లేఅవుట్లు ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే స్థలాలకు ఉన్న డిమాండ్ అపార్ట్‌మెంట్లలో ప్లాట్లకు, గృహాలకు ఉండడం లేదని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. గత నెలలో జరిగిన రిజిస్ట్రేషన్లలో కూడా ఎక్కువగా స్థలాలే ఉన్నాయని రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు చెబుతుండడం గమనార్హం.

- సర్వేపై కేంద్ర బృందం ఆరా

కుష్ఠును ఎలా గుర్తిస్తున్నారు!?



మనుబోలు : పిడూరులో కుష్ఠు వ్యాధి సర్వేపై ఆరా తీస్తున్న కేంద్ర బృంద అధికారులు రంగనాథ్, అక్షర్ పురోహిత్

నెల్లూరు (వైద్యం)/ మనుబోలు/కొడవలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న కుష్ఠు వ్యాధి సర్వేపై బుధవారం కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ బృందం ఆరా తీసింది. జిల్లాలోని కొడవలూరు, మనుబోలు పీహెచ్‌సీలతోపాటు నగరంలోని జీజీహెచ్‌లో ఉన్న కుష్ఠు వ్యాధి విభాగాన్ని న్యూఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు రంగనాథ్, అక్షర్ పురోహిత్ జిల్లా వైద్యాధికారులతో కలిసి పరిశీలించారు. ఆసుపత్రులలో రికార్డులు పరిశీలించి, బాధితులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అలాగే, ఎల్‌సీడీసీ సర్వే తీరును క్షేత్రపరిశీలన చేసి ఆశాలను, ఏఎన్‌ఎంల నుంచి సర్వే విధానంపై ప్రశ్నించారు. ఈ సందర్భంగా డాక్టర్ రంగనాథ్ మాట్లాడుతూ ముందుగా వ్యాధిని గుర్తించడం, ముందుగానే మందులు అందించి నివారించడం అనే నినాదంతో కేంద్రం పని చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో కుష్ఠువ్యాధికి సంబంధించి 132 కేసులు ఉన్నాయని, ఈ సంఖ్య ఇంకా తగ్గాలని అన్నారు. వ్యాధిరాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. వారివెంట జిల్లా అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలీ, రాష్ట్ర ఎన్ఎల్ఈపీ అధికారి జావీద్, ప్రియదర్శిని, జోనల్ కో-ఆర్డినేటర్ సతీష్, జిల్లా లెప్రసీ నివారణ అధికారి సురేంద్రబాబు, పీహెచ్‌సీ వైద్యులు తదితరులు ఉన్నారు.



గంగాభవానికి పుష్పగుచ్ఛం అందచేస్తున్న అర్బన్ సీడీపీవో లక్ష్మీదేవి, తదితరులు

ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీగా గంగాభవాని

నెల్లూరు (హరనాథపురం) (ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీగా గంగాభవాని నియమితుల య్యారు. బుధవారం ఆమె ఐసీడీఎస్ కార్యాలయంలో బా ధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న పీడీ సుజాత సెలవుపై వెళ్లడంతో గంగాభవానిని ఇన్‌చార్జిగా నియ మించారు. ఆమెకు అర్బన్ సీడీపీవో లక్ష్మీదేవి, ఐసీడీఎస్ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ రాక

నెల్లూరు(హరనాథపురం), జనవరి 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనార్టీశాఖమంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ గురువారం రాత్రి 8గంటలకు నెల్లూరుకి చేరుకుంటారని ఐఅండ్‌పీఆర్ డీడీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి 9గంటలకు నెల్లూరు, ప్రకాశం జిల్లాల మైనార్టీ సంక్షేమాధికారులతో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు టీడీపీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. మధ్యాహ్నం 1.30 నుంచి మూడు గంటల వరకు కలెక్టరేట్‌లో ఎస్పీ, జేసీలతో సమీక్ష నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు.



వైద్య వీరరాఘవ స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

వైభవంగా చైత్ర అమావాస్య

● బారులు తీరిన భక్తులు



వేమాలశెట్టి బావిలో బెల్లం వేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

రోగ నివారణ, ఆరోగ్య, సుఖశాంతులు ప్రసాదించే వైద్య వీరరాఘవ స్వామిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. చైత్ర అమావాస్య సందర్భంగా నగరంలోని రామ్‌నగర్‌లోని వైద్య వీరరాఘవ స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని శివలింగానికి ఉప్పు, మిరియాలు వేసి అభిషేకం చేశారు. అనంతరం వేమాలశెట్టి బావిలో బెల్లం వేసి మొక్కులు తీర్చుకున్నారు. కాగా, వీఐపీ పాసుల ప్రవేశం వద్ద విపరీతమైన రద్దీ నెలకొంది. పోలీసులు ఉన్న తాధికా రుల సేవలో తరించడంతో సామాన్య ప్రజానీకం ఇబ్బందులు పడింది. టికెట్ల క్యూలైన్లలోనే దర్శ నం 2గంటలు పట్టిందని, పోలీ సులు పర్యవేక్షించి ఉంటే త్వరగా దర్శనం అయ్యేదని భక్తులు విచారం వ్యక్తం చేశారు. జనసేన నాయకులు గును కుల కిషోర్, బీజేపీ నాయకులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం

డిప్యుటేషన్లపై కొరడా

- రద్దు చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ ఆదేశాలు
- అయినా కొనసాగుతున్న కొందరు అధికారులు, సిబ్బంది
- యథావిధిగా వేతనాలు ఇస్తున్నారని విమర్శలు
- తాజాగా విభాగాల మార్పు

నెల్లూరు (వైద్యం), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో డిప్యుటేషన్లపై డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత కొరడా ఝుళిపించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది డిప్యుటేషన్లు రద్దు చేస్తూ వారిని హడలెత్తిస్తున్నారు. అయితే డీఎంహెచ్‌వోపై కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా ఒత్తిడి తెలుస్తున్నట్లు తెలుస్తోంది. వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి అనుమతితోనే డిప్యుటేషన్లు రద్దు చేస్తున్నామని డీఎంహెచ్‌వో చెబుతున్నారు. దీంతో ఉద్యోగ వర్గాల్లో ఆందోళన మొదలైంది.

● 15 మంది బదిలీ

తాజాగా 15 మందిని వివిధ విభాగాలకు బదిలీ చేశారు. ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం సూపరింటెండెంట్‌గా రషీద్‌ను నియమించారు. కాగా ఒంగోలు నుంచి ఇక్కడకు డిప్యుటేషన్‌పై వచ్చిన సూపరింటెండెంట్ పరిస్థితి ఏమిటో తెలియని పరిస్థితి ఉంది. అకౌంట్ విభాగంలో సూపరింటెండెంట్‌గా విజయకుమారిని నియమించారు. వైద్యులు, ఉద్యోగులకు సంబంధించి ఎఫ్‌ఆర్‌ఎస్‌కు సర్వీస్ ఇంజనీర్‌ను నియమించారు. ఆయనకు అసిస్టెంట్‌గా సపోర్టింగ్ ఇంజనీర్‌ను నియమించారు. వీరితోపాటు మరో 11 మందిని వివిధ విభాగాలకు బదిలీ చేశారు. ఈ క్రమంలో ఎస్టాబ్లిస్‌మెంట్ సూపరింటెండెంట్‌గా ఒంగోలు నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన వెంకటేశ్వరరావు వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి కలిసినట్లు తెలిసింది. దీంతో డీఎంహెచ్‌వోకి డైరెక్టర్ ఫోన్ చేసి ఎస్టాబ్లిస్‌మెంట్ సూపరిండెంట్‌గా ఆయన్నే కొనసాగించాలని ఆదేశించినట్లు సమాచారం. అయితే ఇందుకు సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు అందలేదని వైద్యాధికారులు చెబుతున్నారు. అత్యవసర పరిస్థితిలో ఉన్నతాధికారుల ఆదేశాలతోతప్ప అధికారులు, సిబ్బంది డిప్యుటేషన్‌లు రద్దు చేయవద్దని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు నుంచి బుధవారం ఉత్తర్వులు వచ్చాయి.

● రద్దు చేసినా అక్కడే...

వైద్య ఆరోగ్యశాఖలో గతంలో డిప్యుటేషన్లు రద్దు చేసిన 15 మందిలో 8 మంది జిల్లా కార్యాలయంలోనే కొనసాగుతున్నారు. వీరికి నెలవారీ వేతనాలు, ఎఫ్‌ఆర్‌ఎస్ ఎవరు ఇచ్చారన్న విమర్శలు లేకపోలేదు. డిప్యుటేషన్‌లు రద్దు చేసిన వారు పీహెచ్‌సీలకు పోవాలి. అక్కడ వైద్యాధికారులే నెలవారీ వేతనాలు పెట్టాలి. ఇందుకు విరుద్ధంగా వారికి వేతనాలు ఎలా వస్తున్నాయే అర్థం కావటం లేదని కొందరు ఉద్యోగులు చెబుతున్నారు. ఫైలేరియా విభాగంలో ఇద్దరు హెల్త్ అసిస్టెంట్ల డిప్యుటేషన్లను గత డిసెంబరు 26న రద్దు చేశారు. క్షయ విభాగంలో అల్లీపురం నుంచి హెల్త్ సూపర్‌వైజర్ డిప్యుటేషన్‌పై ఉన్నారు. డీఐవో సెక్షన్‌లో సౌత్‌మోపూరు పీహెచ్‌సీకి చెందిన హెల్త్ ఎడ్యుకేటర్ ఉన్నారు. ఇస్కపాళెం నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన హెల్త్ అసిస్టెంట్ ఉన్నారు. అలాగే డెమో సెక్షన్‌లో కసుమూరు నుంచి వచ్చిన హెల్త్ ఎడ్యుకేటర్ ఉన్నారు. ఎస్‌వో విభాగంలో హెల్త్ అసిస్టెంట్, అలాగే ఎస్‌వో విభాగంలో ఇద్దరు డీఈవోలు ఉన్నారు. చిరమన పీహెచ్‌సీ నుంచి ఫార్మాసిస్ట్, మరో హెల్త్ అసిస్టెంట్ కూడా జిల్లా కార్యాలయంలోనే కొనసాగుతున్నారు.

డైరెక్టర్ అనుమతితోనే ఉత్తర్వులు



వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి ఆదేశాలతోనే డిప్యుటేషన్లు రద్దు చేశాం. రద్దు చేసిన వారు వారికి కేటాయించిన ఆరోగ్య కేంద్రాలలోనే వైద్య సేవలు అందించాలి. అయినా కొందరు జిల్లా కార్యాలయంలోనే కొనసాగుతుం డటం నా దృష్టికి రాలేదు. అలాంటి వారికి గుర్తించి వెంటనే వెళ్లాలని ఆదేశాలిస్తున్నాం.

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత





మినీ బైపాస్.. బడా బిజినెస్!

- వెలుస్తున్న బంగారు, వస్త్ర షోరూంలు
- మొబైళ్లు, ఎలక్ట్రానిక్ దుకాణాలూ ఎక్కువే
- చిరుతిండ్ల నుంచి భారీ హోటళ్లూ అందుబాటులోకి..
- నిత్యం రద్దీగా మారుతోన్న రహదారి

విశాలమైన రోడ్డు.. ఒకవైపు నివాసాలు.. మరోవైపు కాలువ.. రోడ్డు వెంబడి వ్యర్థాలు, చెత్తా చెదారం.. రైళ్ల కూత తప్ప జనాల తాకిడి పెద్దగాలేని నిశ్శబ్ద ప్రాంతం.. ఇదంతా ఒకప్పుడు..

నేడు.. అదో వ్యాపార కేంద్రం.. కూరగాయలు, పండ్లు, చిరుతిండి, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు వంటి చిరు వ్యాపారాలతోపాటు పేరెన్నికగల బంగారం, వస్త్ర, మొబైళ్ల దుకాణాలు, ఫ్యాషన్ వేర్స్, ఫ్యామిలీ దాబాలు, జాతీయస్థాయి హోటళ్లు విచ్చలవిడిగా వెలిశాయి. ఐదారేళ్ల క్రితం వరకూ పెద్దగా సందడిలేని నెల్లూరులోని మినీబైపాస్ రోడ్డు ప్రాంతం ఇప్పుడు నిత్యం జనం, వాహన రాకపోకలతో కిక్కిరిసిపోతోంది.

నెల్లూరు నగరంలో ట్రంకురోడ్డుకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. పేద, మధ్యతరగతితోపాటు ఉన్నతస్థాయి వర్గాలకు అవసరమైన అన్ని రకాల వస్తువులు అందుబాటులో ఉండే ప్రాంతం. మహిళలకు, పిల్లలకు, యువతకు అవసరమైన వస్త్రాలు, బంగారు ఆభరణాలు, మొబైళ్లు, ఎలక్ట్రానిక్ సామగ్రి ఇలా ఏ వస్తువు కావాలన్నా ట్రంకురోడ్డుకు చేరుకోవాల్సిందే. అంతేగాక ఆహారప్రియులు మంచి భోజన కేంద్రాలు ఉన్నాయి. అయితే, ఇప్పుడు ఈ వ్యాపారమంతా నెల్లూరు మినీబైపాస్ బాట పట్టింది. పెద్ద పెద్ద వాణిజ్య సముదాయాలు వెలిశాయి. జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లకు చెందిన షోరూములూ అందుబాటులోకి వచ్చాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజలకు అవసరమైన అన్ని రకాల వస్తువులు మినీబైపాస్‌లోనే దొరుకుతున్నాయి. అంతేకాదండోయ్.. భోజన ప్రియుల కోసం రోడ్డు పొడవునా పాయ, దోశ, పుల్కాలతోపాటు పానీపూరి వంటి చిరుతిండ్ల నుంచి దాబాలు, రెస్టారెంట్లు, కేఎఫ్‌సీ, డామినోస్ వంటి బ్రాండెడ్ కంపెనీలు తమ కేంద్రాలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాయి. ట్రంకురోడ్డులో షాపింగ్ చేయాలంటే ట్రాఫిక్ ఇబ్బందులు ఉండటంతో అత్యధిక శాతంమంది మినీబైపాస్‌నే ఎన్నుకుంటున్నారు.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)



జంతు సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏహెచ్ జేడీ రమేష్‌నాయక్ తదితరులు


జంతువుల సంరక్షణ అందరి బాధ్యత

● పశుసంవర్ధక శాఖ జేడీ రమేష్ నాయక్

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 29(ఆంధ్రజ్యోతి): జంతువుల సంరక్షణ అందరి బాధ్యత అని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ నాయక్ పేర్కొన్నారు. ఈనెల 14 నుంచి 30వరకు పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో గల చైతన్య భారతి పాఠశాల్లో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధికుక్కలపై మానవత్వంతో మెలగాలని, జంతువుల సంక్షేమం సామాజిక బాధ్యతని తెలిపారు. జంతు సంరక్షణకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సహకరించాలన్నారు. జంతువులకు హానికలిగిస్తే జరిమానాలతోపాటు శిక్షలు విధించేలా చట్టాలు రూపొందించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జంతు సంరక్షణ, జంతువుల నుంచి మానవులకు సంక్రమించే వ్యాధులపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇంటిగ్రేటెడ్ షీప్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఏడీ మాధవీలత, ఫౌండేషన్ ఫర్ ఎనిమల్స్ సభ్యురాలు ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌పై విచారణకు ప్రభుత్వం ఆదేశం

నెల్లూరు (వైద్యం) జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న నగరంలోని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్‌పై విచారణకు ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ మంజుల బుధవారం ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆ ఆదేశాలకు సంబంధించి వివరాలు తెలియాల్సి ఉంది. పలు సమావేశాల్లోనూ కలెక్టర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటనలు ఉన్నాయి. ఇటీవల నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలోనూ కలెక్టర్ ఆనంద్ సూపరింటెండెంట్ వ్యవహార శైలిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సెలవుపై వెళ్లాలని ఆదేశించారు.



మహాత్ముడి మాటలు నేటికీ ఆచరణీయమే!

● నేటి సామాజిక సమస్యలకు అవే పరిష్కారం ● నేడు జాతిపిత గాంధీజీ వర్ధంతి

ఆత్మకూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : సత్యం, అహింస, శాంతి, పరమతసహనం.. అనేవి జాతిపిత గాంధీజీ ప్రపంచానికి ఆచరణాత్మకంగా చాటిచెప్పిన సిద్ధాంతాలు. కానీ నేటి సమాజం వీటిని ఏ మేరకు ఆచరిస్తుందో ప్రశ్నించుకుంటే శూన్యమేనని సమాధానమవుతుంది. సత్యం లోపించి అధర్మమే రాజ్యమేలుతుంది. అవినీతి, అక్రమాలు పెచ్చుమీరాయి. అహింసకు బదులు హింస తాండవిస్తుంది. ఇక సమాజంలో శాంతి, పరమతసహనం కూడా అడుగంటుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. మరువని మహామనిషి మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ... ఆయనే మన జాతి పిత.. తరాలు మారినా మరువలేని మహామనిషి గాంధీజీ. ఆయన పేరులోనే గాంభీర్యం, మాధుర్యం, మానవత్వం, సత్యం కనిపిస్తాయి. అందుకే నిత్య జీవనంలో గాంధీజీ ఆదర్శాలు మన సమాజంలో వేళ్లానుకున్నాయి. ఆయన అనుసరించిన మార్గాలు, పాటించిన ఆశయాలు నాటి నుంచి నేటితరం వరకు ప్రపంచానికే ఆదర్శప్రాయం. అందుకే దేశంలో ప్రతి ఒక్కరూ గాంధీజీ గౌరవిస్తూ మరచిపోలేని మహనీయుడిగా గుర్తెరిగి ప్రతి ఏడాది గాంధీ జయంతి, వర్ధంతులను జరుపుకుంటారు.

● అహింస

గాంధీజీ హింసతో ఏదీ సాధ్యం కాదన్నారు. అహింసే ఆయుధంగా మనకు స్వాతంత్ర్యం సాధించారు. ఆంగ్లీయులపై అహింసమార్గంలో పోరాటం చేశారు. అందుకే గాంధీజీ అహింసావాదిగా పేరొందారు.

● అవినీతి

ప్రజల వ్యక్తిగత ప్రయోజనాల కన్నా సామాజిక శ్రేయస్సుకు ప్రాధాన్యమివ్వడంతో పాటు అవినీతిరహిత సమాజాన్ని గాంధీ కోరుకున్నారు. కానీ సత్యం లోపించి అధర్మమే రాజ్యమేలుతోంది. అవినీతి, అక్రమాలు పేట్రేగుతున్నాయి. జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు సైతం అవినీతి కేంద్రాలుగా మారాయి. అవినీతిరహిత సమాజం కోసం సాగాల్సిన కృషి ఎంతో ఉంది.

● పల్లె ప్రగతి

దేశానికి పల్లెసీమలే పట్టుగొమ్మలు. దేశ ప్రగతి... పల్లెసీమల అభివృద్ధిపైనే ఆధారపడి ఉందని గాంధీజీ సూచించారు. అయితే జిల్లాలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కొరవడ్డాయి. తాగు, సాగునీటితో పాటు విద్య, వైద్యం, రహదారులు, పారిశుధ్యం, తదితర సమస్యలు తాండవిస్తున్నాయి. గ్రామాలకు గ్రామాలే ఖాళీ అయ్యి ప్రజలు పట్టణాల బాట పడుతున్నారు.

● అంటరానితనం

బాపూజీ అంటరానితనాన్ని అమానుషమన్నారు. కానీ స్వాతంత్ర్యం వచ్చి అర్ధశతాబ్దం దాటినా జిల్లాలోని పలు గ్రామాల్లో ఏదోక రూపంలో అంటరానితనం, అస్పృశ్యత కొనసాగుతూనే ఉంది.

● మద్యపాన నిషేధం

సమాజానికి మద్యాన్ని దూరంగా ఉంచాలని గాంధీజీ పిలుపునిచ్చారు. మద్యం నిషేధం కోసం ఆయన పోరాటం సాగించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వాలే మద్యంపై ఆదాయం కోసం అర్రులుచాస్తున్నాయి. ఊరూర బెల్టుషాపుల్లో మద్యం అమ్మకాలు జరుగుతుండడం గమనార్హం.

● స్వదేశీ వస్తు వినియోగం

గాంధీజీ స్వయంగా నూలు వడికేవారు. ఖద్దరు వస్త్రాలను ఎక్కువగా ధరించేవారు. దేశీయ చేనేత దుస్తులను వాడాలని పిలుపునిచ్చారు. కానీ నేటి యువత విదేశీ దుస్తులు, వస్తువుల మోజులో కొట్టుమిట్టాడుతున్నారు. దానివలన ఆర్థికమాన్యం ఏర్పడి రూపాయి విలువ పడిపోతుంది. గాంధీజీ చెప్పినట్లు స్వదేశీ వస్తు వినియోగం చేస్తే.. రూపాయి విలువ పెరుగుతుంది. యువత గాంధీజీలా నిరాడంబరంగా జీవించాలి.

మహాత్ముడి ఆశయాలు ఎంతో ఆదర్శం



గాంధీజీ ఆశయాలు ఎంతో ఆదర్శమైనవి. ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి ఆయన బోధనలు, ఆచరించిన మార్గాలు ఎంతో అవసరం. సమాజాన్ని బాగుపరచాలంటే గాంధీయవాదమే ఆయుధం. జయంతి, వర్ధంతుల సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించడం కాదు, ఆయన ఆశయ సాధనకు కృషి చేసినప్పుడే అసలైన నివాళి.

- సీ గంగాప్రసాద్, మున్సిపల్ కమిషనర్, ఆత్మకూరు

గాంధీజీ ఆశయసాధనకు పాటుపడాలి

నేటితరం గాంధీజీ ఆశయ సాధనే లక్ష్యంగా నడుంకట్టాలి. ఆయన అనుసరించిన మార్గాలు, పాటించిన ఆశయాలు నాటి నుంచి నేటి తరం వరకు ప్రపంచానికే ఆదర్శప్రాయమనే విషయాన్ని యువత గుర్తించాలి. ఆయన ఆశయాలను సైతం అందిపుచ్చుకునేదిశగా అడుగులు వేయాలి.

- జీ పావని, ఆర్డీవో, ఆత్మకూరు





సభలో మాట్లాడుతున్న తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

కార్మిక వ్యతిరేక చర్యలను ఎదుర్కోవాలి

● తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

నెల్లూరు (వైద్యం), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దేశంలో పారిశ్రామికవేత్తల కార్మికవ్యతిరేక చర్య లను కమ్యూనిస్టులు తమ పోరాటాల ద్వారా ఎదుర్కోవాలని తెలంగాణ ఎమ్మెల్సీ, ప్రజా వాగ్గేయకారుడు గోరటి వెంకన్న పిలుపు నిచ్చారు. నెల్లూరులోని రుద్రరాజు సత్యనారాయణ కళాప్రాంగణంలో బుధవారం సింహపురి సాంస్కృతిక కార్యక్రమాలు ముగిశాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా తెలంగాణను సాధించుకున్నామన్నారు. తెలంగాణ ఉద్యమంలో కమ్యూనిస్టులు ఎంతోమంది మరణించారన్నారు. కమ్యూనిస్టులు హింసావాదులు కాదన్నారు. కమ్యూనిస్టుల త్యాగాలను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన తెలిపారు.

తెలంగాణ పోరాటంలో అసువుల బాసిన వారిపై పాటపాడుతూ అందరిని ఆకట్టుకున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆత్మకూరు డివిజన్ కళాకారుల ఏకలవ్య రూపకం, శాస్త్రీయనృత్యాలు, సుందరయ్య కాలనీ సెట్యూట్ సుందరయ్య, డప్పుల విన్యాసం, చిట్టిబాబు డాన్స్ ఈవెంట్స్ , సుందరయ్య నగర్ కళాకారుల చిన్నారి మల్లి, వీరతెలంగాణ నాటిక, తిరుపతి కళాకారుల బడిగంటలు, పద్యనాటికం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో సీనియర్ రంగస్థల నటి రేబాల లక్ష్మి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేశ్వరరావు , ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్, మంగల పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల విషయంలో రాజీపడేది లేదు

● ఎమ్మెల్యే ఇంటూరి



సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

కందుకూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల విషయంలో ఎట్టిపరిస్థితుల్లో రాజీపడేది లేదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని 43 ప్రాంతాల్లో రూ.10లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. వ్యాపార కేంద్రాలు, ముఖ్యమైన మార్గాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయించామన్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యే దాతలను సత్కరించారు. కార్యక్రమంలో సీఐలు వెంకటేశ్వరరావు, మంగారావు, పట్టణ ఎస్‌ఐ సాంబశివరావు, పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య పాల్గొన్నారు.

పెట్రోలు బంకు ఏర్పాటు అనుమతిని రద్దు చేయాలి

● రెవెన్యూ మంత్రికి మాజీ ఎమ్మెల్యే దివి శివరాం వినతి



మంత్రి సత్యప్రసాద్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

కందుకూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కార్యాలయాల ఆవరణలో పెట్రోలు బంకు ఏర్పాటుకు ఇచ్చిన అనుమతిని తక్షణం రద్దుచేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే దివి శివరాం బుధవారం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిశారు. వెలుగు, ఐసీడీఎస్ కార్యాలయాలు, మహిళాబ్యాంకు ఉన్న ప్రాంతంలో వందేళ్లనాటి భారీవృక్షాలు ఉన్నాయని, అలాంటి ప్రదేశంలో అద్దెకు ప్రభుత్వస్థలాన్ని ఇవ్వటం దుర్మార్గమన్నారు. ఈ విషయంపై మంత్రి సానుకూలంగా స్పందించారని శివరాం తెలిపారు. అలాగే చుక్కల భూముల సమస్య, రామాయపట్నం పోర్టు, అనుబంధ పరిశ్రమల రైతులు ఎదుర్కొంటున్న భూసేకరణ సమస్యలను కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఆయన వెంట పొడపాటి శ్రీను, తోకల వెంకటేశ్వర్లు ఉన్నారు.

రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి

● ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేతా

ఆత్మకూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషిచేద్దామని మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. గ్రా మాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిసారించి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో అవినీతి, అక్రమాలకు తావులేకుండా గ్రామసచివాలయాలు పనిచేయాల్సి ఉంటుందన్నారు. అధికారులు గ్రామాలకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా ప్రజాప్రతినిధులకు సమాచారం అందించాలన్నారు. ముందుగా వ్యవసాయశాఖ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ తదితర శాఖలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్, ఎం శ్రీనివాసరావు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడికి గాయాలు

ఉదయగిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధునికి గాయాలైన సంఘటన స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లోని నాలుగు కాళ్ల మండపం వద్ద బుధవారం జరిగింది. మండలంలోని గానుగపెంటపల్లి గ్రామానికి చెందిన జీ రామిరెడ్డి అనే వృద్ధుడు పని నిమిత్తం బస్టాండ్ నుంచి మెయిన్‌బజార్‌కు వెళుతుండగా ఆర్టీసీ డిపో నుంచి బస్టాండ్‌కు వస్తున్న బస్సు ప్రమాదవశాత్తు అతన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో అతనికి స్వల్ప గాయాలు కాగా స్థానికులు ఆటోలో చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పాఠశాలల్లో వసతుల పరిశీలన



విద్యార్థుల హాజరును పరిశీలిస్తున్న సీఆర్‌డీఏ డీఆర్పీ కల్యాణ్

ఉదయగిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో బుధవారం సీఆర్‌డీఏ డీఆర్పీ జీ కల్యాణ్ వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత, దళితవాడ ప్రాథమిక, మండలంలోని జీ.చెరువుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి మౌలిక వసతులు, క్రీడా మైదానాలు, మరుగుదొడ్లు, నాడు-నేడు పథకం కింద జరిగిన పనులు, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం పేరెంట్స్ మేనేజ్‌మెంట్ కమిటీతో గ్రామసభ నిర్వహించి పాఠశాలల స్థితిగతులపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, నరసింహ, విశ్రాంత హెచ్‌ఎం కలీం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోగి మృతిపై బంధువుల ఆందోళన

కావలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం స్థానిక ఏరియా వైద్యశాలలో చేరింది బోగోలు మండలం జువ్వలదిన్నె కాటంగారి తిరుపతమ్మ (56). ఆమెను పరిశీలించిన వైద్యులు ఆమె పరిస్థితి అనుకూలంగా లేకపోవటంతో నెల్లూరుకు తీసుకెళ్లమని చెప్పారు. మరుసటి రోజు తీసుకెళతామని వారి బంధువుల చెప్పగా బుధవారం ఉదయానికి ఆమె పరిస్థితి విషమించటంతో మృతిచెందింది. వైద్యులు సక్రమంగా వైద్యసేవలు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకే మృతి చెందినట్లు మృతురాలి భర్త మస్తానయ్య, కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. రోగి పరిస్థితిని వారికి వైద్యులు విపులంగా వివరించి తమ నిర్లక్ష్యం ఏమీలేదని వారికి నచ్చ చెప్పటంతో మృతదేహాన్ని స్వగ్రామం తీసుకెళ్లటంతో సమస్య సద్దుమణిగింది.

ప్లాస్టిక్, నిల్వ పదార్థాల వాడకంతో కేన్సర్

బిట్రగుంట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్, నిల్వ ఉంచిన ఆహారపదార్థాల తీసుకుంటే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని క్యాన్సర్ వైద్య నిపుణులు ఆళ్ల దీప్తి తెలిపారు. బోగోలు రాజాశీధిలోని షిరిడీసాయి మందిర ఆవరణంలో ఒంగోలు హెచ్‌సీజీ ఎంఎస్‌ఆర్ క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. బోగోలు ఇతర పరిసర ప్రాంతాల నుంచి 120 మందికి పాల్గొనగా వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వారిలో 16 మందికి క్యాన్సర్ నిర్ధారణ, 20మంది నుంచి స్కీనింగ్ టెస్టింగ్‌కు రక్త నమూనాలు సేకరించినట్లు సీనియర్ మెడికల్ ఆఫీసర్ జీ.వాసుబాబు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు కొర్రా చంద్రశేఖర్‌ఆనందసాగర్, ఆర్‌ఎంపీ రఫీ, వాకర్ గౌరవాధ్యక్షులు ఎస్‌ఎస్ యాదవ్, రైల్వే పెన్షన్ అసోసియేషన్ అధ్యక్షులు గోవిందరాజులు, సాయిట్రస్ట్ సభ్యులు ఐశ్వర్య, అవార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకురాలు బాలశైలజ ఉన్నారు.

సబ్సిడీ పథకాలు సద్వినియోగం చేసుకోండి

వింజమూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలు సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొంగటి రఘునాథ్‌రెడ్డి కోరారు. మండలంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి ఆయన మాట్లాడుతూ మండలానికి 43 యూనిట్లు మంజూరయ్యాయని, చాకలికొండ మడగల, వింజమూరు బ్యాంకులకు అందజేసినట్లు తెలిపారు. లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే నందమూరి బాలకృష్ణకు పద్మవిభూషణ్ అవార్డుపై హర్షం వ్యక్తం చేశారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

ఉదయగిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో విశిష్ట సేవలందించినందుకు గానుగణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డిని బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీసు సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాసులు, పోలీసు కానిస్టేబుళ్లు అశోక్, ప్రశాంత్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు

● ప్రమాదాల బారిన వాహనదారులు



వెంగళరావునగర్ వద్ద నిర్మించిన స్పీడ్ బ్రేకర్

ఉదయగిరి రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఊరురా నిర్మించిన స్పీడ్‌బ్రేకర్లు వాహనదారుల పాలిట యమపాశాలుగా మారుతున్నాయి. గ్రామాలలో దుకాణాలు, నివాసాల సమీపంలో వాటి యాజమానులు నిబంధనలను పాటించకుండా సిమెంట్‌తో ఎత్తుగా కట్టగా పోస్తున్నారు. దీంతో ఒక్కసారిగా అక్కడికి చేరుకున్న వాహనాలు అదుపుతప్పి బోల్తా పడడంతో ప్రమాదాలు జరిగిన సంఘటనలు అనేకం ఉన్నాయి. వెంగళరావునగర్, గంగిరెడ్డిపల్లిపల్లి, వరికుంటపాడు మండలంలో తూర్పుబోయమడగల, వరికుంటపాడు, జీ.కొండారెడ్డిపల్లి, గొల్లపల్లి తదితర గ్రామాల్లో ఇలాంటి పరిస్థితి నెలకొంది. ఏటవాలుగా నిర్మించక పోగా సూచిక రంగులు, బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో దూరంగా వాటిని గుర్తించలేని వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కంటికి కనిపించని విధంగా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేయడంతో రాత్రి వేళల్లో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన స్పీడ్ బ్రేకర్ల వద్ద ప్రమాదాలు జరుగకుండా తగు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

క్షతగాత్రులను వైద్యశాలలో చేర్పిస్తే ప్రోత్సాహకం



సంగం : వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న అధికారులు

సంగం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయంలో ఉన్న రోడ్డు ప్రమాద బాధితులను వెంటనే వైద్యశాలలో చేర్పిస్తే కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకం అందచేస్తుందని తహసీల్దారు సోమ్లా నాయక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయం, ప్రభుత్వ వైద్యశాలలో పలువురు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద బాధితులకు సహాయం చేసే చట్టంపై అవగాహన కల్పించారు. ప్రాణం ఎంతో విలువైనది, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను గంటలోపు వైద్యశాలకు చేర్పి వైద్యం అందేటట్లు చేస్తే వారి ప్రాణం కాపాడవచ్చున్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆత్మకూరు వాహన తనిఖీ అధికారి రాములు, స్థానిక ఎస్‌ఐ రాజేష్, వైద్యాధికారి డాక్టర్ అశోక్ పాల్గొన్నారు.

●కావలి టౌన్: సింహపురి ముసునూరు టోల్‌ప్లాజా ఆధ్వర్యంలో బుధవారం ముసునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో రోడ్డు భద్రతా వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం లావణ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రహదారి ప్రాజెక్ట్ హెడ్ శివకుమార్, ఆపరేషన్ హెడ్ ఆనంద్, టోల్‌ప్లాజా మేనేజర్ గణేష్, సేఫ్టీ ఆఫీసర్ పృథ్వీ పాల్గొన్నారు.

పంట నమోదు చేసుకోకపోతే పరిహారం రాదు



కలువాయి: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కలువాయి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరి సాగు చేసిన రైతులంతా తప్పని సరిగా పంట నమోదు (ఈ-క్రాప్) చేయించుకోవాలని, లేకుంటే పంట నష్టపోయినప్పుడు పరిహారం రాదని మండల వ్యవసాయాధికారి వీ ప్రతాప్ తెలిపారు. బుధవారం వెంకటరెడ్డిపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ ఇప్పటికి మండలంలో 94శాతం పంట నమోదు అయిందని, మిగిలిన వారు త్వరగా నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే వరిపైరులో ఎలుకల నివారణకు రాయితీపై మందు అందజేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రామకృష్ణ, హార్టికల్చర్ అసిస్టెంట్ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

●వలేటివారిపాలెం: రబీ సీజన్‌లో సాగు చేసిన అన్ని పంటలకు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని ఏఓ హేమంత్‌భరత్‌కుమార్ తెలిపారు. నేకునాంపురం, శింగమనేనిపల్లెలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శనగపంటను పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు అసిస్టెంట్ వినయ్, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రభు, రైతులు పాల్గొన్నారు.

●ఉదయగిరి: పంటల సాగులో రైతులు సస్యరక్షణ చ ర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్ సూచించారు. బుధవారం మండలంలోని నేలటూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సాగులో ఉన్న మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించారు. పంటలకు సోకిన పలు తెగుళ్లను గుర్తించి వాటి నివారణ చర్యలను సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో ఆర్గనైజర్ నాగలక్ష్మి, సిబ్బంది సురేష్, వినోద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రహరీ నిర్మాణం



ప్రహరీ నిర్మిస్తున్న గ్రామస్థులు

బిట్రగుంట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కోవూరుపల్లి గ్రామదేవత పోలేరమ్మతల్లి ఆలయ ప్రహరీ నిర్మాణ పనులు బుధవారం ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడారు. ఆలయ ఉత్తరం కడనూతల చెరువు కలుజు నీరు పారి ఆ ప్రాంతం కోతకు గురికాకుండా ఈ చర్యలు చేపట్టామన్నారు.

వాలీబాల్ నెట్ బహూకరణ

వింజమూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్పీ హైస్కూల్‌కు బుధవారం నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో సీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ సెక్రటరీ వాగల శ్రీహరి వాలీబాల్ నెట్‌ను బహూకరించారు. విద్యార్థులు క్రీడా రంగంలో రాణించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో హెడ్మాస్టర్ కె మాలకొండయ్య, పీఈటీలు సుమలత, అంజయ్య, తిరుపాలు, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యవర్గం ఎంపిక

ఉదయగిరి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక బీజేపీ కార్యాలయంలో బుధవారం మండల బీజేపీ అధ్యక్షుడు మోటపోతుల చెన్నయ్య ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మండల గౌరవాధ్యక్షుడిగా చల్లా సుబ్బరత్నం, ఉపాధ్యక్షుడిగా బీ కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా షేక్ ఖాజానాయబ్ రసూల్, కార్యదర్శిగా ఎన్.రాంనరేష్, కోశాధికారిగా శానంపూడి నరసయ్య, ట్రెజరర్‌గా ఎం బాలిరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలిగా సునోమియా, మహిళా ప్రధాన కార్యదర్శిగా ఆవుల సౌందర్యతోపాటు మరో ఎనిమిది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఆవుల రోశయ్య యాదవ్, నెల్లూరు వెంకటస్వామినాయుడు, సయ్యద్ షాజహాన్, దుగ్గయ్య పాల్గొన్నారు.

ట్రై సైకిల్ అందజేత

వలేటివారిపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తూర్పు పోలినేనిపాలెం యూపీ స్కూల్‌లో నాలుగో తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థిని బొగ్గవరపు నాగవెంకట దివ్యశ్రీకి ఉపాధ్యాయులు మాధవరావు, సుధాకర్‌రావు, మూర్తి, గిరిబాబు, రమేష్‌లు రూ.6.వేలు విలువ కలిగిన ట్రైసైకిల్‌ను బుధవారం పంపిణీ చేశారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తెస్తాం

లింగసముద్రం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అన్ని గ్రామ పంచాయతీల్లో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకోస్తామని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన పెంట్రాల, పెద పవని, ముత్యాలపాడు చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కిలారి కొండయ్య, పంచాయతీ కార్యదర్శులు మాధవరావు, షేక్ రసూల్ తదితరులు ఉన్నారు.

కేసరిగుంట కాలనీలో కార్డెన్ సెర్చ్

● పత్రాలు లేని 37 ద్విచక్ర వాహనాల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటారు సైకిళ్లు

కందుకూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక కేసరిగుంట కాలనీలో కందుకూరు సబ్ డివిజన్ పోలీసులు బుధవారం వేకువజామున కార్డెన్‌సర్చ్ నిర్వహించారు. కాలనీలోని ఇంటింటినీ తనిఖీ చేసి సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 37ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కందుకూరు, గుడ్లూరు సీఐలు వెంకటేశ్వరరావు, మంగారావు, సబ్ డివిజన్‌లోని ఎస్‌ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. స్వాధీనం చేసుకున్న మోటారుసైకిళ్ల పత్రాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా తనిఖీలు చేపడతామన్నారు. అసాంఘికశక్తులు తిష్టవేయకుండా చూడటమే తనిఖీల ముఖ్య ఉద్దేశ్యం అన్నారు.

నేడు హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ

కావలి రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సర్కిల్ నుంచి ఆర్టీవో కార్యాలయం వరకు గురువారం మహిళలతో హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆర్టీవో వై సుధాకర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ సుందరరావు పర్యవేక్షణలో జరిగే కార్యక్రమంలో మహిళలు, కళాశాల విద్యార్థినులు పాల్గొనాలని కోరారు.

రికార్డుల నిర్వహణ పకడ్బందీగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో విద్యారమ

ఉదయగిరి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయాల్లో రికార్డుల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని జడ్పీ సీఈవో విద్యారమ సూచించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలకు సంబంధించి 28 రికార్డులను ఆమె పరిశీలించారు. రికార్డుల నిర్వహణ బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విధి నిర్వహణలో విశిష్ట సేవలందించిన కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ ఖాజానవాజ్‌కు ప్రశంసాపత్రం అందజేసి అభినం దించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, కార్యాలయ ఏవో సీహెచ్ పద్మజ, జూనియర్ అసిస్టెంట్ సమద్, డీఈవో ఇమ్రాన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సీతారామపురం మండల సమావేశం

సీతారామపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన బుధవారం జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. 14మంది సర్పంచులకు గాను ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి మాట్లాడుతూ రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని మండల వ్యాప్తంగా నీటి ఎద్దడిని అరికట్టేందుకు ప్రత్యేక కార్యచరణ తయారు చేయాలన్నారు. అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో ఎంపీడీవో భాస్కర్ సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జట్పీటీసీ చెరుకుపల్లి రమణరెడ్డి, వైస్ ఎంపీపీ శారమ్మ, ఎంపిటిసి పిసి అల్లూరు రాజు, ఎంఈవో మస్తాన్‌వలి, ఈవోపీఆర్డి భార్గవి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సోమశిల, కొత్తపల్లిలో పశువైద్య శిబిరం

అనంతసాగరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమశిల, కొత్త పల్లి పంచాయతీ కాకురువారిపల్లిలో బుధవారం ఏడీ గురుజయంతి పర్యవేక్షణలో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈసం దర్భంగా మూగజీవాలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనంతసాగరం, రేవూరు పశు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

●చేజర్ల : మండలంలోని చిత్తలూరు గ్రామంలో బుధవారం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశుఆరోగ్య శిబిరం నిర్వహించి పాడిపశువులకు, దూడలకు నట్టల నివారణ మందులు అందించారు. అనంతరం పలు రకాల దాణాలను రైతులకు అందజేశారు. ఈకార్యక్రమంలో చేజర్ల పశువైద్యాధికారి డా. పి రాజేష్, స్థానిక నాయకులు మోదేపల్లి పెంచలనాయుడు, సిబ్బంది శ్రీకాంత్, సంజీదా, రియాజ్, సల్మాన్, స్థానిక పాడి రైతులు పాల్గొన్నారు.

●కొండాపురం :సాయిపేట పంచాయతీ మక్కెనవారి పాలెంలో పశుసంవర్థక శాఖ అధికారులు బుధవారం ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మధు, మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వ రరావు దూడలు, పశువులకు నట్టల నివారణకు మందులు తాగించారు. కా ర్యక్ర మంలో తాటికొండ అనూష, వైద్యసిబ్బంది శేషాద్రి, విజయ నరసింహ పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం

● రామ్మోహన్, వ్యవసాయాధికారి



మర్రిపాడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : పొలం పిలుస్తోంది కార్యక్రమం పేరుతో వారంలో రెండు రోజులు రైతుల పంటలు పరిశీలిస్తున్నామని మండల వ్యవసాయాధికారి రామ్మోహన్ శనివారం తెలిపారు. అవసరమైన ఎరువులు, పురుగు మందులు వాడేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

? పైరు ఎదుగుదల లేదని రైతులు అంటున్నారు. కారణం ఏమిటి.

! ఇటీవల 28 రోజుల పాటు పంటకు తగినంత సూర్యరశ్మి అందలేదు. అందుకు వాతావరణంలో మార్పులే కారణం.

? రైతులకు యూరియా సమృద్ధిగా దొరుకుతుందా.

! ఆర్బీకేలలో 10మంది రైతులు కలిసి ముందుగా నగదు చెల్లిస్తే అవసరమైన మేరకు వస్తుంది. మర్రిపాడు మండలంలో ఇటీవల 300 టన్నుల యూరియాను తెప్పించాము.

? రైతులకు అవసరమైన పరికరాలను ప్రభుత్వం అందిస్తుందా.

! త్వరలో స్ప్రేయర్లు, నాగళ్లు, పట్టలు వంటివి ప్రభుత్వం అందిస్తుందని ఉన్నతాధికారుల నుంచి సమాచారం ఉంది.

న్యూస్ బాక్స్

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఉలవపాడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 3న నెల్లూరు వీఆర్‌సీ హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగే సీపీఎం మహాసభల వాల్ పోస్టర్‌ను బుధవారం సీపీఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ ఆవిష్కరించారు. కరేడు పంచాయతీ పరిధిలోని రామకృష్ణాపురం ఎస్టీ కాలనీ, పీటీపీ ఫ్యాక్టరీ వద్ద సీపీఎం కమిటీ సభ్యులు, సానుభూతిపరులతో ప్రచారం నిర్వహించారు. మండలం నుంచి అధికసంఖ్యలో కార్మికులు, కూలీలు, గిరిజనలు పాల్గొనేలా సమీకరిస్తున్నారు. కార్యక్రమంలో సీపీఎం ప్రాంతీయ కమిటీ సభ్యులు కత్తి సుజాత, గంజి శ్రీనివాసులు, లోకేష్, రామలక్ష్మమ్మ, అనిల్, జ్ఞానయ్య, సుభాషిని పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రాల పరిశీలన

కొండాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గత తెలుగుదేశం ప్రభుత్వంలో నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాలను వాడుకలోకి తీసుకొచ్చేలా అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీడీవో ఆదినారాయణ రేణమాల, సత్యవోలు, గానుగపెంట పంచాయతీలలో నిర్మించిన కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఈ కేంద్రాల్లో కూరగాయలు, పూలమొక్కలు, పండ్లచెట్లను పెంచి పచ్చదనంతో తీర్చిదిద్దుతామన్నారు. ఫిబ్రవరి 15వ తేదీకల్లా మండలంలోని 18చెత్త సంపద తయారీ కేంద్రాల ను వినియోగంలోకి తీసుకొస్తానమన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నారాయణ, పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

కావలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే ట్రాక్‌కు పడమర వైపున ఉన్న ఇందిరమ్మకాలనీ రోడ్డు, రైల్వేట్రాక్ పడమర, రేడియోపార్కు, భవానీ వీధి, తుఫాన్‌నగర్, కొత్త శివాలయం వీధిలోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించి ఉన్న కట్టడాలను బుధవారం మున్సిపల్ అధికారులు గుర్తించి ఎక్స్‌కవేటర్‌తో తొలగింపజేశారు. కమిషనర్ శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళికాధికారి వివేకానంద ఆధ్వర్యంలో ప్రణాళికా విభాగం సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

కావలి టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్ భారతీ కళాశాల డీఆర్ క్రీడా ప్రాంగణంలో బుధవారం జరిగిన అథ్లెటిక్ మీట్ క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో జూనియర్, డిగ్రీ కళాశాలలు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొ న్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విక్రమసింహపురి యూనివర్సిటీ రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి పాల్గొని పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో జేబీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ సుబ్రమణ్యం నాయుడు, శామ్యూల్‌రాజ్, ఎస్తేర్‌బ్యూలా పీడీ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

13 మంది విద్యార్థుల ఎంపిక

కావలి టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోఆపరేటివ్ కాలనీలోని ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఫస్ట్‌సోర్స్ కంపెనీవారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 13మంది విద్యార్థులు ఎంపిక య్యారు. కళాశాల కరస్పాండెంట్ రాజ్ కుమార్‌చౌదరి ప్రిన్సిపాల్ ఉమ వీరిని అభినందించారు. 40మంది పాల్గొనగా 13 ఎంపికయ్యారు.

చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

దుత్తలూరు(ఉదయగిరి), జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన వారికి ఏపీజీబీ మేనేజర్ టీ రాణిభారతి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పీ రవి కుమార్, అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్వరి, క్యాషియర్ షాకీర, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.